ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Khammam, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-9-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 216 పేజీలు: 12వెల: 6.50

ఎన్డీయె కూటమిలో తేలని సర్దుబాట్లు

ముంబయి మహానగరానికి మానవ బాంబుల ముప్పు

9లో



శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన మంత్రి లోకేష్

## ప్రధాని మోడీతో మంత్రి లోకేష్ భేటీ

### రాష్ట్రంలో పెట్టుబడుల సాధనకు సహకరించాలని వినతి

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు సహకారం అందించాలని కోరారు.ఏపీలో సెమీ కండక్టర్ యూనిట్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలో ఐటి,ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని >>2

## గురువు స్ఫూర్తితో ముందుకు

విజ్ఞానంతోపాటు లౌకికం కూడా పెంపొందించుకోవాలి

పిల్లలకు పుస్తకాల బరువు తగ్గించాం

ఆంధ్ర వర్సిటీకి 4వ ర్యాంక్ శుభపరిణామం

నేను నిత్యవిద్యార్థిని..రోజూ నేర్చుకుంటా: సిఎం చంద్రబాబు



శుక్రవారం విజయవాడలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రసంగిస్తున్న చంద్రబాబు. చిత్రంలో మంత్రులు సత్యకుమార్, లోకేష్ తదితరులు


**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** పిల్లల్లోవిజ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్న వారందరికీ సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. విజయవాడ ఏ కన్వెన్షన్‌లో గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, సత్యకుమార్ యాదవ్ లతోపాటు ఇతర నేతలు పాల్గొన్నారు. విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్ బెస్ట్ ప్రాక్టీసెస్ విధానాలను సీఎం పరిశీలించారు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని మంత్రి లోకేశ్ కు సీఎం సూచించారు. విద్యార్థులు జాతీయ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు సాధించేలా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. ఎన్ ఐఆర్ ఎఫ్ ర్యాంకింగ్‌లో ఆంధ్రవర్సిటీకి 4వ ర్యాంకు రావడం శుభపరిణామమన్నారు, ఇలాంటి ర్యాంకులు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. అలానే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా నెలకొల్పిన గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్‌ను నిర్వాహకులు ముఖ్యమంత్రికి అందించారు. గురుపూజోత్సవం చాలా పవిత్రమైన కార్యక్రమమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. విజయవాడలో ఏ సమావేశ ప్రాంగణంలో దివంగత భారత రాష్ట్రపతికి విగ్రహానికి నివాళి అర్పించారు.జ్యోతి ప్రజలన అనంతరం మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత మనం గుర్తు పెట్టుకునేది ఉపాధ్యాయులనే అని, అలాంటి వారిని జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేమని అన్నారు. విద్యార్థి దశలో పిల్లల్లో స్ఫూర్తిని కలిగించేది, అలానే మనలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి బయటకు తీసేది గురువేనని తెలిపారు. భక్తవత్సలం అనే ఉపాధ్యాయుడు నా జీవితంలో స్ఫూర్తి నింపారని, నేను నిత్య విద్యార్థిని ప్రతిరోజు ఏదో ఒకటి నేర్చుకుంటానని సీఎం వివరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం మనకు ఆదర్శప్రాయమని చెప్పారు. రాధాకృష్ణన్ రేణిగుంట పాఠశాలలో టీచర్‌గా, ఏయూలో ఆచార్యుడిగా పని చేశారని అన్నారు. గత ఏడాది బుడమేరు వరదల కారణంగా గురుపూజోత్సవం జరుపుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేసారు. 175 మంది ఉపాధ్యాయులు ఇచ్చిన సూచన, సలహాలతో వారి ఫొటోలతో పుస్తకాన్ని ముద్రిస్తామని వెల్లడించారు. సాధారణంగా రాజకీయ నాయకుల పిల్లలు చదువుకోరు కాని మా ఇంట్లో లోకేశ్ చదువు గురించి నా భార్య భువనేశ్వరి చూసేవారన్నారు.ఈ విషయంలో ఆ క్రెడిట్ ఆవిడదేనని సీఎం అన్నారు.విద్యను రాజకీయాలకు దూరం >>2

## తురకపాలెం ఘటనపై ప్రభుత్వం సీరియస్

అధికారుల అలసత్వంపై సిఎం మండిపాటు

వారం రోజులపాటు బాధితులకు ఆహారం, నీరు సరఫరా

నేడు రక్త, నీటి నమూనాల సేకరణకు 50 బృందాల రాక



శుక్రవారం తురకపాలెంలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబరు 5:** గుంటూరు జిల్లా తురకపాలెంలో 5 నెలలుగా చోటుచేసుకుంటున్న మహమ్మారితో మృతులపై రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో సీరియస్ అయ్యింది. అయిదు నెలలుగా మహమ్మారి వెంటాడుతున్నా ఎందుకు అలసత్వం వహించారంటూ జిల్లా వైద్యఅధికారులపై ప్రభుత్వం మండి పడినట్టు సమాచారం. పదుల సంఖ్యలో చనిపోయినా పట్టించుకోరా. అంటూ అధికారులను ప్రభుత్వం తీవ్రంగా హెచ్చరించినట్టు తెలిసింది. తురకపాలెం ఘటన నివేదికపై సమీక్షించిన సిఎం చంద్రబాబు ముమ్మర చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. బాధితులందరికీ తాము ఉన్నామంటూ ధైర్యం చెప్పాలంటూ వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఆ గ్రామానికి వెళ్లాలని సిఎం ఆదేశించటంతో శుక్రవారం తురకపాలెంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటించి ఘటనపై ఆరా తీశారు. ఊరులోని అన్నివీధుల్లో పర్యటించి బాధితుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.మహమ్మారి కబళించిన బాధిత కుటుంబాలకు వెళ్లిన సత్యకుమార్ వారిని ఓదార్చి పరామర్శించారు. మహమ్మారి ప్రబలటంపై కారణంపై నివేదికలకు ఆదేశించామని, త్వరలో రానున్న >>2




## 18 నుంచి అసెంబ్లీ

### 14,15న తిరుపతిలో మహిళా ఎమ్మెల్యేల జాతీయ సదస్సు

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీసమావేశాలు ఈ నెల 18వ తేదీ నుంచి జరుగబోతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు.అసెంబ్లీ సమావేశాలు18వతేదీ ఉదయం 9గంటలకు, కౌన్సిల్ సమావేశాలు ఉదయం 10గంటలకు మొదలవుతాయి. మొదటి రోజుసమావేశం అనంతరం ఉభయ సభల బిఏసిసమావేశాలు జరుగుతాయి. >>2

## సిట్ విచారణలో వైఎస్ అనిల్ రెడ్డి పిఎ

**విజయవాడ, సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ప్రత్యేక దర్యాప్తు సంస్థ ( సిట్) శుక్రవారం కీలక పురోగతి సాధించింది. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ సోదరుడు, ఆయనకు అత్యంత సన్నిహితు వైఎస్ అనిల్ రెడ్డి వద్ద పీఏగా విధులు నిర్వహిస్తున్న దేవరాజులను ఉన్నతాధికారులు శుక్రవారం సిట్ కార్యాలయానికి పిలిపించారు. మద్యం కుంభకోణం వ్యవహారంలో పలువురి పాత్రపై ఆయనకు ప్రశ్నలు సంధించి.. అతని నుంచి జవాబులు రాబడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విచారణలో అతడు ఇచ్చే సమాచారం ఆధారంగా ఈ కేసు కీలక పురోగతి సాధిస్తుందని సిట్ అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ మద్యం కుంభకోణంలో ఇప్పటి వరకు పలువురిని సిట్ అధికారులు విచారించారు. ఆ క్రమంలో 12 మందిని అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఇక ఇదే కేసులో జగన్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం, మంత్రిగా పని చేసిన నారాయణ స్వామిని సైతం సిట్ అధికారులు విచారించారు. ఈ సందర్భంగా ఆయన స్టేట్‌మెంట్‌ను వారు రికార్డు చేసుకున్నారు.జగన్ ప్రభుత్వం హయాంలో మద్యం విక్రయాల లావాదేవిలన్ని నేరుగా జరిగాయి. అంటే ఎక్కడ డిజిటల్ చెల్లింపులు అనేవి జరగలేదు. ఈ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యం విక్రయాలకు తెర తీశారు. ఈ మద్యం తాగడం వల్ల అనేక మంది మృత్యువాత పడ్డారు. అలాగే పలువురు అనారోగ్యానికి గురయ్యారు. అంతేకాకుండా.. ఈ మద్యం విక్రయాల్లో భారీగా అవినీతి చోటు చేసుకుందంటూ ఆరోపణలు సైతం వెల్లువెత్తాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి ఓటరు పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం మద్యం కుంభకోణంపై సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డిను సిట్ అధికారులు అరెస్ట్ చేసి.. విచారించారు. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డితోపాటు బాలాజీ గోవిందప్ప తదితరులను అరెస్ట్ చేశారు. వీరికి బెయిల్ కోసం కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కానీ వీరికి కోర్టు మాత్రం బెయిల్ మంజూరు చేయడం లేదు. దాదాపు రూ 3,500 కోట్ల మద్యం కుంభకోణం జరిగినట్లు తెలుస్తోంది. అదీకాక.. ఈ కేసు విచారణలో భాగంగా హైదరాబాద్ శంషాబాద్‌లో రూ. 11 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ మద్యం కుంభకోణం ద్వారా సంపాదించిన నగదుతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రాజ్ కసిరెడ్డి పలు ఆస్తులు కొనుగోలు చేసినట్లు గుర్తించి.. వారిని సైతం సిట్ అధికారులు జప్తు చేసింది.

## పెట్టుబడులకు మరింత ప్రోత్సాహం

ఉపాధి, ఉద్యోగావకాశాలే లక్ష్యం: సిఎం చంద్రబాబు

భవనాల గరిష్ఠ ఎత్తు 24 మీటర్లకు పెంపు

నాయుడుపేటలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు ఏర్పాటు



**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఉపాధి,ఉద్యోగ అవకాశాల కల్పన కీలకంగా ప్రభుత్వం పెట్టుబడులకు ముందస్తు ప్రోత్సాహకాలు అందిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.నాయుడుపేటలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు, కాపర్ క్లాడ్ లామినెట్ ప్లాంట్, ఈఎంఎస్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ లిమిటెడ్, దాని సంయుక్త వెంచర్లకు 26.70 ఎకరాల కేటాయించారు. రూ.1,595 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడి పెడుతున్నారు. దీంతో 2,168 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇంటిగ్రేటెడ్ అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ ఫెసిలిటీని ఏర్పాటు చేసేందుకు హిండాల్కో ఇండస్ట్రీస్ చేసిన ప్రతిపాదనకు తాజా మంత్రి మండలి సమావేశంలో ఆ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెలలోనే జరుగునున్న అసెంబ్లీ సమావేశాల్లో మంత్రిమండలిలో ఆమోదించిన పథకాలన్ని చట్టపరమైన ఆమోదం నిమిత్తం ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు.శుక్రవారం సీఎంవో ద్వారా అందించిన సమాచారంలో పెట్టుబడికి ముందస్తు ప్రోత్సాహకాలుగా రూ.586 కోట్ల అందచేయడం ద్వారా 613 మందికి ఉద్యోగాలు లభించనున్నాయని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు. ఈ సౌకర్యం ఆపిల్‌తో సహా ప్రపంచ సాంకేతిక సంస్థలకు నాణ్యత కలిగిన అల్యూమినియం ఉత్పత్తులను తయారు చేస్తుంది. తిరుపతి మండలం సెట్టిపల్లి గ్రామంలోని అందరికీ ఇళ్ల విధానం ప్రకారం ప్రతి ప్లాట్ యజమానికి కనీసం 2 సెంట్లు కేటాయించేందుకు 2019లో రెవెన్యూ శాఖ చేసిన సవరణ ఆమోదించారు. ఎక్సైజ్ చట్టాన్ని సవరిస్తూ కుష్ఠు వ్యాధి లేదా ఏదైనా ఇతర అనే పదాలను తొలగించేందుకు ఉద్దేశించి ముసాయిదా బిల్లుకు ఆమోదం. రాష్ట్రంలోని 16 జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి దీపం2 పథకం ద్వారా 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లు ఇస్తున్నారు. అయితే ఇక పై వీరికి 14.2 కిలోల గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. 5 కిలోల సిలిండర్లు ఉన్న లబ్ధిదారులకు ఇప్పటివరకూ 14.2 కిలోల సిలిండర్లకు ఇచ్చే రాయితీ అందలేదు. దీనిపై తాజాగా మంత్రిమండలి నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.. దీని ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లోని 23,912 మందికి ప్రయోజనం కలుగుతుంది.ఏపీలో భవనాల గరిష్ఠ ఎత్తు పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచనున్నారు. ఈ మేరకు శాసనసభలో బిల్లు ప్రవేశపెడతారు. మంత్రిమండలిలో తీసుకున్న నిర్ణయాలను సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అందులో ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి.

2025 జనవరి 1 లేదా ఆ తర్వాత రాజధాని అమరావతిలో విద్యా ఆరోగ్య సంరక్షణ సంస్థలకు భూమిని కేటాయించారు. అయితే వీటి అమ్మకం లేదా లీజు డీడ్ ఒప్పందాలను అమలు చేసే సందర్భంలో రీయింబర్స్‌మెంట్ ప్రాతిపదికన స్టాంపు డ్యూటీ చెల్లింపు నుంచి మినహాయింపు ఇచ్చే ప్రతిపాదన ఆమోదించారు. పారిశ్రామికాభివృద్ధి విధానం 2024- 29లోని ఎర్లీబర్డ్ పథకం కింద అదానీ విల్మర్ లిమిటెడ్, రామ్ షీ బయో ప్రైవేట్ లిమిటెడ్, బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్, టైరోమర్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, పట్టాభి ఆగ్రోఫుడ్స్‌లకు ప్రోత్సాహకాలు అందించేందుకు గతంలో చేసిన సిఫార్సులను ఎస్ఐపీబీ ఆమోదించింది.

స్పేస్ సిటీకి సంబంధించి తదుపరి నాలుగు ప్రధాన తయారీ ప్రతిపాదనలకు ఎకరానికి రూ.5లక్షలు కేటాయించారు. ఎర్త్ స్టోరబుల్ ఇంజిన్ టెస్ట్ ఫెసిలిటీ, క్రయోజనిక్ ఇంజిన్ టెస్ట్ ఫెసిలిటీ, క్రయోజనిక్ ఇంజిన్ టెస్ట్ ఫెసిలిటీ2 సదుపాయాలను ఈ స్పేస్ సిటీలో కల్పించనున్నారు. రూ.427 కోట్ల పెట్టుబడితో మదర్ డైరీ ఫ్రూట్, వెజిటెబుల్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా 180 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.



## 9.5 లక్షల మె.ట ఎరువుల కేటాయింపు

### రబీసీజన్‌కు ఎలాంటి కొరతలేదు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో యూరియాకు ఎటువంటి కొరత లేదని ఈ విషయంలో ఎటువంటి దుష్ప్రచారం నమ్మవద్దని ఏపీ వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేసారు.రాష్ట్రంలో యూరియా నిల్వలు, పంపిణీ, సరఫరాలపై క్రిష్ణా, ఎన్టీఆర్, శ్రీకాకుళం, బాపట్ల, విజయనగరం, కడప, ఏలూరు,శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు, ఈ.ఓ స్పెషల్ సిఎస్ రాజశేఖర్, డైరెక్టర్ ఢిల్లీరావులతో టెలీ కాన్ఫరెన్స్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిర్వహించారు. యూరియా సరఫరా సమస్యలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను అధిగమించాలని సూచించిన మంత్రి అచ్చెన్నాయుడు.భవిష్యత్ అవసరాల కోసం రబీ సీజన్ కు 9.5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు ఇప్పటికే రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న మంత్రి అచ్చెన్నాయుడుఅధికారిక లెక్కలకు, గ్రౌండ్ లెవల్ లో ఉన్నటువంటి యూరియా నిల్వలకు తేడా లేకుండా పర్యవేక్షణ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు.జిల్లాలో ఉన్నటువంటి యూరియా నిల్వల గురించిన వివరాలను అత్యవసరంగా అందచేయాలని కలెక్టర్లను ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు..కిష్ణా, బాపట్ల, కడప, జిల్లాల్లో ఇబ్బందులు ఎక్కువగా వస్తున్నాయని వీటిపై త్వరితగతిన స్పందించి కలెక్టర్లు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు.యూరియా నిల్వలు ఎక్కువగా ఉన్నటువంటి ప్రాంతాల నుండి డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు యూరియా సరఫరా చేసే విధంగా కలెక్టర్లు చర్యలు చేపట్టాలి, రవాణా ఖర్చులను ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకుంటామన్న మంత్రి అచ్చెన్నాయుడు..గంగవరం, కాకినాడ పోర్టుల నుండి రాష్ట్రానికి రావలసిన 53 వేల మెట్రిక్ టన్నుల యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరుకునే విధంగా పోర్ట్ అధికారులు, రైల్వే అధికారులతో రాష్ట్ర అధికారులు సమన్వయం చేసుకొని అనుకున్న సమాయానికి యూరియా అందే విధంగా సమన్వయం చేసుకోవాలని తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు.సోషల్ మీడియాలో, వార్తా పత్రికల్లో వచ్చే తప్పుడు కథనాలపై స్పందించాలని, ప్రతిరోజు వాస్తవికత విషయాలను, యూరియా నిల్వల గురించి కలక్టర్లు మీడియాకు వివరించాలని ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు.



## సిఎం చంద్రబాబుకు కొత్త హెలికాప్టర్

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబు భద్రత దృష్ట్యా కొత్త హెలికాప్టర్‌ను వినియోగిస్తున్నారు. రెండు వారాలుగా ఇందులోనే జిల్లాల పర్యటనలకు వెళ్తున్నారు. ఇటీవలి వరకు వాడిన బెల్ తయారీ ఛాపర్ పాతది కావడంతో అధునాతన ఫీచర్లతో కూడిన ఎయిర్‌బస్ హెచ్160 మోడల్ హెలికాప్టర్‌కు మారారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రయాణాలకు అనువుగా ఉంటుందని నిపుణులు దీన్ని ఎంపిక చేశారు. పాత ఛాపర్ ఎక్కువ దూరం ప్రయాణానికి పనికొచ్చేది కాదు. సీఎం ఏదైనా జిల్లాకు వెళ్లాలంటే ఉండవల్లి నివాసంలోని హెలిప్యాడ్ నుంచి ఛాపర్‌లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో వెళ్లాల్సిన ప్రాంతానికి సమీపంలోని ఎయిర్‌పోర్టుకు వెళ్లేవారు.



## రూ.65వేల కోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు

### అవసరమైన భూములు రిలయన్స్‌కు కేటాయించాలి: సిఎస్ విజయానంద్

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రిలయన్స్ ఆధ్వర్యంలో రూ.65 వేల కోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటుకు అవసరమైన భూములు త్వరితగతిన అప్పగించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. రిలయన్స్ సంస్థకు 9 జిల్లాల్లో 2.34 లక్షల ఎకరాల భూమిని అప్పగించాలన్నారు. వృధాగా పోతున్న వర్షపు నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని అన్ని చెరువులను పూర్తిగా నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటి సంరక్షణ భూగర్భ జలాలు పెంపును కలెక్టర్లు బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. యూరియా, పరిశ్రమలు, గురుకులాలు, కెజిబివిలు తదితర అంశాలపై ఈ సమావేశంలో కలెక్టర్లకు సూచనలు ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం సరిపడి యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ రైతులకు విజ్ఞప్తి చేశారు..మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,భుగర్భ జలాలు,పియం కుసుమ్,కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లకు భూమి అప్పగించుట,స్వచ్ఛాంధ్ర అవార్డులు తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో రిలయెన్స్ సంస్థ ద్వారా ఏర్పాటు చేయనున్నకంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లకు సంబంధించి మొదటి దశ కింద 9 జిల్లాల్లో 2లక్షల 34 వేల ఎకరాల భూమిని గుర్తించడం జరిగిందని ఆయా భూములను త్వరిత గతిన అప్పగించాలని కలక్టర్లను ఆదేశించారు.అనంతరం మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,భూగర్భ జలాల పెంపు అంశాలపై మాట్లాడుతూ వృధాగా పోతున్న వర్షపు నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు అన్ని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను పూర్తిగా నింపేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

06-09pg2exHMWNJQE 2ND_06-09pg2exHMWNJQE.qxd 9/6/2025 12:40 AM Page 1



# ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం

## మీడియేషన్, ఆర్బిట్రేషన్‌లతో వివాదాలకు పరిష్కారం

## విశాఖలో ఎడిఆర్ సెంటర్ ఏర్పాటుకు సిద్ధం



శుక్రవారం విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**విశాఖపట్నం, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం అందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ వ్యవస్థలో మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలే ముఖ్య భూమిక పోషిస్తాయని అన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ద్వారా న్యాయం అందరికీ అందుబాటులోకి రావటంతో పాటు వేగంగా సమర్థవంతంగా చేరుతుందన్నారు. మీడియేషన్ అంశం భారత్ కు కొత్తకాదని తరాలుగా మనకు అందుబాటులో ఉందని తెలిపారు. పురాణాల్లో శ్రీకృష్ణుడు ఓ సమర్థవంతమైన మీడియేటర్ గా వ్యవహరించారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గతంలో మన పూర్వీకులు, గ్రామపెద్దలు సమర్థంగా మీడియేషన్ ప్రక్రియను నిర్వహించేవారని తెలిపారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ విశాఖపట్నంలో జ్యుడీషియల్, మధ్యవర్తిత్వ రంగాలపై చారిత్రాత్మక కాన్ఫరెన్స్ నిర్వహించటం సంతోషదాయకమని ప్రజాస్వామ్యంలో భారతీయ న్యాయవ్యవస్థ ఓ మూల స్తంభంలాంటిదన్నారు. రాజ్యాంగపరమైన హక్కుల్ని, చట్టాన్ని కాపాడే అత్యంత కీలకమైన వ్యవస్థ. నిబద్ధతకు, నిష్పాక్షి కతకు, పారదర్శకతకు పెట్టింది పేరు. కొన్ని సమయాల్లో కాస్త ఆలస్యమైనా న్యాయం దక్కుతుందనే నమ్మకం ప్రతీపౌరుడికీ ఉంది. భారత్ అత్యంత వేగంగా సంస్క రణల్ని అమలు చేస్తోందేన్నారు. గత ఏడాదిగా ఏపీలో వంద బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయి. ప్రతిష్టాత్మక సంస్థలు తమ కార్యకలాపాలు ఏర్పాటు చేస్తున్నాయి. కంపెనీలు, వ్యవస్థలు వస్తున్న నేపథ్యంలో వివాదాల పరిష్కారానికి మీడియేషన్ లాంటి ప్రత్యామ్నాయ న్యాయ వ్యవస్థలు అందుబాటులోకి రావాలి. ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ సిస్టం రావాలి. సులభంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు టెక్నాలజీని కూడా అందిపుచ్చుకోవాలి." అని అన్నారు. విశాఖలో ఏడీఆర్ ఎకో సిస్టం ఏర్పాటుకు సిద్ధంవిశాఖలో ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. పెరిగిపోతున్న వివాదాలు, కేసుల పరిష్కారానికి కొత్తగా కోర్టులు ఏర్పాటు చేయటంతో పాటు మీడియేషన్, ఆర్బిట్రేషన్ కు కొత్త వ్యవస్థలు రావాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికీ చాలా మంది పౌరులు కేసులు దాఖలు చేసి కోర్టులకు వెళ్లటం అవమానంగా భావిస్తారని దీన్ని మీడియేషన్ ప్రక్రియ చక్కని పరిష్కారమని అన్నారు. దేశం అమలు చేస్తున్న సంస్కరణలు, కొత్త వ్యవస్థలు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో వివాదాలు తగ్గించుకోవటమే ఆర్థిక వ్యవస్థకు కీలకం అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. దానికి అనుగుణంగా వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వ్యవస్థలను రూపొం దించుకోవాల్సి ఉందన్నారు. ఈజ్ ఆఫ్ జస్టిస్ ప్రక్రియలో భాగంగా వర్చువల్ హియరింగ్స్, ఈఫైలింగ్, మొబైల్ అప్‌డేట్స్ లాంటి సాంకేతికతను అమలు చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఏపిలో ఈ ప్రక్రియ చాలా అవసరంప్రస్తుతం ఏపీలో 650 మంది జడ్జిలు ఉన్నారు. కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు మరో 800 మంది న్యాయమూర్తులు అవసరముందని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీరజ్ సింగ్ ఠాగూర్ అభిప్రాయ పడ్డారు.ప్రస్తుతం మీడియేషన్ ప్రక్రియ చాలా అవసరం . మీడియేషన్ నిపుణులను తయారు చేసేందుకు 40 గంటల ట్రైనింగ్ అవసరం అవుతుందన్నారుమీడియేషన్ చేసే వారికి చాలా నైపుణ్యం ఉండాలి. దానిని కొలిచేందుకు ఓ ప్రత్యేకమైన సర్టిఫికేషన్ ఉండాలి ఆర్బిట్రేషన్ రంగంలోకి విశ్రాంత న్యాయమూర్తులు, బ్యూరోక్రాట్లు వస్తున్నారు. హానెస్ట్, డిస్హానెస్ట్ ఆర్బిట్రేటర్లు కూడా ఉన్నారు. దీనికో ప్రత్యేకమైన యంత్రాంగం ఉండాలని భావిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పీఎస్ నరసింహా, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయ మూర్తులు, న్యాయ నిపుణులు హాజరయ్యారు.

# 18 నుంచి అసెంబ్లీ

>> ఆ రోజు సమావేశాల ఏజెండా, ఎన్ని రోజులు సభలు జరగాలి అనే అంశంపై నిర్ణయం తీసుకుంటారు. ఈ సారి కూడా అసెంబ్లీ సమావేశాలకు హజరు కాబోమని ఇప్పటికే వైసీపీ అధినేత జగన్ చెప్పారు. అయితే, వరుసగా 60 అసెంబ్లీ పని దినాలు హజరుకానిపక్షంలో అనర్హత వేటు పడుతుందని ఇప్పటికే డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజు వైసీపీ నేతల్ని హెచ్చరించారు. తిరుపతిలో సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశానికి దేశంలోని అన్ని రాష్ట్రాల పరిధిలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన సుమారు 300 మంది మహిళా ఎమ్మెల్యేలు సదస్సుకు హాజరు కాను న్నట్టు ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి తొలిరోజు సీఎం చంద్రబాబు, లోక్‌సభ స్పీకర్ హాజరవుతారు. సమావేశాల ముగింపు రోజున గవర్నర్ హాజరుకానున్నారని ఏపీ స్పీకర్ తెలిపారు. సదస్సుకు హాజరయ్యే ఎమ్మెల్యేలకు శ్రీవారి దర్శనం కల్పించిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సెప్టెంబరు 18 నుంచి శాసనసభ సమావేశాలు జరగుతాయని, ఎమ్మెల్యేలకు సమాచారం పంపించినట్టు అయ్యన్న పేర్కొన్నారు.

# అలిపిరి మెట్ల మార్గంలో 'కంచె' అవశ్యం

## హైకోర్టు ఆదేశాలతో నడకదారి భక్తుల భద్రతకోసం టిటిడి చర్యలకు అడుగులు



**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** "ఏడుకొండలవాడ గోవిందా...తిరుమలవాసా గోవింద"నామస్మరణతో భక్తితో కాలినడకన అలిపిరి మెట్లమార్గంలో తిరుమలకు చేరుకునే భక్తులకు పూర్తిస్థాయిలో రక్షణకల్పించాలని హైకోర్టు ఆదేశాలతో ఇప్పుడు తక్షణకర్తవ్యంపై టిటిడి ఆలోచన చేయాల్సిన అవసరం వచ్చింది. నడకమార్గంలో ఇరువైపులా ఇనుప "కంచె"ఏర్పాటుకు మూడునెలల్లో చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఇందుకు జెఎసి కూడా ఏర్పాటుచేసుకుని తగిన విధంగా స్పందించాలని న్యాయస్థానం ఆదేశాలతో టిటిడి అధికారులు ,అటవీశాఖ వన్యప్రాణిసంరక్షణవిభాగం సంయుక్తంగా కంచె పై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈనెలలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనుండటం, 24వతేదీ సిఎం చంద్రబాబునాయుడు తిరుమలకు వస్తుండటంతో హైకోర్టు ఆదేశాలపై టిటిడి ధర్మకర్తలమండలి, అధికారులు చర్చించి తదుపరి కంచె ఏర్పాటుకు ఉపక్రమించనున్నారనేది తెలుస్తోంది. రెండుసంవత్సరాల క్రిందట అలిపిరి మెట్లమార్గంలో ఓ చిన్నారిని చిరుతపులి లాక్కెళ్ళి చంపితినిన దారుణ విషాద ఘటన తరువాత అలిపిరి నడకమార్గంలో కంచె శరణ్యమని భక్తులు,నిపుణులు సూచనలు చేశారు. అయితే అప్పటి టిటిడి పాలకమండలి అందుకు చర్యలు తీసుకునే దిశగా కార్యాచరణ సిద్దంచేసినా చివరకు వన్యప్రాణిచట్టం అంగీకరించకపోవడంతో ఆలోచనకు బ్రేక్ పడింది. ఇప్పుడు మళ్ళీ నడకమార్గంలో చిరుతపులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు సంచారంతో భక్తులు భయపడుతున్నారు. భక్తులను చిరుతపులి గాయపరిచిన ఘటనలు ఉన్నాయి.దీంతో కాలినడక మార్గానికి ఇరువైపులా కంచె ఏర్పాటుచేయాలని హైకోర్టు న్యాయస్థానం ఆదేశాలతో టిటిడి ముందుకు కదలనుంది.

శేషాచలం అటవీప్రాంతంలో కొండలను విడదీసి కొన్ని ఏళ్ళక్రిందట నడకమార్గాలను ఏర్పాటుచేసిన టిటిడి ఇరువైపులా రక్షణకంచె విషయం అప్పట్లో అవసరం లేకపోయింది. ఇప్పుడు వన్యప్రాణులు యధేచ్ఛగా అడవులను వదలి జనసంచారంలోకి వస్తుండటంతో భక్తుల భద్రతపై పునరాలోచన చేయాల్సివస్తోంది. తిరుమలకు ఎంతో పవిత్రంగా,భక్తితో కాలినడకన వచ్చే భక్తులకు నడకమార్గాల్లో క్రూరమృగాల నుంచి పూర్తి రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. సుమారు 8కిలోమీటర్లు దూరం దట్టమైన కొండల మధ్య ఉన్న అలిపిరి కాలినడక మార్గం మెట్లదారికిరువైపులా అటవీప్రాంతమే. మెట్లమార్గానికి రెండువైపులా ఎత్తయిన రక్షణ గోడలు లేకపోవడం, అడవికి ఆనుకునే ఉండటంతో ఎటువైపు నుండి ఎప్పుడు,ఎక్కడ ఎలా చిరుతలు, ఎలుగుబంట్లు భక్తులపై దాడిచేస్తాయో తెలియని భయం. ఈ నేపథ్యంలో భక్తుల రక్షణకు మెట్లమార్గంలో బలమైన ఇనుప"కంచె" ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన హైకోర్టు ఆదేశాలతో ఆచరణకు రానుంది. గతంలో 2023లో చిన్నారిని చిరుతపులి చంపి తినడంతో భక్తుల రక్షణకు ప్రాధమికంగా చేతులకు "ఊతకర్రలు"ఇచ్చి పంపారు. తిరుమలకొండలు రిజర్వుఫారెస్టు ప్రాంతంలో ఉన్న కాలినడక మార్గాల్లో వన్యప్రాణుల సంచారం యధేచ్ఛగా ఉండేలా చూడటం అటవీశాఖ చట్టంలోని అంశం. అయితే అందుకు భిన్నంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలకొండకు దారులు పూర్తిగా దట్టమైన అడవిని చీల్చి మధ్యలో ఏర్పాటుచేసినవేకావడం విశేషం. దేవునిపై విశ్వాసంతో సాధారణరోజుల్లో 20వేలమంది వరకు భక్తులు నడకమార్గంలో తిరుమలకు వస్తున్నారు. తరచూ చిరుతలు కాలినడక మార్గాల్లో, ఘాట్‌రోడ్లలో భక్తులను వెంబడించడం, దాడిచేయడం,గాయాలతో విడిచిపెట్టడం జరుగుతున్నాయి. కంచె ఏర్పాటు చేస్తే భక్తులకు రక్షణ కల్పించవచ్చనేది హైకోర్టు ఆదేశాలు. శేషాచలంఅడవిలో వందకుపైగా చిరుతలు సంచరిస్తున్నా దాదాపు 10వరకు చిరుతలు ఇటు ఘాట్‌రోడ్లలో,కాలినడక మార్గాల్లో సంచరిస్తున్నాయనేది ఇటీవల తెలిసిన విషయం. అయితే నడకమార్గాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసిన ట్రాఫ్ సిసికెమెరాల నిఘాతో నాలుగు చిరుతలు మాత్రమే అడవిలో ఇటు ఘాట్‌రోడ్లు, అటు నడకమార్గాల వైపు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికీ నడకమార్గంలో భక్తులకు భద్రత సిబ్బంది తోడుగా రక్షణకల్పిస్తున్నారు. భక్తులను గుంపులుగా అనుమతినిస్తున్నారు.

# గురువు స్ఫూర్తితో ముందుకు

>> గా ఉంచాం. గురువులు చూపించిన దారిలో నడవడం వల్లే తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకోగలిగానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పిల్లల జీవితాలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని, విద్యాశాఖలో ఏడాదిలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. అందరం కలిసి కట్టుగా ఆంధ్రా మోడల్ విద్యా వ్యవస్థను ప్రపంచానికి చాటుదామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యలో రాజకీయాలను దూరం పెట్టాలని సూచించారు. లీప్ మోడల్‌ను అందరం కచ్చితంగా అమలు



ఉత్తమ ఉపాధ్యాయురాలికి అవార్డు అందచేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

చేయాలని సూచించారు. అలానే మెగా పేరెంట్‌టీచర్ సమావేశాలు ఏర్పాటు చేశామని ఇంకా పిల్లలను యోగా, క్రీడలు, ఎన్‌సీసీ వైపు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అలానే కొన్ని పథకాలకి సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ పేర్లు పెట్టామని తెలిపారు. భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం అందరికి ఆదర్శప్రాయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి రోజు తాను ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉంటానన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. టీచర్లను జీవితంలో ఎప్పుడూ మరచిపోలేమన్నారు. తాను కూడా టీచర్ కావాల్సిందన్నారు. లెక్చరర్‌గా చేరాలని యూనివర్సిటీ వీసీ తనను కోరారని తెలిపారు. లెక్చరర్‌గా కాదు ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఆయనకు తెలిపానని చెప్పారు. హైదరాబాద్‌ను నెంబర్‌వన్‌గా చేసేందుకు తాను ఎంతో కష్టపడ్డానని పేర్కొన్నారు. ప్రపంచంలో తెలుగు వారు నెంబర్ వన్‌గా ఉండాలన్నదే తన కోరిక అని తెలిపారు. ఐఐటీ కోచింగ్ విషయంలో చుక్కా రామయ్య కచ్చితంగా ఉండేవారన్నారు. సీఎం సిఫార్సు చేసినా సీటు ఇవ్వబోనని ఆయన నిక్కచ్చిగా చెప్పేవారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అందుకే చుక్కా రామయ్య అంటే తనకు ఎంతో గౌరవం పెరిగిందని చెప్పారు. 10 వేలమంది దరఖాస్తు చేస్తే 100 మందికే ఐఐటీ శిక్షణ ఇచ్చేవారని.. అలా వందకు వంద మందినీ ఐఐటీకి ఆయన పంపేవారంటూ చుక్కా రామయ్యలోని విశిష్ట లక్షణాలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు. ఇక రాష్ట్ర విభజన కంటే కూడా గత పాలకుల వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎక్కువ నష్టం కలిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు ఆస్తులు ఇవ్వడం కన్నా చదివిస్తే ఊహించనంత ఎత్తుకు ఎదుగుతారు. 2014-19 మధ్య రాష్ట్రం కోసం కష్టపడ్డాను.. కానీ ఆ తర్వాత రకరకాల కారణాల వల్ల ఓడిపోయాను.నేను రాజకీయాలపై ఫోకస్ పెట్టిన ప్రతిసారీ గెలిచాను. ఉద్యోగులు, టీచర్లు ఈ ప్రభుత్వం నుంచి ఏం ఆశిస్తున్నారో... అవన్నీ రానున్న రోజుల్లో అందించే బాధ్యత తీసుకుంటాం. రాష్ట్రాన్ని నెంబర్1గా చేసేందుకు అవసరమైన వసతులు కల్పించే బాధ్యత నాది... దాన్ని అందిపుచ్చుకునే బాధ్యత టీచర్లది.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజల జీవితాల్లో కేంద్రం మార్పులు తెచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ నెంబర్ వన్ అవుతుందని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలోనే ఏపీ నెంబర్‌వన్‌గా మారాలనేదే తన లక్ష్యమన్నారు. రానున్న 22 ఏళ్ల పాటు మనమంతా దృష్టి పెడితే ఇది సాధ్యమే అవుతుందని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు.

# తురకపాలెం ఘటనపై ప్రభుత్వం సీరియస్

>> నమూనా ఫలితాల ఆదారంగా నివారణ చర్యలు చేపడతామని బాధితులకు భరోసా నిచ్చారు. అయితే సిఎం ఆదేశాలతో అధికార యంత్రాంగం ఆగ్రామంలో ముమ్మర చర్యలకు శ్రీకారం చుట్టింది. సిఎం చంద్రబాబునాయుడు తురకపాలెంలో పూర్తిగా మహమ్మారి అదుపులోకి వచ్చేంతవరకు నిత్యం వైద్యాధికారులు, ఇతర అధికారులు ఏరోజుకు ఆరోజు ఆగ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తూ బాధితులకు ధైర్యం చెప్పాలని కోరారు. బాధిత కుటుంబాలకు వారం రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వమే ఆహారం మంచినీరు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. రక్త, నీటి నమూనాల ఫలితాలు వచ్చేంతవరకు బాధిత కుటుంబాలందరికీ ప్రభుత్వమే ఆహారం, మంచినీటి సరఫరా చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఏ బాధిత కుటుంబం కూడా ఆహారం తయారు చేసుకోకుండా, ప్రభుత్వమే వారికి ఈ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. వీధుల్లోని పారిశుధ్య పనులను కూడా ముమ్మరం చేశారు. జిల్లా పంచాతీయ అధికారి సాయికుమార్ నేతృత్వంలో పారిశుధ్య సిబ్బంది తురకపాలెంలో ప్రతివీధిలో పారిశుధ్యం పనులను ముమ్మరం చేశారు. ఈ పనులు పూర్తిస్థాయిలో పూర్తయ్యేంతవరకు సిబ్బంది అక్కడే తిష్టవేసి దోమలు, బ్యాక్టీరియా నివారణకు బ్లీచింగ్, ఫినాయిల్ , కిరోసిన్ వంటి ద్రవాలతో నిర్మూలనా చర్యలు చేపడుతున్నారు. నీటి నిల్వలు, మురికి కుంటలను పూర్తిగా లేకుండా చేస్తూ బ్లీచింగ్, ఫినాయిల్‌తో పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. అంతుచిక్కని ఈ మహమ్మారి ప్రబలటానికి వైద్యబృందం అన్వేషణ మొదలుపెట్టింది. రక్త, నీటి నమూనాలు సేకరణకు 50 వైద్యబృందాలు ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు తురకపలెం రానున్నాయి. ఈ వైద్యబృందాలు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల నుంచి రక్త నమూనాల సేకరణతోపాటు, మంచినీటి పథకాల నీటిని కూడా సేకరించే పనిలో నిమగ్నం కానున్నాయి. ఏది ఏమైనా పూర్తిస్థాయిలో ఈ మహమ్మారిని నిర్మూలించేవరకు అధికార యంత్రాంగం ముమ్మరంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నేతృత్వంలో అధికారులదరూ ఆ గ్రామంలో చర్యలు చేపట్టారు. ఈ గ్రామంలో ఒకరికి జ్వరం రావటం కాళ్లు, ఒళ్లునొప్పులు రావటం అకస్మాత్తుగా అనారోగ్యానికి గురవుతూ అయిదు నెలల కాలంలో 45 మంది మృత్యువాత పడినట్టు సమాచారం. ఈ మహమ్మారి బారినపడి మరో 300 మంది కోలుకుంటున్నారు. ఈ యొక్క మహమ్మారి ఎక్కువ దళితకాలనీలోనే ఎక్కువ మందిని పొట్టనపెట్టుకుంది. నీరు కలుషితం అయ్యిందని, నీరు తాగటం వల్లే దద్దర్లు, అనారోగ్యం ఏర్పడుతుందని గత ఏడాది అక్టోబర్‌లోనే గ్రామ ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకున్నా... ఫలితం శూన్యమైంది. కాలువ నుంచి వచ్చే మంచినీటిని సమీపంలోని క్వారీ గుంతల్లోకి తరలించి ఇక్కడ నుంచి ట్యాంకుల ఎక్కించి సరఫరా చేయటం జరిగింది. ఈ క్వారీ గుంత నాచుపట్టి పూర్తిగా కలుషితమై ఉన్నప్పటికీ అధికారులు ఆ నీటినే సరఫరా చేయటం వల్ల ఎక్కువ మందిని కోల్పోవాల్సి వచ్చిందంటూ గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం చుట్టూ వాటర్ ప్లాంట్‌లు ఉన్నా ధనికులకే ఆ నీరు సాధ్యమైందని, తాము డబ్బులు లేక కొనలేక ఈ నీటిపైనే ఆధారపడి తమ వారిని కోల్పోవాల్సి వచ్చిందంటూ బాధితులు 'ప్రభాతవార్త' ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. ఒకవైపు కలుషిత నీరు మరోవైపు పడకేసిన పారిశుధ్యంతో ప్రబలిన మహమ్మారి తమకు తీరని అన్యాయం చేసిందని బాధిత కుటుంబాలు వాపోతున్నారు. ప్రభుత్వాధికారులు సకాలంలో స్పందించి ఉంటే తమకు ఈ దుస్థితి వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తమవారిని కోల్పోయిన తర్వాత ప్రభుత్వం స్పందించి పెద్దఎత్తున 3 రోజులుగా ముమ్మర చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. తాము ఫిర్యాదు చేసిన నాడే అధికారులు స్పందించి ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదని విలపించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా సత్వర చర్యటు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పర్యవేక్షణలో తురకపాలెంలో ముమ్మర చర్యలు కొనసాగుతున్నాయి.

# తురకపాలెం మరణాల సమాచారలోపంపై సమగ్ర విచారణ

## డిఎస్‌హెచ్ డాక్టర్ సిరి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు

## బాధ్యులపై చర్యలు తప్పవు: మంత్రి సత్యకుమార్ యాదవ్

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబరు 5:** శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమం , వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ , ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ , జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ , ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులతో కలసి గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో పర్యటించారు. తొలుత గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను పరిశీలించి అక్కడ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను , పరీక్షల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమం , వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మెడియాతో మాట్లాడుతూ తురకపాలెం మరణాల వివరాల సమాచార లోపం జరగడంపై సమగ్ర విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు. డియస్‌హెచ్ డాక్టర్ సిరి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో అధికంగా నమోదైన మరణాల గురించిన వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి వెంటనే తీసుకురావడంలో జరిగిన వైఫల్యాలు గుర్తించేందుకు, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు ఐఎఎస్ అధికారి డాక్టర్ అట్టాడ సిరి నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా విధుల నిర్వహణలో విఫలం చెందిన వైద్యారోగ్య సిబ్బందిపై శాఖాపరంగా చర్యలుంటాయని స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో అలక్ష్యాన్ని ప్రదర్శించిన అన్ని స్థాయిల్లో ఉన్నవారిపై తప్పకుండా చర్యలుంటాయన్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ గా ఉన్న(డియస్‌హెచ్) డాక్టర్ సిరి కమిటీ వారంలోగా ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందని మంత్రి చెప్పారు. సాధారణ స్థాయిలో కంటే మరణాలు అధికంగా ఉన్నప్పుడు అన్ని స్థాయిల్లోని అధికారులకు వెంటనే సమాచారం అందేలా అధునాతన సాంకేతికతను వినియోగించుకోవడంపై కూడా ఈ కమిటీ ప్రభుత్వానికి సూచనలిస్తుందని చెప్పారు.

మరణాలకు దారితీసిన కారణాలపై లోతుగా విశ్లేషణ గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో శుక్రవారం నాడు మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటించారు. ఉచిత వైద్య శిబిరంలో స్థానికులకు అందుతున్న వైద్య సేవలను నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఈఏడాది జులై నుంచి సెప్టెంబర్ తొలి వారం వరకు 23 మరణాలు జరిగాయి. అయినప్పటికీ క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది ఉన్నతాధికారుల్ని అప్రమత్తం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. మరణించిన వారిలో ఏడుగురు 70 ఏళ్లు దాటినవారున్నారు. మిగతా వారి వయసు సగటున 55 ఏళ్లవరకు ఉంది. మరణాలకు గల కారణాలపై లోతుగా విశ్లేషిస్తున్నామని, 14 రకాల వైద్య బృందాలు ఏర్పాటు చేశారని, వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. అందరి రక్త నమూనాలతో పాటు నీరు, మట్టి నమూనాలు కూడా తీసుకున్నారని చెప్పారు. జ్వరంబారిని పడినవారందరికీ రక్త పరీక్షలు చేస్తున్నారన్నారు. మైలోడియోసిస్‌పై సమాచారం లేదు

మైలోడియోసిస్ బ్యాక్టీరియా ఉన్నట్లు వార్తలొచ్చాయని, అయితే ఇప్పటివరకు అందిన రక్తనమూనాల పరీక్షల ఫలితాల్లో అటువంటిది కనిపించలేదన్నారు. ఎలాంటి బ్యాక్టీరియా అనేది ఇంతవరకు అంతుచిక్కలేదన్నారు. కెమికల్, బయోలాజికల్ పరీక్షలు కూడా చేయిస్తున్నామన్నారు. బాధితులకు గుంటూరు జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో చికిత్స అందిస్తున్నామన్నారు. మరణాలకు రకరకాల కారణాలు చెబుతున్నారని అపరిశుభ్రత, కలుషిత నీరు వంటి కారణాలు చెబుతున్నారని మంత్రి పేర్కొన్నారు.

# మేం సిద్ధంగా ఉన్నాం.. వైద్య సేవలు పొందండి

## తురకపాలెంవాసులకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ భరోసా

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబరు 5:** రాష్ట్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమం , వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ , ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ , జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులతో కలసి శుక్రవారం మధ్యాహ్నం గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో పర్యటించారు. అక్కడి వైద్యశిబిరానికి వెళ్లి అక్కడ ఇప్పటివరకు జరిగిన పరీక్షల నిర్వహణ వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ, గుంటూరు జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఇప్పటి వరకు స్థానికులకు అందించిన వైద్య సేవల్ని మంత్రికి వివరించారు. శిబిరం వద్ద పరీక్షల కోసం వేచి ఉన్న స్థానికులతోను మాట్లాడారు. మీకు అండగా ప్రభుత్వం ఉంది. వైద్యుల ద్వారా చికిత్స పొందాలని, ఆందోళన చెందొద్దు అని వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ తురకపాలెం గ్రామవాసులకు ధైర్యం చెప్పారు. స్వల్పంగా అనారోగ్యం ఉన్నప్పటికీ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు స్థానికులు సంశయిస్తున్న విషయాన్ని

గుర్తించిన మంత్రి సత్యకుమార్ నేరుగా ఓ ఇంటికి వెళ్లి భార్యాభర్తలకు నచ్చచెప్పారు. ఈ సందర్భంగా స్థానికులు ఆసుపత్రుల్లో ఉండి చికిత్స పొందేందుకు వెనకాడుతున్నారని, సాధారణ వైద్యంతో సరిపెడుతున్నారని మంత్రి గమనించారు. తానే స్వయంగా వైద్య శిబిరానికి అరకిలో మీటరు దూరంలో ఉన్న దంపతులు జి.శ్రీనివాసరావు, విజయకుమారి ఇంటికి మంత్రి సత్యకుమార్ నడుచుకుంటూ వెళ్లారు.

ఈ సందర్భంగా అనారోగ్యంతో ఉండి కోలుకుంటున్నానని చెప్పిన విజయకుమారితో గుంటూరు జీజీహెచ్ కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తామని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. రక్త పరీక్షలతో పాటు అవసరమైతే స్కానింగ్ వంటి పరీక్షల్ని ఉచితంగా చేస్తారని, సంశయించవద్దని మంత్రి కోరారు. తురకపాలెం గ్రామ వాసులకోసం గుంటూరు జీజీహెచ్‌లో ప్రత్యేకంగా ఒక వార్డును ఏర్పాటు చేశామని తెలిపారు. ఇదే సమయంలో అక్కడున్న ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండియన్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి , ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు కూడా ఆసుపత్రిలో చికిత్స పొందాలని నచ్చచెప్పారు. గుంటూరు జీజీహెచ్ లో మరణించిన వారి కేస్ షీట్లను వైద్య నిపుణులతో పరిశీలన చేయించాలని డిఎంఇ డాక్టర్ రఘునందన్‌ను వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఆయన మాట్లాడారు.

# ప్రధాని మోడీతో మంత్రి లోకేష్ భేటీ

>> విజ్ఞప్తి చేశారు. విద్యాప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నాం, ఉన్నతవిద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు మీ సహకారం, మార్గదర్శనం కావాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15నెలలుగా మీ సహకారంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం, మీ నేతృత్వంలో వికసిత్ భారత్ 2047లో భాగస్వాములం అవుతామని అన్నారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలోని కోట్లాది పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం కలిగించిన ప్రధాని మోదీజీకి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న ప్రధానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా నెలకొన్న వివిధ పరిణామాలను మంత్రి లోకేష్ వివరించారు. ప్రధాని మోడీ స్పం దిస్తూ రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఈ సందర్భంగా ప్రధానికి లోకేష్ బహుకరించారు.

## వారం - వర్జ్యం

06-09-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
చతుర్దశి రా.1.38
ధనిష్ఠ రా.10.52
వర్జ్యం : తె.5.41-ఉ.7.12
దు.తె.5.56-ఉ.7.33
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** భూముల విషయంలో ఏర్పడిన వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృషభం :** ఆరోగ్యం వాహనాల విషయంలో మెలుకువ అవసరం. సోదరుల కలయిక.

**మిథునం:** సంతాన విద్యా విషయంలో నూతన బాధ్యతలు చేపడతారు. శుభవార్తలు.

**కర్కాటకం :** సోదరి, సోదరులతో విభేదాలు తలెత్తుతాయి. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

**సింహం:** చిన్ననాటి మిత్రుల ద్వారా కీలక సమాచారం తెలుసుకుంటారు. వాహనసౌఖ్యం.

**కన్య :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రయాణాలు.

**తుల :** గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. సంఘంలో ఓ ప్రత్యేక గౌరవం పొందుతారు.

**వృశ్చికం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం.

**ధనుస్సు:** కోర్టు కేసులు పరిష్కారమవుతాయి. శుభకార్యాలలో బంధు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**మకరం:** రాజకీయ, కళా రంగాల వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**కుంభం:** భూముల విషయంలో నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు. ఋణాలు తీరుస్తారు.

**మీనం :** కొన్ని అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

06-09Pg3exHMNWJQECKVRST 3 RD_06-09Pg3exHMNWJQECKVRST.qxd 9/6/2025 12:39 AM Page 1



# ఉపాధ్యాయుల్ని సత్కరించిన 'కోలా'



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తిలోని బిజెపి కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుల్ని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో జీవనం ప్రారంభించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత దేశ రాష్ట్రపతి అయ్యారని ఉపాధ్యాయ వృత్తి ప్రధాన్యతను దేశ నలుమూలల చాటారని వివరించారు. అంతటి మహోన్నతమైన వ్యక్తి అన్నారు. సమాజంలో ఉపాధ్యాయులు ఎందరో మహోన్నత వ్యక్తులను తీర్చి దిద్దుతున్నారని వివరించారు. నేడు మనం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామంటే అది ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవం అన్నారు. మన భవిష్యత్తును తీర్చి దిద్దే మొదటి వారు గురువులే అన్నారు. తల్లి దండ్రులు కలలు కంటే ఆ కలలను సాకారం దిశగా ప్రయత్నించే మహామహులు ఉపాధ్యాయులు అన్నారు. విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి తీర్చిదిద్దే వారు ఉపాధ్యా యులన్నారు. ఒక నాడు విద్యకోసం మన పూర్వికులు ఆశ్రమాలకు వెళ్లె వారని నేడు ప్రభుత్వాలు ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందన్నారు. విదేశీ విద్యకు నేడు ఎన్నో సదుపాయాలు కల్పి స్తున్నట్లు తెలిపారు. కాబట్టి మన జీవితంలో మొదటి స్థానం గురువులకు ఇవ్వాలని తెలిపారు. గురువు కృషి వెలకట్టలేనిదన్నారు. మన సంప్రదాయాలు, సంస్కృతిని, సంప్రదాయాలను తీర్చిదిద్దే గురువును విస్మరించరాదన్నారు. ఉపాధ్యాయులు సుబ్రమణ్యంరెడ్డి, మునీంద్ర, జయచంద్రాంరెడ్డి, రమేష్, సుబ్బ,శర్మలను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి నాయకులు కొండేటి గోపాల్,గరికపాటి రమేష్‌బాబు, ఇమిడిశెట్టి మోహన్, కోనేటి అయ్యప్ప, నరేంద్ర, చందురాయల్, సిద్దు రాయల్, సజ్జా హరిష్, భరత్‌నాయుడు,చోటు తులసి,కుమార్, గిరిధర్‌సాయి. మారి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు



**విజయ వాడ, సెప్టెంబరు5, ప్రభాతవార్తప్రతి నిధి:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు చేశారు. "శిష్యుల ఉన్నతిలోనే తమ విజయాన్ని చూసుకొని ఉపాధ్యాయులు సంతోషిస్తారు. తల్లితండ్రులతో పాటు విద్యాబుద్ధులు నేర్పే గురువును దైవంతో సమానంగా పూజించే సంస్కృతి మనది. నేడు గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయి అధ్యాపకులు, ఆచార్యులకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. పాఠశాల దశ నుంచే విద్యార్థులకు అకడమిక్ సంబంధిత అంశాలతోపాటు నైతిక విలువలు కూడా నేర్పించాలని ఉపాధ్యాయులను కోరుతున్నాను. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ నియామకం చేపట్టింది. డీఎస్సీ నియామకంతో విధుల్లోకి రాబోతున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలియచేస్తున్నాను" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ మండలంలో గల మదగడ గిరిజన గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన రద్దు అయింది. ప్రభుత్వం పరంగా కార్యక్రమాలు, సమావేశాలతో బిజీగా ఉండటంతో తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. మదగడ గిరిజన గ్రామాన్ని శుక్రవారం సందర్శిస్తానని ఇటీవల పవన్ కల్యాణ్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# తిరుమల సమాచారం

## 24నుండి శ్రీవారి సేవకు ట్రైనర్ల శిక్షణ

### - 8 అంశాలలో నైపుణ్యం



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాత వార్తప్రతి నిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న అశేషసంఖ్య భక్తులకు అన్ని విభాగాల్లో ఇతోధిక సేవలందిస్తున్న శ్రీవారిసేవకులకు మరింత నైపుణ్యం కలిగించేందుకు ట్రైనర్లకు శిక్షణాతరగతులు నిర్వహిస్తున్నారు. మొదటివిడత శిక్షణను ఈనెల 24వతేదీ నుండి అమలుచేసే దిశగా టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. గ్రూప్‌పర్యవేక్షకులు, సేవకుల ట్రైనర్ల శిక్షణ మాడ్యూల్‌పై ప్లానింగ్ విభాగానికి చెందిన నలుగురు నిపుణులుపవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. శ్రీవారిసేవకులకు సంబంధించి గ్రూప్ పర్యవేక్షకులు, ట్రైనర్ల శిక్షణ మాడ్యూల్‌పై శుక్రవారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, రాష్ట్ర ప్లానింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావుతో కలసి వర్చువల్‌గా ఐఐఎం అహమ్మదాబాద్ నుండి ఆచార్యులు విశ్వనాథ్, రామమోహన్, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిలతో ఇఒ శ్యామలరావు సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు సూచనలతో శ్రీవారిసేవకుల ప్రమాణాలను పెంపొందించాలనే ఉన్నతమైన సంకల్పంతో తగ కొద్దికాలంగా పలు సంస్కరణలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా గ్రూప్ సూపర్‌వైజర్లు, సేవకుల ట్రైనర్ల రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక యాప్‌ను ప్రారంభించామన్నారు. శ్రీవారిసేవకుల ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణనిచ్చేందుకు మరింత పటిష్ట ప్రణాళికలు,బోధన పాఠ్యాంశాలను రూపొందించాలని సూచించారు. శిక్షణ పొందిన ట్రైనర్లు, సూపర్‌వైజర్లు సేవకులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. మొదటివిడతగా ఈనెల 24వతేదీ శిక్షణ ప్రారంభించి మూడురోజులు కొనసాగుతుందన్నారు. ఉదయంవిధానపరమైన అంశాలపై, మధ్యాహ్నం వివిధ సేవా కేంద్రాల్లో క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్ళి పరిశీలించేలా రూపొందించాలన్నారు. పటిష్టసేవ అందించేందుకు నైపుణ్యాలు, స్ఫూర్తిదాయకమైన నాయకత్వం, సులభపద్ధతిలో అందరికీ అర్థమయ్యేలా ఆదర్శసేవకుడి లక్షణాలు ,పలుభాషలలో ప్రాథమిక నైపుణ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇఒ సూచించారు. ఈ సమావేశంలో టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, డిఎఫ్ఒ,ఐటి ఇన్‌ఛార్జి జిఎం ఫణికుమార్‌నాయుడు, శ్వేతడైరెక్టర్ రాజగోపాల్, పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.

## ఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం

### - మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాత వార్తప్రతినిధి:** దేశంలో పన్ను వ్యవస్థను సులభతరం చేయడం కోసం జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదనిమంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జీఎస్టీ స్లాబుల సరళీకరణ - పర్యాటక, సినిమా రంగాలకు ఊతమన్నారు. జీఎస్టీ సంస్కరణలతో తక్కువ ధరల్లో వినోదం అన్నారు. పర్యాటక, సినిమా రంగాల బలోపేతానికి దోహదమవుతుందన్నారు. బడ్జెట్ ట్రావెలర్, డొమెస్టిక్ టూరిజంలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. 18 శ్లాబ్ పరిధిలోకి సినిమా ప్రొడక్షన్ సేవలు..తద్వారా నిర్మాతలకు ఆర్థికంగా మేలు అన్నారు. ట్యాక్స్ లు తగ్గితే సినిమా, పర్యాటక రంగాల్లో ఉపాధి పెరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. హోటల్ రూమ్ టారిఫ్‌లు రూ.7,500 లోపు ఉన్న వాటిపై పన్ను 12 నుండి 5 కు తగ్గింపు ఉంటుందన్నారు. రెస్టారెంట్ బిల్లులపై పన్ను కూడా 12-18 నుండి 5 కి తగ్గించబడుతుందన్నారు..సినిమా టికెట్లు రూ.100 లోపు ఉంటే 12 జీఎస్టీ, రూ.100 పైగా ఉంటే 18 జీఎస్టీ కొనసాగుతుంది: మంత్రి దుర్గేష్.. జీఎస్టీ సంస్కరణలు తెచ్చిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్.

## దొంగిలించిన హుండీ సొమ్ము తిరిగి అమ్మవారికి

### అనారోగ్యంపాలైన కుటుంబసభ్యులు



హుండీని లెక్కపెడుతున్న గ్రామస్తులు

**బుక్కరాయసముద్రం సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఎంతో ప్రతిభగల అమ్మవారు శ్రీ ముసలమ్మతల్లి దేవాలయం గ్రామ సమీపంలో ఉన్నది. బుక్కరాయసముద్రంతో పాటు అనంతపురం ఇతర జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటూఉంటారు. ముఖ్యంగ చెప్పాలంటేనే బుక్కరాయసముద్రం గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉన్నారంటే అది ఒక ముసలమ్మ తల్లి అనుగ్రహమే నని చెప్పవచ్చు,గ్రామ సమీపంలో ఉన్న చెరువు కట్ట అను నిత్యం తెగిపోతాఉంటే ప్రజలు ఇబ్బందు పడుతున్నారని గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి కుటుంబీలైన శ్రీ ముసలమ్మ తల్లి చెరువుకట్టకు బలిహారం కావడంతో చెరువుకట్ట తెగిపోకుండ నిలబడినాదని చరిత్ర చెప్పుతుంది. భక్తుల కోరిన కోర్కెలు తీర్చు శ్రీ ముసలమ్మ తల్లి దేవాలయంలో 22.7.2025 న కొందరు గుర్తు తెలియని దుండగులు సీసీకెమరాలను ద్వంసంచేసి గుడిలోకి చొరబడి గుడిలో ఉన్న హుండీని గొంగలించారు. ఈ విషయం పై ఆలయ ధర్మకర్త సుశీలమ్మ పోలీస్టేషన్ ల్లో ఫిర్యాదుచేయగా పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తుచేసున్నారు. శుక్రవారం హుడిని దొంగలించిన దుండగులు తిరిగి అమ్మవారి ఆలయ ప్రాంగనంలో పడేసి పోయారు. వాటిని గమనించిన ఆలయకమిటీ ధర్మకర్త సుశీలమ్మ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసుల సమక్షంలో హుండీని తెరవగా అందులో ఒక లేఖను రాసి పెట్టారు ఆ లేఖలో అమ్మవారి హుండీని నలుగురం చోరిచేశామని చోరిచేసినప్పటినుండి తమ ఇండ్లలో పిల్లల అనారోగ్యం తో బాదపడుతున్నారు. తెలియక అమ్మవారి సొమ్ము దొంగలించామని అందులో కొంతవాడుకున్నామని రాసి సంచిలో పెట్టి వెల్లిపోయారు. అనంతరం పోలీసుల సమక్షంలో హుండీని లెక్కించగా అందులో 1,86,486 రూపాయలు ఉన్నట్లు తెలిపారు.

## ఉపాధ్యాయులకు వైఎస్సార్సీ అధినేత జగన్ శుభాకాంక్షలు

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపాధ్యాయులందరికీ వైసిపి అధినేత జగన్ శుభాంకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వైఎస్ జగన్ శుక్రవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో.. "మాజీ రాష్ట్రపతి, భారతరత్న, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ మనస్ఫూర్తిగా నివాళులు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

## శ్రీవారిసేవలో పాట్నా హైకోర్ట్ జడ్జి అనుపమ చక్రవర్తి



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటంబంతో కలసి పాట్నా హైకోర్ట్ జడ్జి జస్టీస్ అనుపమ చక్రవర్తి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవదేవుని దర్శనం బాగా జరిగిందని తెలిపారు.

## బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి అజ్ఞాతభక్తుడు రూ.కోటిన్నర విరాళం

**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్‌కు ఓ అజ్ఞాతభక్తుడు భారీ విరాళం అందించాడు. బెంగుళూరుకు చెందిన ఓ అజ్ఞాతదాత 1.50కోట్ల రూపాయలు విరాళాలను శుక్రవారం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును కలసి అందజేశారు. శ్రీవేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో ఈ విరాళమిచ్చినట్లు ఆ భక్తుడు తెలిపాడు.

## కాణిపాకంలో కన్నుల పండువగా త్రిశూలస్నానం



స్వామివారి ఆయుధం త్రిశూలానికి కలశాలలోని పవిత్రజలం, పాలతో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

**కాణిపాకం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలో భాగంగా నవరాత్రి ఉత్సవాల చివరిరోజు శుక్రవారం త్రిశూలస్నానం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో గత నెల 28 నుండి ప్రారంభమైన స్వామివారి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం జరిగిన ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవతో ముగిసింది. నవరాత్రి ఉత్సవాల అంకురార్పణ సందర్భంగా ప్రధాన ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో నవదాన్యాలను మొలకపోసి, అష్టోత్తర కలశాలను ఏర్పాటు చేసి ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో యాగశాల పూజలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా స్వామివారి ఆయుధమైన త్రిశూలాన్ని స్వామివారు వాహనసేవల్లో ఊరేగే కాణిపాకం పురవీధుల్లో ప్రతిరోజూ ఉదయం ఊరేగిస్తుంటారు. స్వామివారి నవరాత్రి ఉత్సవాలు ముగిసినందున త్రిశూల స్నానం గావించారు. తిరుమల చక్రస్నానం తరహాలో కాణిపాకంలో త్రిశూల స్నానం ఘట్టం జరిగింది. ఈసందర్భంగా ముందుగా యాగశాలలో యాగమూర్తికి పూజలు నిర్వహించి పూర్ణాహుతి అనంతరం త్రిశూలాన్ని కాణిపాకం పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆలయం పవిత్ర పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం పుష్కరిణిలోని నీటిలో త్రిశూలస్నానం గావించారు. ఈసందర్భంగా యాగశాలలోని అష్టోత్తర కలశాలలోని పవిత్రజలంతో త్రిశూలానికి అభిషేకం గావించారు. అలాగే అంకురార్పణ రోజున మొలకపోసిన నవదాన్యాలను పుష్కరిణిలో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ధనపాల్, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు,స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ లీలా సుధీర్‌లతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## అంధ విద్యార్థులకూ సైన్స్ కోర్సులు : ప్రభుత్వం ఉత్తర్వుజారీ

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** అంధ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో సైన్స్ కోర్సులు చదివేందుకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు సంబంధించిన జిఒ 278ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం విడుదల చేశారు. ఈ విద్యాసంవత్సరం నుంచి అంధ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మేథమేటిక్స్ వంటి కోర్సుల్లో చదువుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రాక్టికల్స్ స్థానంలో విద్యార్థులకు బహుళ ఎంపిక ప్రశ్నాపత్రం అందిస్తామని పేర్కొన్నారు. దృష్టిలోపం విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డు కాకూడదని, మిగిలిన విద్యార్థులతో వీరికి సమానంగా అవకాశాలు కల్పించడానికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపారని మంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సైన్స్ కోర్సుల్లో అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరడంతో మంత్రి ఈమేరకు చొరవ తీసుకున్నారని పేర్కొంది.

## భగవంతుని ఆశీర్వాదం అందరిపై ఉండాలి

### - ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్మన్ జస్టిస్ రామసుబ్రమణ్యం



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతుని ఆశీర్వాదంతోనే ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని, భగవన్నామస్మరణతోనే మంచి జరుగుతుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఎన్‌హెచ్‌ఆర్‌సి ఛైర్మన్ జస్టీస్ రామసుబ్రమణ్యం తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో లోకం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో ఆలయంలోనికి చేరుకుని స్వామివారి దర్శనానంతరం ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. టిటిడి రిసెప్షన్ ఓఎస్‌డి సత్రానాయక్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి మంటపం వద్ద పేలుడు ఇరువురికి గాయాలు

**కోవూరు,(నెల్లూరు) సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** శుక్రవారం తెల్లవారుజామున కోవూరులోని సత్రం వీధి ప్రాంతంలో గణేష్ నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా టపాసులు కాల్చే సమయంలో అపశృతి జరిగి త్రుటితో భారీ ప్రమాదం తప్పింది. కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సమాచారం మేరకు కోవూరులోని సత్రంవీధి ప్రాంతంలో యథావిధిగా వినాయకచవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం రాత్రి అక్కడి నుంచి ఊరేగింపుగా విగ్రహం బయలుదేరింది. ఈ నేపథ్యంలో సత్రంవీధి ప్రాంతంకు వచ్చే సరికి సాయిబాబా మెడికల్స్ షాపు పక్కనే ఉన్న స్థలంలో ఈ గణేష్ ఉత్సవ నిర్వాహకులు మెట్ల ప్రాంతంలో పేలుడు సామగ్రిని నిల్వ ఉంచారు. ఈ నేపథ్యంలో రహదారిలో టపాసులు కాలుస్తుండగా అందులో ఉన్న నిప్పు రవ్వలు నిల్వ ఉన్న టపాసులపై పడి భారీ స్థాయిలో పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఆ ప్రాంతంలో ఉన్న ఎలక్ట్రికల్ స్కూటీ కూడా పేలిపోయింది. ఈ సంఘటనలో సాయిబాబా మెడికల్ షాపు యజమాని బ్రహ్మయ్య సతీమణి లక్ష్మి(45) తీవ్రగాయాలయ్యాయి. అదే ప్రాంతంలో ఉన్న రామ్‌దేవ్‌బాబాకు గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సిబ్బందితో వెళ్లి నిశిత పరిశీలన చేపట్టారు. ఈ పేలుడు సందర్భంగా షాప్ షట్టర్ దెబ్బతినడ, షాపులో ఉన్న మెడికల్ వస్తువులు కూడా కింద పడిపోవడం జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మహమ్మద్ ప్రవక్తలా నిరాడంబర జీవితాన్ని అలవాటు చేసుకోవాలి

### ఆదర్శాలకు స్వస్తి: దారితప్పుతున్న జీవన గమనం:హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** మహమ్మద్ ప్రవక్త ఆచరించిన నిరాడంబర జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో రేహాన్, నూర్‌ఏమస్‌జిద్‌లో "మౌలానా మహమ్మద్‌ఆలీ సాహెబ్‌లు దివ్యఖుర్ ఆన్ పఠనానికి సంబందించి చైతన్య పరచారు. జామియా మస్‌జిద్‌లో రేహాన్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా సంబరాలు జరిపించుకోవటం కాదు. అది మన సంప్రదాయం, సంస్కృతి కాదన్నారు. ఆయన తను జన్మించిన సోమవారం, గురువారం ఉపవాస దీక్షలు పాటించేవారు అన్నారు. ఆయన నిరాడంబర జీవితాన్ని అనుభవిస్తూ భావి తరాలకు మార్గదర్శకులయ్యారన్నారు. నేడు మనం జన్మదినం అంటే సంబరాలుమిన్నుముట్టుతున్నాయన్నారు. మనం నిత్యం అల్లాహ్ మార్గాలను విడనాడి మనం స్వర్గం ప్రాప్తించాలని కోరుకోవటం కరెక్టు కాదన్నారు. మనం దివ్యఖుర్‌ఆన్‌తో సంబంధం లేకుండా జీవనం గడుపుతున్నామని దాని వల్ల నిత్యం దుఃఖంలో మునిగి తెలుతున్నామన్నారు. మనం ఎంత సంపాదించిన ఒదుగు కనబడటం లేదన్నారు. ఆయన శుక్రవారం నూర్ఏ మస్‌జిద్‌లో దివ్యఖుర్ ఆన్ పఠనానికి సంబందించి దిశ దెశ నిర్దేశం చేసారు. మనం ఇస్లాం మతంలో పుట్టి ముస్లింలుగా నటిస్తున్నాము తప్ప నాడు మన ప్రవక్త ఆచరించిన విధానాలు,ఆచారాలు, సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ స్వర్గస్తులు కావాలని కోరుకోవటం సరికాదన్నారు. ప్రవక్త జీవితం మనకు మార్గదర్శకం కావాల్సి ఉండగా ఆచారాలకుతుంగలో తొక్కి కట్టుబొట్టు అన్ని మార్చుకున్నామన్నారు. మనం కలియుగం అంతంతో ఉన్నామన్నారు. అల్లాహ్ ఆదేశాలను మన ప్రవక్త ద్వారా అందించారని అయితే మనం కనీసం ఐదుపూటల్లా నమాజును కూడా ఆచరించలేని దీన స్థితిలో ఉన్నామన్నారు. ఈ నిర్లక్ష్యం నుంచి బయట పడాలన్నారు. ప్రవక్త ఆచరించిన మార్గాన్ని ఆచరిస్తూ యుగాంతంలో స్వర్గస్తులు కావాలని సూచించారు. జన్మదినాలంటే సంబరాలు జరుపుకోటం కాదు. ఆయన ఆచరించిన విధానాలను,జీవిత మార్గాలను ఆచరిస్తూ సన్మార్గంలో పయనించాలన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ రమణరావు సస్పెన్షన్

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** అనంతపురం అర్బన్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న జాయింట్ వన్ సబ్ రిజిస్టర్ రమణరావు ను సస్పెన్షన్ చేస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి విజయలక్ష్మి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. సబ్ రిజిస్టర్ రమణరావు ఇటీవల డబల్ రిజిస్టర్లు చేయడంతో ఫిర్యాదులు వచ్చాయి.

దీనిపైన విచారణ చేసి సస్పెన్షన్ చేయడం జరిగిందన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

## వైభవంగా గణనాథుని ధ్వజారోహణం

**కాణిపాకం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు శుక్రవారం ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. గత నెల 27 నుండి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా 28న ధ్వజారోహణంతో ప్రారంభమైన నవరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం జరిగిన ధ్వజావరోహణంతో ముగిసింది. ముందుగా ఉదయం ఆలయంలో త్రిశూల స్నానం, వసంతోత్సవం కార్యక్రమంను కన్నుల పండువగా నిర్వహించారు. అలాగే రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమంను నిర్వహించారు. ఈమేరకు నవరాత్రి ఉత్సవాలు దిగ్విజయంగా నిర్వహించేందుకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ గత నెల 28న ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించగా, తొమ్మిది రోజులు అనంతరం శుక్రవారం ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉభయదారులచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించిన అనంతరం ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్థంభంపై ఎగుర వేసిన మూషికపటాన్ని శాస్త్రోక్తంగా పూజల అనంతరం అవతనం గావించారు. ఈసందర్భంగా మూషిక పటానికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వడాయత్తు ఉత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి వడలతో మాలవేసి, పెసరు పప్పు పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు.

## తెలంగాణ సస్యశ్యామలంగా అభివృద్ధి చెందాలి

### - నూతన సిఎస్ రామకృష్ణారావు



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలంగాణ సస్యశ్యామలంగా అభివృద్ధిచెందాలని ఆరాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆకాంక్షించారు. స్వామివారి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ మంచి జరగాలని కోరుకున్నారు. శుక్రవారం ఉదయం నైవేద్యవిరామసమయంలో కుటుంబంతో కలసి ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఇప్పటినుండే అప్రమత్తంగా ఉండాలి



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుని సాలకట్ల బ్రహ్మోత్సవాలు రెండువారాల్లో జరగనున్నా ఇప్పటినుండే అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు ప్రముఖులు, వివిఐపిలతోబాటు సామాన్యభక్తులు విచ్చేస్తారని, వారందరికీ గ్యాలరీల్లోకి ప్రవేశనిష్క్రమణ మార్గాలు సాఫీగా ఉండేలా చూసుకోవాలన్నారు. గ్యాలరీల వద్ద నిరంతరం భద్రత ఉండాలని, తరచూ తిరుమల, ఆలయ మాఢవీధులు తనిఖీలు చేసుకోవాలన్నారు. శుక్రవారంసాయంత్రం తిరుమలకు వచ్చిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, సిఐలు విజయకుమార్, రాముడుతో కలసి ఆలయ మాఢవీధులను పరిశీలించారు. ఆలయం ముందు బేడి ఆంజనేయస్వామి ఆలయం, ఆస్థానమండపం, అఖిలాండం వద్ద భక్తులు వేచిఉండటం, సిఎం పట్టువస్త్రాలు సమర్పణకుపర్యటించే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన భద్రతపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రణాళికలుసిద్దంచేయాలని అధికారులకుసూచించారు.

మన భవిష్యత్తు మనం పుట్టిన ఘడియలు బట్టిగాని, మరింకా దేనిమీదనో గాని ఆధారపడి లేదు. అది కేవలం మన స్వశక్తిపై ఆధారపడి ఉంది.

-రాజాజీ

# ఆశావహ సంస్కరణలు!


నిత్యావసర వస్తువుల కొనుగోలుదారుల్లో, వాణిజ్య వ్యాపార రంగాల వారికి తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ2.0 సంస్కరణలు కొత్త ఆశలు మొలకెత్తింప చేశాయి. ఆశయాల మాటెలా ఉన్నా ప్రతిపాదనలు బేషుగ్గా ఉన్నాయి. నాలుగు శ్లాబుల పన్ను రేటు నుంచి కేవలం రెండే శ్లాబులను, అదీ మునుపటి కన్నా తక్కువగా నిర్ణయించడమంటే ఇది భారతీయుల విజయం కిందనే లెక్క. అదీగాక దీపావళి నుంచి అమల్లోకి వస్తాయనుకున్న పన్ను రేట్లు ఈ నెల 22 నుంచే తగ్గుతాయంటే జనంలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ తగ్గింపుల కారణంగా సామాన్య మధ్య తరగతి ప్రజానీకానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రయోజనాలను అందించేవే. ఇప్పటివరకు వేధించిన 12 శాతం, 28శాతం పన్నులు ఇక ఉండబోవని కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో సామాన్యులకు ఎన్నో సడలింపులు కలుగుతాయి. తద్వారా వారు కొనుగోలు చేసే ప్రతి వస్తువు పైనా ధరల సర్దుబాట్లు జరిగి వినిమయ వస్తువులధరల్లో తగ్గింపు కనపడుతుంది. 56వ జిఎస్‌టి మండలి నిర్ణయాలకు అశేష భారతీయ జనావళి స్వాగతిస్తూ జేజేలు పలికారు. కాని వస్తుసేవల పన్ను విషయంలో కేంద్ర ప్రభుత్వం సంస్కరణల కోసం ఎనిమిదేళ్లు అవసరమా అంటూ విపక్షాలు దుయ్యబట్టడమొక్కటే మిగిలింది. 2017 తర్వాత ఇన్నాళ్లకు జీఎస్టీ వలన సాధారణ వర్తకులు కార్పొరేట్ వాణిజ్యవేత్తలు ముక్తకంఠంతో సంతోషం వ్యక్తంచేశారు. కారణమేదైనా జీఎస్టీ శ్లాబుల సవరింపు బేషుగ్గా ఉంది. మందగమనంలో ఆర్థిక వృద్ధి, పొదుపు సంస్కరణలు, కుటుంబ రుణాల విస్తృతి,సామాన్యుడి నెత్తిన పడుతున్న ఆర్థిక భారాలు, జీఎస్టీ పన్ను, సంస్కరణలకు దారితీసి ఉంటాయని అంచనా. విపక్షాలు తమ వంతు విమర్శగా బీహారు ఎన్నికలు, అమెరికా టారిఫ్‌ల ఒత్తిడి కారణంగానే జీఎస్టీ పన్నుల విషయంలో ముందస్తు ప్రకటన చేసి ఉంటారంటున్నారు. తమ పార్టీ ఎన్నో ఏళ్లుగా జీఎస్టీ సంస్కరణ కోసం పట్టుబడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇంతవరకు జీఎస్టీలో 64శాతం పేద, మధ్యతరతగతి నుంచే వస్తుండగా కుబేరుల వంతు మూడు శాతమేనని, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. సంక్లిష్టంగా ఉన్న జీఎస్టీ నిబంధనలను సరళతరం చేయడంతోపాటు ఎంఎస్‌ఎంఇ రంగానికి ప్రయోజనం కలిగించే నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోగ్య బీమాకు పన్నులు ఉపసంహరించడాన్ని విశ్లేషకులు ఎంతో ఉత్తమమైన సంస్కరణగా భావిస్తున్నారు. నిన్నమొన్నటి స్వాతంత్య్ర దినోత్సవం రోజున ప్రధాని నరేంద్రమోడీ ఎర్రకోట నుంచి తన ప్రసంగంలో ప్రస్తావించిన జీఎస్టీ 2.0 సంస్కరణల కోసం ఎదురు చూసిన సామాన్యునికి ఈ రోజున మనసు కాస్తంత తేలికపడింది. వాటి ఫలాలు అంది ధరల భారం నుంచి గట్టెక్కిన నాడు నిజంగా స్వాతంత్య్ర దినోత్సవ ఫలితాలను అందుకున్నట్లే సంబరపడతాడు. జేబులు కత్తిరించే జీఎస్టీ విధానమని హుంకరించిన ప్రతిపక్షాలు సైతం జేబులు నింపే సంస్కరణలు చూడగలుతున్న ఏకైక సంస్కరణ విధానం భారతదేశంలో తొలిసారిగా ఆవిష్కరింపబడిందంటే నమ్మాలి మరి! వస్తుసేవల పన్ను అనగానే ఎంతోఆందోళన చెందిన ప్రజలకు, దేశాభివృద్ధికి 'డబుల్ డోస్' మద్దతుగా ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారంటేనే ఈ సంస్కరణల ప్రయోజనాలు అర్థమౌతాయి. పన్నుల వ్యవస్థను సంస్కరించటానికి చాన్నాళ్లు పట్టిందన్న విమర్శ తప్పితే అన్నివర్గాలు తృప్తి చెందాయి. సాధారణ ప్రజలకు డబ్బు ఆదా కావడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవడం జీఎస్టీ సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ప్రధానంగా మానవ జీవితానికి అవసరమైన ఆరోగ్యబీమా 18 శాతం జీఎస్టీ రేటు నుంచి మినహాయింపునివ్వటమే నేటి జీఎస్టీలో చారిత్రక నిర్ణయమని బీమాదారులు నమ్ముతున్నారు. వైద్యసంబంధిత ద్రవ్యోల్బణం పెరుగుతున్న తరుణంలో సామాన్య కుటుంబాలకు కూడా వైద్యబీమా కల్పించగల శక్తి ఏర్పడ్తుంది. అందుకే ఈనాటి పన్ను సంస్కరణలు స్వాతంత్య్రం వచ్చిన తర్వాత జరిగిన అందరికీ నచ్చే సంస్కరణలుగా పారిశ్రామిక వర్గాలు సైతం భావిస్తున్నాయి. రైతులనుంచి ఎంఎస్‌ఎంఈల వరకు ఫార్మా రంగమే కాకుండా దాని అనుబంధ రంగాలకు, తద్వారా వినియోగదారులకు గణనీయ లబ్ధి చేకూరగలదు. వ్యవసాయ సంబంధిత సాగు పరికరాలు,వస్తువులపై 12 శాతం నుంచి జీఎస్టీ 5 శాతానికి తగ్గింది. సిమెంటుపై 28 శాతం నుంచి 18 శాతానికి మార్చడం గృహ నిర్మాణానికి సాను కూల సంకేతం, టీవీలు, ఎసిలు, ఎలక్ట్రానిక్ వస్తువులు 28 శాతం నుంచి 18 శాతానికి మారనుండగా, హానికర వస్తువులపై పన్ను స్థాయి 40 శాతానికి పెరుగుతుంది. అంటే వ్యవసాయానికి నిర్మాణరంగానికి పన్ను సడలింపులు వస్తుండగా, పొగాకు ఉత్పత్తులపై భారం ఎక్కువ పడుతోంది. వీటిపై పన్నులు పెంచడం ద్వారా వినియోగ దారులను నిరుత్సాహపరచడం మంచి ఆలోచన. అయితే ధరాభారంతో దుర్వ్యసనాలను దూరం చేయాలనుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాలతో ఆయా రాష్ట్రాల వస్తుసేవల పన్ను వసూళ్లలో వచ్చే నష్టాన్ని భర్తీ చేసేందుకు కేంద్రం అంగీకరించింది. అయితే ఐదేళ్లపాటు రాష్ట్రాలను ఆదుకుంటే తప్ప అవి నిలదొక్కుకోలేవు. ఈ విధంగా వెసులుబాటు కల్పించగలిగితే జీఎస్టీ సంస్కరణలు అఖిల పక్షాలకు ఆశాభావమే!

పగతీర్చుకుంటే ఆ రోజు మాత్రమే ఆనందం కలుగుతుంది. ఒక రోజు ఆనందం కోసం చిరకాలం కలిగే ఆనందాన్ని బలిపెట్టకూడదు.



తిరువళ్లువర్

మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చు.



గురునానక్

# ప్రజావాక్కు



### క్యాష్‌లెస్ స్కీమ్

మన దేశంలో రోడ్డు ప్రమాదాలు, కాలిన గాయాలు, విష ప్రయోగాలు,నేరదాడులురోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇలాంటి అత్యవసర సందర్భాల్లో బాధితుడికి వెంటనే వైద్యసహాయం అందకపోతే ప్రాణాలుకోల్పోవాల్సి వస్తుంది. అయితే ప్రైవేట్ ఆసుపత్రులలో చాలా చోట్ల ముందస్తు డబ్బుఅడగడం, లేకపోతే బెడ్‌లేదు అంటూ తిరస్కరించడం సాధారణమైపోయింది. బాధితులు అంబులెన్స్‌లలోనే ప్రాణాలు వదిలే ఘటనలు మన కళ్లముందే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఆదేశం ప్రశంసనీయం. 2007 ప్రైవేట్ మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్, 2016 గుడ్ సమారిటన్ యాక్ట్ మోటార్ వెహికల్స్ యాక్ట్‌ప్రకారం, ప్రతి ఆసుపత్రి ముందస్తు చెల్లింపు లేకుండా దుర్ఘటన బాధితులను వెంటనే చికిత్స చేయాల్సిందేనని మళ్లీ గుర్తు చేసింది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### భక్తిశ్రద్ధలతో పూజిద్దాం..

ఐకమత్యానొదిలి పోటీతత్వం షురూ జేస్తున్నారు. ప్రకృతిని పరిరక్షించే మట్టి ప్రతిమలనొదిలి రంగు రంగుల ప్రతిమలను కొనేందుకు ఎగబడుతున్నారు. వికృత చేష్టలతో చిందులేస్తూ వినాయకుడినే అపవిత్రం చేస్తున్నారు. భక్తిశ్రద్ధలతో పాడే కీర్తనలు మరిసి సౌండ్‌బాక్సులల్లా పెట్టుకొని పూజిస్తున్నారు. భజన నృత్యాలతో సాగేఊరేగింపు భక్తికి విరుద్ధమైన పాటలు పెట్టీ ఎగురుతున్నారు. భగవంతుని భక్తిశ్రద్ధలతో కొలవాలే గాని భారీ విగ్రహం పెట్టామనే పొగడ్తల కోసం కాదు. భారీ ప్రతిమలతో కాదు భక్తి శ్రద్ధలతో పూజిద్దాం.

- కాల్వ నిఖిత, సిద్దిపేట

### పరిశోధకుల టీంలను ఏర్పాటు చేయాలి

తెలంగాణరాష్ట్రంలోని పాఠశాలస్థాయిలో,జూనియర్ కళాశాలస్థాయిలో,డిగ్రీకళాశాలస్థాయిలో, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ స్థాయిలో,గురుకులాలతో పాటుగావిద్యాసంస్థలలో నూతన సంస్కరణలు ప్రవేశపెట్టాలి. వివిధ యూనివర్సిటీల నుండి డాక్టరేట్ పట్టా పొందిన లెక్చరర్స్‌ను ఎంపిక చేసి ఇతర రాష్ట్రాలు,ఇతరదేశాలలో విద్యావ్యవస్థలో ఉన్న సంస్కరణ మన రాష్ట్రంలో ప్రవేశపెట్టడానికి గాను టీచింగ్ పరిశోధకుల టీంలను ఏర్పాటు చేయాలి. వీరి సలహాలు, సూచనలను ప్రభుత్వం విద్యాశాఖ అనుసరించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### బ్యాంకుల్లో సొమ్ము జాగ్రత్త

ఈ మధ్య క్రిమినల్స్ ఇతరుల బ్యాంక్ ఖాతాల్లోకి జొరబడి కొంత సొమ్మును జమ చేయడం ఇది సైబర్ క్రైమ్‌కు సంబంధించినదని బ్యాంకు వారికి సమాచారం ఇవ్వడంతో బ్యాంకు వారు వెంటనే స్పందించి ఖాతాలను స్తంభింపచేయటం జరుగుతున్నది. ఎ.టి.ఎమ్.లో డబ్బుతీసుకుందామని వెడితే మీ ఖాతా తిరస్కరించబడినది. అనే మెసేజ్ రాగా, సైబర్ క్రైమ్ నంబరు 1930 ను సంప్రదిస్తే సమస్యను పరిష్కరించడానికి బదులు వారు దగ్గరనున్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని సలహాయిచ్చారు. ఈడబ్బును ఎవరు జమచేసారో వాళ్లను స్వయంగా సంప్రదించమన్నారు. ఆ డబ్బు ఇతరరాష్ట్రాల నుండి వచ్చిందని తెలిపారు. బ్యాంకుకు వెళ్ళిఅడుగగా వారు పరిష్కారం చేయడం జరిగింది. ఇది జరిగిన వారం తరువాత మరల ఎవరో కొంత సొమ్మును పంపి ఇది సైబర్‌క్రైమ్‌కు సంబంధించినదనిమెసేజ్. ఇలా ఎందుకు జరుగుతోంది?ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లేదా?ఇలాంటి ఉదంతం సికింద్రాబాద్‌లో నున్న యూనియన్ బ్యాంక్, అల్వాల్ బ్రాంచిలో ఓఖాతాదారునికి ఇలాగే జరిగింది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మహిళా న్యాయమూర్తులను నియమించాలి

కోర్టులలో మహిళ న్యాయమూర్తులను నియమించడం తగ్గిపోయింది. ముఖ్యంగా మైనారిటీల నియామకం ఏ మాత్రం లేదు. దేశం లోమహిళ సమానత్వం గురించి చర్చ జరుగుతున్నప్పుడు ఉన్నత స్థానాలలోవాటా దక్కాలికదా మరిఎందుకు అలా జరగడం లేదు అనేది పెద్ద ప్రశ్న. ఒక్క నాగరత్న తప్ప ఇప్పుడు సుప్రీం కోర్ట్‌లో ఒక్క మహిళ న్యాయమూర్తి లేరు అంటే అతిశయోక్తి లేదు. ఒక్క ఎన్‌వీ రమణ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో ఎక్కువమహిళ న్యాయమూర్తులనీ నియమించగా అది మొత్తం న్యాయమూర్తులలో 10 శాతం దాటలేదు అనే నిష్ఠుర సత్యం జీర్ణం చేసుకోవాల్సి రావడమే విడ్డూరం.

-భారత అవినాష్, జనగామ

### ఉపాధి హామీ కల్పించాలి

తెలంగాణలో పెరిగిన నీటి వసతులు భూమి అభివృద్ధి కార్యక్రమాలను ఉపాధి హామీ కింద చేసేందుకు హామీ ఇస్తున్నాయి. ఒకప్పుడు మురికి తుమ్మలు మొలిచిన నెలలు నేడు సాగు యోగ్యంగా మారడానికి ఉపాధి హామీ హామీ పడుతుంది. చిన్నచిన్న గూడెంలలో కూడా ఎక్కువలో ఎక్కువగా 10 నుండి 15ఎకరాలలో మాత్రమే పాడుబడ్డ భూములున్నాయి.

-కె.రామారావు, నల్గొండ

# ప్రజాస్వామ్య లీల.. ప్రహసన హేల!

**చంద్రశేఖర్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నికల కమిషనర్‌గా శేషన్ నియామకం జరిగిన తర్వాత కమిషన్‌కు ఎక్కడలేని గుర్తింపు ప్రాముఖ్యత వచ్చాయి. ఒక్కమాటల్లో చెప్పాలంటే ఎన్నికల కమిషన్ అంటూ ఒకటి ఉందని, దానికి నియమావళి ఉందనే విషయం సాధారణ పౌరులకు అప్పుడే తెలిసింది.రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా నీతీ,నిజాయితీతో వ్యవహరిస్తే ఉన్నచట్టాలతో ఎంత వరకు చేయవచ్చునో ఆయన చేతల్లోచేసి చూపించారు.కొమ్ములు తిరిగిన నాయకులకు కూడా చెమటలుపట్టించారు. కరెంటు స్తంభాలకు జెండాలు కట్టాలన్నా, గోడల మీద రాయాలన్నా వెనుకా ముందు ఆలోచించాల్సిన పరిస్థితులు కల్పించారు. ఏ తప్పు చేస్తే ఏ మూల నుంచి కనిపెట్టి చర్యలకు ఒడిగడతారోననే భయం అభ్యర్థుల్లోనే కాదు వారిని బలపరుస్తున్న అనుచరుల్లోకూడా తెప్పించారు. కానీ ఆయన తర్వాత ఎన్నికల కమిషన్ అంతటి సమర్థత చూపలేకపోతున్నది.**

దామెర్ల సాయిబాబ

ఎలాంటి అవకతవకలకు, అవినీతికి, అన్యాయాలకు పాల్పడకుండా సంఘంలో నీతి,నిజాయితిలతో ఆదర్శనీయంగా, అనుకరణీయంగా జీవనం సాగించి మంచివారుగా బతకాలని కొందరు త్రికరణశుద్ధిగా భావిస్తున్నా, పరిస్థితుల, వూహించని సంఘటనలు పరిస్థితిలు ప్రభావంతో మారి చెడ్డవారిగా ముద్ర వేయించుకొంటుంటారు. మరికొందరు ఎప్పుడెప్పుడు పరులను మోసం చేద్దామా? అమాయకులను దగా చేసి, రాత్రికి రాత్రే లక్ష్మీపుత్రులు కావాలనే ఆరాటంలో చేయరాని, చేయకూడని పనులు చేయాలనీ తహతహలాడుతున్నా అవకాశాలు రాక మంచివారుగా మిగిలిపోతున్నారు.. గతంలో ఎన్నికల సంగ్రామం ప్రారంభమైనపుడు మాత్రమే గెలుపే ధ్యేయంగా అక్రమాలకు పాల్పడేందుకు సిద్ధపడేవారు. తాము చేసే అక్రమాలు వెలుగుచూస్తే సమాజం ముందు తలవంచుకొనే పరిస్థితులు దాపురిస్తాయనే భయభక్తులుండేవి. ఇప్పుడా పరిస్థితులులేవు. ఎన్నికలు ముగిసిన మరుసటి రోజు నుండే పత్యర్థులను రాజకీయంగా సమాధి చేయాలనే వ్యూహాలు పన్నుతున్నారు. ప్రత్యర్థుల,వారి సానుభూతిపరులు ఓట్లు తొలగించడం, తమకు అనుకూలమైన వారి ఓట్లతో జాబితా నింపడం పరిపాటిగా మారిపోతున్నది. బీహార్ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగనున్నాయి. ఇప్పటి నుంచే హోరాహోరీగా పోరాటం మొదలైంది. లక్షల సంఖ్యలో బోగస్ ఓట్లు చేర్చారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారంలో ఏ పార్టీ ఉన్నా అవకతవకలకు ఒక్క అడుగు ముందే ఉంటున్నట్లు గతంలో జరిగిన ఎన్నికలు చెప్పకనే చెబుతున్నాయి. అధికారంలో ఉన్న పెద్దల సేవలో తరించి పోవాలనే తపన ఉన్న అధికారులు పెరిగిపోతుండంతో ఈ ఎన్నికల నిర్వహణలో ఈ దురదృష్ట పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఇక వరాల వర్షం గూర్చి చెప్పాల్సిన పనిలేదు. ప్రజలు అడిగిన పనులే కాదు అడగని వరాలు కూడా గుప్పిస్తుంటారు. ఎన్నికల సమయంలో తప్ప తాము అడిగినపనులు నేతలు చేయరనే భావన గట్టిగా పట్టుబట్టి తమ కోరికలను తీర్చిన వారికే తమ ఓట్లని చెబుతున్నారు. గతంలో కూడా ఇదే ధోరణి ఉన్నా, గుడిగోపురాలు, కమ్యూనిటీ హాలు గురించి అడిగేవారు. ఇప్పుడీ పరిస్థితులు కూడా మారిపోయాయి. ఓటు వేస్తే తమకు ఏపాటి లాభమనే ఆలోచనవైపు మొగ్గ చూపుతున్నారు. ఫలితంగా ఎన్నికల వ్యయం పెరిగిపోతున్నది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సినదాని కన్నా ఇరవై,ముప్పైరెట్లు అధికంగాఖర్చు పెట్టాల్సి వస్తున్నది. అంతటి ఆర్థిక, అంగబలం ఉన్నవారే ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. పార్టీలు కూడా టిక్కెట్ కేటాయించే ముందు ఈ అర్హతలనే పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఫలితంగా ప్రజా సేవచేయాలనే తపన ఉన్నవారు అంతో ఇంతో నిజాయితీగా వ్యవహరించేవారు ఈ వ్యయాన్ని భరించలేక ఎన్నికలకు దూరమవుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్న వారికి తమపెట్టుబడిని తిరిగి రాబట్టుకోవాలని ఉండటం సహజం. అందుకే రాజకీయాల్లో అవినీతి ఒక భాగమైపోయింది. అవినీతి పెరగడానికి పరోక్షంగా నేర చరితులు, అవినీతిపరులు అందలం ఎక్కడంతో ప్రజల పాత్ర కీలకమని వాదించేవారు ఉన్నారు. ఇకపోతే గతంలో నాయకులు ఎంతో నీతినియమబద్ధంగా తమ ప్రవర్తన వ్యవహారశైలి, నడక, నడవడిక, క్రమశిక్షణే కాదు వేషభాషల పట్ల కూడా ఎంతో జాగ్రత్తలు తీసుకునేవారు. తమను ప్రతినిత్యం వెయ్యికళ్లు గమనిస్తుంటాయనే జంకు, భయం వారిలో ఉండేది. అందుకే రాజకీయాల్లో ప్రవేశించి మరింత ఎత్తుకు ఎదగాలనుకునేవారు ప్రతి అడుగు అంతో

### ఒక్క మాట

ఇంతో ఆచితూచి వేసేవారు. అవినీతి, ఆశ్రితపక్షపాతం వీటన్నింటినిమించిన ప్రవర్తన పట్ల ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవారు. గ్రామసర్పం చులుగా రాజకీయ ప్రవేశం చేసిన వారు అంచెలంచెలుగా ఆనాటి సమితి అధ్యక్షులుగా,శాసనసభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా,రాష్ట్ర మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా, కేంద్ర మంత్రులుగా పెరిగిన వారెందరో ఉన్నారు. నేరచరితులు పెరిగిపోతున్నారు. దీన్ని అడ్డుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. గత ఇరవైయేళ్లుగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు విజయం సాధించిన వారిలో లెక్కలు పరిశీలిస్తే ఎన్నికల ఎన్నికలకు నేరచరితుల సంఖ్య పెరిగి పోతున్న విషయంస్పష్టమవుతున్నది. రానురాను ఈ సంస్కృతి పెరిగిపోతుందనడానికి ఆ అంకెలే అద్దం పడుతున్నాయి. ఈ పార్టీ, ఆపార్టీ అనికాదు. ఏదోకొద్ది మంది కొన్ని పార్టీలు తప్ప అన్నిపార్టీలు అదేబాటలో పయనిస్తున్నాయి. ఏమిచేసి అయినా అధికారాన్ని కైవసం చేసు కోవాలనే ఆరాటంలో నైతిక విలువలకు లోదకాలిస్తున్నాయి. ఈ ఆరాటపోరాటంలో చేయకూడని, చేయరాని పనులు కూడా చేస్తున్నారు. ఎన్ని చట్టాలు చేసినా,మరెంత పకడ్బం దీగా ఏర్పాటు చేసినా పోలింగ్‌లో కొన్నిప్రాంతాల్లో రిగ్గింగ్‌ను, దౌర్జన్యాన్ని నిరోధించలేకపోతున్నారు. రాజకీయ పార్టీలు విరాళాల పేరుతో నల్లధనస్వాముల నుంచి నిధులు పోగేసు కుంటున్నాయి. ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బును వెదజల్లు తున్నారు. చట్టంలో లొసుగులను అడ్డం పెట్టుకొని కొన్ని పార్టీలు ధనసేకరణకు పెద్దఎత్తున పాల్పడుతున్నాయి. ఇది ఇప్పటికిప్పుడు కొత్తగా పుట్టింది కాకపోయినా రాను రాను పెరిగిపోతున్నది. కొన్ని రాజకీయ పార్టీలు విరాళాల రూపేణ నల్లధనాన్ని మార్చుకు నేందుకు ఉద్భవించాయనే ఆరోపణల ను తోసిపుచ్చలేం. గ్రామస్థాయి నుండి సాధారణ శాసనసభ, లోక్‌సభ, ఒక్కటే మిటి ఏ ఎన్నికలు జరిగినా కోట్లాదిధనం నీరులా ప్రవహిం పచేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే వీటిని నియంత్రించేందుకు ఏనాటి నుంచో చట్టాలు న్నాయి. మరెన్నో నిబంధనలున్నాయి. వాటిని అమలు చేయాల్సిన అధికారుల్లో చిత్తశుద్ధి లేదేమోననిపిస్తున్నది. భారతదేశంలో లోక్‌సభ నియోజకవర్గాలకు కానీ,శాసనసభ లకు పోటీపడుతున్న అభ్యర్థులు గరిష్టంగా ఎంతఖర్చుచేయ వచ్చో పటిష్టమైన చట్టం, నిబంధలు ఏర్పా టుచేశారు. ఇవి ఎంతవరకు అమలు అవుతున్నాయో అందరికి తెలుసు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు చేస్తున్న ఖర్చు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కొన్నిరాష్ట్రాల్లో డబ్బులు, చీరలు, ముక్కు పుడకలు, కమ్మలు ఒక్క టేమిటి ఏమి ఇస్తే తమకు ఓట్లు వేస్తారోననే తర్జనభర్జనలు చేసి ఎంతో ముందుగానే నిలవచేసుకుంటున్నారు. ప్రతిఎన్నికల్లో పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నాయి. ఆ ఎన్నికలకు ఎన్నికల కమిషనే ఊపిరి. అందుకే భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించగలిగే స్వతంత్ర ప్రతిపత్తి హోదాతో దేశంలోని చట్టసభలకు ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. 1952నుంచి లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ ఎన్నికలు ఈ ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి. రాష్ట్ర పతి,ఉపరాష్ట్రపతి ఎన్నికలుకూడా కమిషన్ పరిధిలోకే వస్తాయి. మొదట్లో ఏకసభ్య కమిషన్ ఏర్పడిన తర్వాత త్రిసభ్య కమిషన్‌గా రూపాంతరం చెందింది. ఎన్నికల్లో ఎంత ఖర్చు పెట్టాలి?సభలు, సమావేశాలు ఏ సమయం వరకు నిర్వహించుకోవచ్చు?ఎన్ని వాహనాలు వాడాలి? తదితర విషయాల్లో స్పష్టమైన నిబంధనలతో ఎన్నికల నియమావళిని రూపొందించారు. ఈ నియమని బంధనలన్నింటినీ చాలాకాలం ఫైళ్లల్లోనే నిద్రపుచ్చారు. చంద్రశేఖర్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నికల కమిషనర్‌గా శేషన్ నియామకం జరిగిన తర్వాత కమిషన్‌కు ఎక్కడలేని గుర్తింపు ప్రాముఖ్యత వచ్చాయి. ఒక్క మాటల్లో చెప్పాలంటే ఎన్నికల కమిషన్ అంటూ ఒకటి ఉందని, దానికి నియమావళి ఉందనే విషయం సాధారణ పౌరులకు అప్పుడే తెలిసింది. రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా నీతీ,నిజాయితీతో వ్యవహరిస్తే ఉన్నచట్టాలతోఎంత వరకు చేయవచ్చునో ఆయన చేతల్లోచేసి చూపించారు. కొమ్ములు తిరిగిన నాయకులకు కూడా చెమటలుపట్టించారు. కరెంటు స్తంభాలకు జెండాలు కట్టాలన్నా, గోడల మీద రాయాలన్నా వెనుకా ముందు ఆలోచించాల్సిన పరిస్థితులు కల్పించారు. ఏ తప్పు చేస్తే ఏ మూల నుంచి కనిపెట్టి చర్యలకు ఒడిగడతారోననే భయం అభ్యర్థుల్లోనే కాదు వారిని బలపరుస్తున్న అనుచరుల్లోనూ తెప్పించారు. కానీ ఆయన తర్వాత ఎన్నికల కమిషన్ అంతటి సమర్థత చూపలేకపోతున్నది. ఇదేపరిస్థితి కొనసాగితే ప్రజాసేవకే అర్థం మారిపోవడంఖాయం. ఎన్నికల కమిషన్ రాజ కీయాలకు, రాగద్వేషాలకు అతీతంగా నిష్పాక్షికత, విశ్వసనీయతే ఊపిరిగా పనిచేయాలి. సవరణలు కొత్త చట్టాలు మాటఅటుంచి ఉన్నచట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేసేందుకు కమిషన్ కృషిచేయాలి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యం ప్రహసనంగా మారక తప్పదు. •

# వర్ష వైపరీత్యాలకు ముందస్తు జాగ్రత్తలు అవసరమే


దాడిశెట్టి శ్యామ్ కుమార్

వర్షాకాలంలో తరచుగా సంభవిస్తున్న వాతావరణ మార్పులు అల్పపీడన ద్రోని ప్రభావం ప్రకృతి వైపరీత్యాల కారణంగా కురుస్తున్న మోతాదుకు మించిన వర్షాలు ఈదురుగాలులతో కూడి వాన బీభత్సం సృష్టిస్తుంటే పట్టణాలు గ్రామీణ ప్రాంతాలలో ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమవుతుంది. పట్టణాలు గ్రామాలు జలదిగ్బంధానికి అడపాదడప గురవుతూ జలదారలుగా ప్రవహిస్తున్న వర్షపు నీటితో జనజీవనం స్తంభించిపోతుంది. పట్టణాల్లో ఎక్కడ పడితే అక్కడ ప్రణాళిక బద్ధంగా లేని కట్టడాలు ఎక్కువ అవుతుండడం, జల ప్రవాహం సాఫీగా పోయే ప్రాంతాల్లో అడ్డుకట్టాలుగా నిర్మించిన కట్టడాలు, ప్రకృతి వైపరీత్యాలలో సంభవించే వరద తాకిడికి పరిసర ప్రాంతాలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండటం సర్వసాధారణం అయిపోతుంది. పట్టణ ప్రాంతాల్లో కొంత మేరకు చెరువుల సమీపంలో బఫర్ జోన్లు ఫుల్ ట్యాంక్‌జోన్లు పరిధిలో నాలాలుపై క్రమబద్ధీకరించబడని అక్రమ కట్టడాలతో పట్టణ పరిసర ప్రాంతాల్లో అకాల వర్షాలతో వర్ష బీభత్సంతోపట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుండటమే కాకుండా అధికారులకు కూడా ఇలాంటి కట్టడాలతో వరద నీరును మళ్లించే ప్రయత్నంలో తీవ్రమైన ఇబ్బందులు పడవలసి వస్తున్నది. నీటి ప్రవాహం వెళ్లే దారులు మూసుకోవడంతో ప్రతికూల ప్రభావంతో వర్షాకాలంలో పట్టణం జలదిగ్బంధంగా మారిపోతూ దినచర్యలో అంతరాయం కలుగుతుంది. పట్టణాల్లో నిర్దిష్టమైన ప్రణాళికలతో సంబంధిత అధికారులుముందు రాబోయే ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడానికి వరద నీరు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటికి అనుగుణమైనటువంటి మార్గాలను అనుసరించవలసిన విధానాలను చట్టపరమైన రీతిలో అవలంబించవలసిన ఆవశ్యకత మరింత ఉందేమో. నిపుణులు అధికారులు ముందు చూపుతో సమాజంలో ఉన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రజల సహకారంతో పట్టణాలను సురక్షిత జోన్లుగా ఉండే విధంగా పట్టణాలను, గ్రామాలను సైతం ప్రగతి పథంలోకి తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరోవైపు అధిక వర్షపాతంతో గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు మత్తడి పోస్తూ చెరువు కట్టలు తెగిపోతుండడంతో పంటలు నీట మునిగిపోతూ రైతులు తలడిల్లి పోతున్నారు. అకస్మాత్తుగా వస్తున్న వాతావరణ మార్పులతో అన్నదాత రైతన్న పంటలను కోల్పోయి పెట్టిన పెట్టుబడి చేతికందకుండా దిగుబడి పూర్తిగా కోల్పోయి నష్టాల ఒడిలో కూరుకుపోయి నేలకొరిగిన పంటలను చూస్తూ కన్నీటి పర్యంతం అవుతున్న రైతన్నల ఆవేదన వర్ణాతీతమే. వ్యవసాయాన్ని కష్టాన్ని నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకునే రైతాంగం తరచుగా వర్షాకాలంలో మోతాదుకు మించి పడుతున్న వర్షాలతో వ్యవసాయరంగంలోని భిన్న పరిస్థితులతో అనేక సమస్యలతో సతమతం అవుతుండడం మరో ఎత్తు అవుతుంది. దేశానికి వెన్నెముక అన్నంపెట్టే రైతన్న పొలాన్ని దుక్కిదున్ని పంట పండించిస్తే అల్పపీడన ద్రోణి ప్రభావంతో అధిక వర్షాలతో చేతికి వస్తుందని అనుకున్న పంట కనుల ముందే చూస్తుండగానే మొత్తం భూమిపాలై నష్టపోవడంతో పంటలు కోల్పోయిన రైతన్న కళ్లల్లో కన్నీళ్లు తిరుగుతుండటం సహజమే. భూమిని నమ్ముకుని బతుకుతున్న రైతన్నలు చాలా ఎకరాలలో సాగుచేసిన మొక్కజొన్న పత్తి,వరి,పసుపులాంటి పంటలు ఎదుగుతున్న తరుణంలో అధిక వర్షాల ప్రభావంతో పంట మొత్తం నేలకు ఒరిగిపోతే అన్నదాత దిగులుగా నష్టపోయిన పంటను చూస్తూ ఎవరోవస్తారని ఏదైన సహాయం చేస్తారేమోనని ఆశతో అల్లాడిపోతున్న రైతులకు ప్రభుత్వాలు మరింతగా భరోసా కల్పించేలా నష్టపోయిన పంటకు పరిహారంచెల్లించేలా సహాయ సహకారాలు అందించాలి. •

# నయా వలసవాదం అంటే ట్రంప్ విధానాలే కదా!

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

అంతర్జాతీయ వాణిజ్యవిధానాలను అమెరికా తన గుప్పెట్లోకి తీసుకొని ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశంపై 50 శాతం పైగా దిగుమతి సుంకాలను విధించింది. పెట్టుబడిదారీ దేశాలకు లాభోద్దేశం తప్పవేరే ఆలోచన ఉండదు. ప్రపంచంలో భారత్, అమెరికా పెద్దప్రజాస్వామ్య దేశాలు. వీరి మధ్య నడుస్తున్న వాణిజ్యయుద్ధాలు ప్రజలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. భారత్లో ఆనాటి బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీనే మించిపోయింది ఈనాటి అమెరికా సామ్రాజ్యవాదం. మన దేశాభివృద్ధికి మన పాలకులు అనుసరించే ఆర్థిక అభివృద్ధి,వివిధ రంగాల సంరక్షణ విధానాలను ప్రశ్నించేందుకు, ఎదిరించేందుకు అమెరికా ప్రెసిడెంట్ ఎవరు? వ్యవసాయం,పాడిపరిశ్రమ, మత్స్య పరిశ్రమ మొదలైన ప్రాథమిక రంగాల నుంచి పారిశ్రామిక రక్షణరంగాల వరకు మనం చేపట్టే విధానాలను ఎప్పుడు వ్యతిరేకించడమేనా అమెరికా పని. ఏమైతేనేం తాజా సుంకాల భారం మన దేశంనుంచి పోయే 66ఎగుమతులపై తీవ్ర ప్రభావమే చూపగలదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందువల్ల ఈ ఏడాది వచ్చే ఏడాది మన వృద్ధిపై 0.8కోత పడవచ్చును అంటున్నారు. రత్నాభరణములు, దుస్తులు,వాహనాల విడిభాగాలు,స్టీలు,రొయ్యలు,తోలు ఉత్పత్తులు మొదలైన ఎగుమతులపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఈ రంగాలలో అనిశ్చితి ఏర్పడుతుందని అంచనా. ఈ రంగాలలో పనిచేసే లక్షలాది కార్మికులు ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుంది. అమెరికా తమ డైరీ ఉత్పత్తులను జన్యు మార్పిడి ఆహార ఉత్పత్తులను మనకు ఎగుమతి చేయాలని ఒత్తిడినీ అంగీకరించపోవడం ట్రంపు కడుపుమంటకు కారణం. కానీ రష్యా నుంచి దిగుమతి చేసుకునే ముడిచమురు కారణంగా చెబుతున్నారు. భారత్లో 46శాతం మంది సాగు రంగంపై ఆధారపడుతున్నారు. అమెరికాలో ఇది ఒక్క శాతం మాత్రమే. మన దేశ జనాభాలో సగం మంది ఆధారపడే సాగు రంగాన్ని నిర్వీర్యం చేయాలట. అమెరికాలో ఆ ఒక్క శాతం జనాభా చేసే డైరీ ఉత్పత్తులను జన్యు మార్పిడి ఆహార ఉత్పత్తులను మనము దిగుమతి చేసుకోవాలట. భారతదేశ వివిధ కారణాల వల్ల గత పాతిక సంవత్సరాలుగా అమెరికన్ శిబిరానికి సన్నిహితంగాఉంటూ వచ్చింది. ఇటీవల కాలంలో బలహీనపడుతున్న అమెరికాకు మన దేశం పట్ల ప్రపంచం పట్ల దృష్టి మారి గతం కన్నా భిన్నమైన విధానాలను రూపొందించుకుంటున్నది. ఈ కొత్త పరిస్థితి భారతదేశానికి ఒక పరీక్షగా మారింది అన్నది గుర్తించవలసిన విషయం. అమెరికా విధానాలలోని మార్పులవల్ల వాణిజ్య ఒప్పందపు చర్చల రూపంలో ఇతరత్రా కూడా




ఎదురవుతున్న ఆర్థికరంగ సమస్యలు కనిపిస్తున్నావే. ప్రపంచంలో భారత్ మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదుగుతున్న వేళ అమెరికా తన నయా వలస పాలన బహిర్గతమవుతున్నది. అమెరికాలో 50 లక్షల మంది ఇండియన్ అమెరికన్లు ఆ దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారని తరచూ అభినందిస్తూ ఉంటారు. వీరు పెద్ద టెక్ సంస్థలైన గూగుల్ మైక్రోసాఫ్ట్, ఫైనాన్షియల్ సంస్థలను నడుపుతున్నారు. విద్యా విధాన నిర్ణయానక సంస్థల్లో కీలక పదవుల్లో ఉన్నారు. యుఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ రెండవసారి అధికారంలోకి రావడానికి భారతీయులు ఎంతోకృషిచేసినారు. యుఎస్ సెకండ్ లేడీ అయినా ఉష బాల చిలుకూరి సుప్రసిద్ధ అమెరికన్ లాయర్ కూడా భారతీయురాలే. ఇండియా పట్ల అమెరికా వ్యవహరిస్తున్న తీరు చూసి వారికి విచారం వేయడం నిజమేకదా. అమెరికా తాను ఆపాదించుకున్న ప్రపంచ పెద్దన్న పెద్దరికంతో తాను విశ్వసనీయ భాగస్వామిగాగుర్తించాలంటే అమెరికా కనుసన్నల్లో ఉండడమేనా? వ్యతిరేకిస్తే నియంతగా వ్యవహరిస్తారా? భారతదేశపు మార్కెట్ చాలా పెద్దదని అమెరికాకు తెలుసు. అమెరికాతో మనం శాస్త్రసాంకేతిక రంగాలలో పోటీ పడుతున్నామని కూడా తెలుసు. మన మానవ వనరులు అమెరికా దేశాభివృద్ధికి ఎలా తోడ్పడుతున్నాయో తెలుసు. మన ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, విద్యావంతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ డాక్టర్స్ ఇతర సేవారంగాలు అమెరికా శాస్త్రసాంకేతిక రంగాలలోతోడ్పడుతున్నారు. మార్కెట్ రీత్యా గాని మానవ వనరుల అభివృద్ధి పరంగా గాని భారతదేశం అతి పెద్ద ఆర్థికవ్యవస్థ. అయితే పటిష్టవంతమైన ఆర్థిక విధానాలు,ప్రభుత్వ నియంత్రణ లేనందున స్వయం పోషకత్వంలో చైనా లాగా మనం నిలదొక్కు లేకపోతున్నాం. సామ్యవాద తరహా సమాజ నుంచి పెట్టుబడిదారి సమాజం వైపు అడుగులు వేసాం. దీనివలన ప్రపంచ పెట్టుబడిదారీ దేశాల కనుసన్నల్లో ముఖ్యంగా అమెరికావిధానాలకు లోబడిపోయే పరిస్థితి ఏర్పడింది. 79 సంవత్సరాలుగా అనేక సందర్భాలలో అమెరికన్ సామ్రాజ్యవాద ఇండియాను తన ఆదేశాలను పాటించాలని బెదిరిస్తుంది. బ్రిటిష్ రాజ్యం నుంచి బిలియనీర్ల రాజ్యం వైపుగా భారత్ ఇప్పటికే పునాదులు వేసుకున్నది. ఎందుకంటే మన పెట్టుబడిదారీ వర్గం ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకమైపోయింది. బడా బుర్జువావర్గ ప్రయోజనాలను నెరవేరుస్తున్న ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలను దేశాభివృద్ధిని ఆర్థిక వ్యవస్థ స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోగలదా? అగ్ర రాజ్యమని చెప్పుకునే అమెరికా తమ పెట్టుబడిదారులను ప్రోత్సహించి ప్రపంచ పెట్టుబడిదారులను నియంత్రించే పరిస్థితి ఉన్నది నేడు. ప్రభుత్వపాలన పెట్టుబడిదారీ కనుసన్నల్లో కాకుండా ప్రజలను శాస్త్ర సాంకేతిక రంగాలలోమమేకం చేసి వస్తు ఉత్పత్తి చేస్తే ఎవరికి ఏమీ మనము తీసిపోము. జరగాలి. స్వాలంబనకు భారత్ ఇప్పుడు తీవ్రమైనసవాలను ఎదుర్కొంటుంది. ఎందుకంటే మన పెట్టుబడిదారీ వర్గంఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడితో మమేకమైపోయింది. ప్రభుత్వాలు చేపట్టే మేక్ ఇన్ ఇండియా లాంటి పథకాలు విజయవంతం కావడంలేదు. ఆ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సామ్రాజ్యవాద పెత్తనం నుండి దేశం బయటపడాలి. •

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

Main tab page 111_Main tab page 111.qxd 9/5/2025 11:56 PM Page 1



## డాక్టరేట్ అవార్డు సాధించిన సంతనూతలపాడు మహిళ రాధిక

**సంతనూతలపాడు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**





సంతనూతలపాడు కేంద్రానికి చెందిన గ్రందె కృష్ణమూర్తి, రమాదేవి కుమార్తె రాధిక హైదరాబాద్‌లో గీతం యూనివర్సిటీ ప్రాంగణంలో సదరు చైర్మన్ వైజాగ్ ఎంపీ బాలకృష్ణ చిన్నల్లుడు, మంత్రి నారా లోకేష్ తోడల్లుడు ఎం.భరత్ నుండి డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. భౌతిక శాస్త్రంలో రాధిక విశేష ప్రతిభను కనపరిచారు. సంతనూతలపాడు కేంద్రానికి చెందిన జి.రాధిక హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ప్రొఫెసర్ బాలాజీ రావు, డాక్టర్ పి.మిస్వక్ స్వరూప్ రాజు పర్యవేక్షణలో రాధిక పీహెచ్‌డీ పూర్తి చేశారు. రాధిక సంతనూతలపాడు హైస్కూల్లో పదో తరగతి వరకు, స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ వరకు, తదుపరి ఒంగోలు ఎస్ఎస్ఎన్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఎంఎస్సీ ఎంఫిల్ రాధిక విద్యాభ్యాసం చేశారు. రాధిక భర్త పాదర్తి శ్రీనివాసులు చార్టెడ్ అకౌంటెంట్ రాధికకు ఒక కుమార్తె ఒక కుమారుడు కలరు. సంతనూతలపాడుకు చెందిన గ్రందె రాధిక డాక్టరేట్ అవార్డు సాధించడం పట్ల పలువురు సంతనూతలపాడు ప్రజలు, మహిళలు, ఆనందోత్సవాలను వ్యక్తం చేస్తున్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గురుతరమైంది

**ఒంగోలు, ప్రభాతవార్త**



సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గురుతరమైందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు అన్నారు. ఒంగోలులోని బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా జిల్లాలోని 50 ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎస్బీఐ ఆర్.ఎం వెల్లంకి శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్ కుమార్, ఉప విద్యాశాఖాధికారి డి.చంద్రమోళీశర్వరావు, రీజనల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్లు వేదం రాజేష్ బాబు, హారతి, రవికుమార్, హెచ్ ఆర్ మేనేజర్ తి.ఎన్.వి.ఎస్.నళినీకాంత్, కె.జానకిరామయ్య,ఎస్బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ డిప్యూటీ రీజనల్ సెక్రటరీ వేమజాల శ్రీనివాస రావు, ఎస్బీఐఓఏ జోనల్ సెక్రటరీ సీహెచ్ శ్రీనివాసరావు, ఒంగోలు, టంగుటూరు ఏంఈఓలు టి.కిషోర్ బాబు, తన్నీరు బాలాజీ, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆర్.ఎం. వెల్లంకి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు మన మార్గనిర్దేశకులన్నారు. మన సమాజంలో గురువు పాత్ర ఎంతో ఉందన్నారు. ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో వేతన ఖాతాలు కలిగి ఉంటే ఎన్నో ప్రయోజనాలను కల్పిస్తున్నామన్నారు. వ్యక్తిగత, గృహ, విద్యా రుణాలను త్వరితగతిన మంజూరు చేస్తున్నామని బ్యాంక్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ, భవిష్యత్తు మార్గనిర్దేశకులను తయారు చేసే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ప్రతి ఏటా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి ధన్యవాదాలు తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సర్వేపల్లి జన్మదిన వేడుకలు

**ఒంగోలు, ప్రభాతవార్త**




లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా టీచర్స్ డే సెలబ్రేషన్స్ పట్టణంలోని విందు భోజనం హోటల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణములోని ప్రముఖ విద్యా సంస్థలు సెంట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ నోబుల్ చరియన్, లిజీని, అపెక్స్ స్కూల్ కరస్పాండెంట్ శివకోటిరెడ్డిని ఘనముగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ కూర పాటి రమేష్, పూర్వ అధ్యక్షులు పల్లపు సుబ్బయ్య, తమ్మన ఆంజనేయులు, పబ్బిశెట్టి జనార్ధన్ మరియు మిరియాల కృష్ణమూర్తి, గోపి, విజయ్, కిషోర్, అజయ్, సతీష్, బదిరీ, సురేష్, రాంప్రసాద్, కోడూరి కిషోర్, ప్రసాద్, క్లబ్ కార్యదర్శి లక్ష్మణస్వామి కోశాధికారి, పి నందకుమార్ పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షులు పార్థసారథి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమము నిర్వహించడం జరిగినది.

## ఎమ్మెల్యే బిఎన్ ను కలిసిన జేసీ నాయకులు

**చీమకుర్తి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ ను చీమకుర్తి అణగారిన కులాల ఐక్యవేదిక జేఏసీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చీమకుర్తిలో నెలకొన్న కొన్ని సమస్యలను ఈ సందర్భంగా లిఖితపూర్వకంగా ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనార్టీ పేద ప్రజలకు నివాస స్థలాలు మంజూరు, రామతీర్థం జలాశయం నుండి చీమకుర్తి ప్రజలకు ఇంటింటికి త్రాగునీరు పథకం తొందరగా పూర్తి చేయాలి కోరారు. బిసి బాలుర, బాలిక హాస్టల్ విద్యార్థులకు శాశ్వత భవనలను ఏర్పాటు చేయాలని, చీమకుర్తి పట్టణముకు పబ్లిక్ పార్క్ ను ఏర్పాటు చేయాలి కోరారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల సమస్యలను త్వరగా పరిష్కరించమని జేఏసీ నాయకులు ఎమ్మెల్యే గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు పేరం శ్రీనివాసరావు,షేక్ ఖాదర్ బాషా,అధ్యక్షులు బండ్ల కొండలరావు,ఉపాధ్యక్షులు దగ్గు సిద్దయ్య,కార్యదర్శి షేక్ జంషీర్,అత్యాల దావీదు, కోశాధికారి పాలపర్తి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్వా రైతులకు ప్రత్యామ్నాయ మార్కెట్ ఏర్పాటు చేయాలి

**కొత్తపట్నం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



కొత్తపట్నంలో ఆక్వా రైతుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు ఆధ్వర్యంలో అనేక మంది ఆక్వా రైతులను కలుసుకోవడం జరిగింది. ఈనెల 8వ తేదీన ఒంగోలు ఎల్ బి జి భవనంలో రొయ్యల ఎగుమతులపై అమెరికా ఆంక్షలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాధ్య తప్రత్యామ్నాయ మార్గాలు అనే అంశంపై ఆక్వా రైతుల రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని ఈ సమావేశంలో ఆక్వా రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అమెరికా సాగిస్తున్న 50 టారిఫ్ల దాడిపై మన రాష్ట్ర ఆక్వా రైతులపై తీవ్ర ప్రభావం పడినదనీ,అమెరికా టారఫ్ యుద్ధాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కోవాలి రాష్ట్రంలో ఆక్వా రంగము రెండున్నర లక్షల రైతులు పై ప్రభావం పడుతుంది పరోక్షకంగా వేలాదిమంది కార్మికులు ఉద్యోగులు ఆధారపడి ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు పి హనుమంతరావు, కే శ్రీరాములు మొదలుకు వారు పాల్గొన్నారు.

## పల్లెలకు పండుగొచ్చింది

**- జిల్లాకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల - రూ.41.98కోట్లు విడుదల**

**ఒంగోలు, ప్రభాతవార్త**

నిధులలేమితో అల్లాడుతున్న గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వంఊపిరి పోసింది. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను ప్రభుత్వం గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. గత పాలనలో ఆర్థిక సంఘం నిధులను ఇష్టరీతిన దారి మళ్లించడంతో గ్రామాల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ పనులు కుంటుపడ్డాయి. దీంతో జిల్లాలోని గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు కావడంతో ఊరట లభించింది. జిల్లాలో 729 గ్రామ పంచాయతీలకు టైడ్, అన్‌టైడ్ నిధులు విడుదల అయ్యాయి. 2011 జనాభాతో పాటు, భౌగోళిక విస్తీర్ణం ఆధారంగా పంచాయతీల ఖాతాలకు నిధులు కేటాయించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి విడుతగా రూ.40కోట్లు విడుదల కాగా తాజాగా రెండో విడత కింద మరో రూ.41.98 కోట్లు విడుదల అయ్యాయి. మండల జిల్లా పరిషత్‌లకు కూడా త్వరలోనే నిధులు సర్దుబాటు చేయనున్నారు. తద్వారా పల్లెల్లో అభివృద్ధి పనులకు మోక్షం కలగనుంది. మార్గదర్శకాల ప్రకారం టైడ్ నిధులను తాగునీరు, పారిశుధ్యం, నీటి వనరుల సంరక్షణ తదితర పనులకు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. మిగిలిన అన్‌టైడ్ నిధులను పంచాయతీల్లో విధులు నిర్వహించే ఉద్యోగుల జీతభత్యాలకు మినహాయించి ఇతర పనులకు ఖర్చు చేసేందుకు వెసులుబాటు ఉంది. నిధుల్లేమితో అల్లాడిన పల్లెలు ఆర్థిక సంఘం నిధులు జమ కావడంతో ఊరట చెందనున్నాయి. టైడ్ గ్రాంట్‌లో 50శాతం పారిశుధ్య పనులు, మిగిలిన 50శాతం తాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంది. ఆర్థిక సంఘం నిధులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలో గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం తెచ్చేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 82.06 కోట్లను పంచాయతీ అకౌంట్లకు జమ చేసింది. గత ఆరు నెలల క్రితం 40.9కోట్లు తాజాగా బుధవారం రూ.41.98కోట్లను కలిపి ఈ మొత్తాలను పంచాయతీ అకౌంట్లకు జమ చేశారు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో పంచాయతీలకు నిధులివ్వడమే కాకుండా ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ నిధులను కూడా మంజూరు చేయడం విశేషం.

ప్రకాశం వార్త
తెలుగు జాతీయ దినపత్రిక



## శ్రీ కార్యసిద్ధి మహాశక్తీ గణపతి దర్శించుకున్న మాజీ మంత్రి శిద్దా

**ఒంగోలు, ప్రభాతవార్త**



దూండి గణేష సేవా సమితి ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రులలో భాగంగా విజయవాడలోని సితార సెంటర్ నందు 72 అడుగుల శ్రీ కార్యసిద్ధి మహా శక్తి గణపతి విగ్రహాన్ని రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దర్శించుకొని, గణపతి.. శ్రీ నగరేశ్వర స్వామి.. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా దూండి గణేష సేవాసమితి అధ్యక్షులు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ దంపతులు, శిద్దా రాఘవ రావుని స్వామి వారి తీర్థ ప్రసాదాలతో పాటుగా శేష వస్త్రాలు బహుకరించారు.

## భార్యమీద అనుమానంతో

# ముగ్గురు పిల్లలను కన్నతండ్రే కడతేర్చాడు










**యర్రగొండపాలెంరూరల్, ఆగస్టు 5, ప్రభాతవార్త**

చూడరానిది ఎం చూసాడో, వినరానిది ఎం విన్నాడో పాపం తెలియదుగానీ ఓ తండ్రి దారుణానికి పాల్పడ్డాడు కన్న బిడ్డలు ముగ్గురిని తన చేతులతోనే పెట్రోలు పోసి తగుల బెట్టాడు.. అన ంతరం తానూ విషం తాగి మరణించాడు.. దాంతో తండ్రి బిడ్డలు నలుగురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.. యర్రగొండ పాలెం మండలం బోయలపల్లి గ్రామానికి చెందిన గుత్తా వెంకటేశ్వర్లు చేసినదారుణం సభ్యసమాజంలో ప్రతి హృదయాలను కలిచివేసే విషాదకరమైన సంఘటన చోటుచేసుకున్న విషయం విధితమే. గుత్తా వెంకటేశ్వర్లు భార్యమీద అనుమానం నేపథ్యంలో తన కన్న బిడ్డలు దీపికా(8), వర్షిణి (6), శివధర్మ (4), ముగ్గురు పిల్లలను బైక్ పై ఎక్కించుకొని ఇంటినుంచి బయలు దేరిన వ్యక్తి అదృశ్యమై మరసటి రోజు తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లాలో తేలీన విషయం తెలిసింద.. అయితే ఆ కాసాయి తండ్రి కన్న బిడ్డలని కూడ చూడకుండ పసి బిడ్డలను పెట్రోలు పోసి కర్కషంగా కాల్చి బూడిద చేసి చంపేసాడు, ఇక తాను బతకడం ఎందుకనుకొని పురుగుల మందును సేవించి అక్కడే తనువు చాలించాడు. ఈ దారుణ సంఘటన ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం బోయల పల్లి గ్రామంలో కలకలం సృష్టించింది. యర్రగొండపాలెం మండలం బోయలపల్లి గ్రామంలో గుత్తా వెంకటేశ్వర్లు దీపికా భార్యాభర్తలుగా జీవనంసాగిస్తున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు సంతానంగా పుట్టారు. దీపికా( 8), వర్షిణి (6),శివధర్మ (4), లతో అందమైన కుటుంబం ఎంతో అన్యోన్యంగా ఉండే జంట అయితే ఈ మధ్యనే తన భార్య దీపికను అంగన్వాడీలో విహోఏగా చిన్నపాటి ఉద్యోగంలో చేర్పించాడు. ఆ చిరు ఉద్యోగమే ఆ కుటుంబంలో కలతలకు అపార్ధాల కు దారితీస్తుందని అతను ఊహించలేక పోయాడు. అంతే కొన్ని రోజులుగా కుటుంబంలో కలహాలు మొదలై కలతలురేగాయి.దాంతో కలత చెందిన వెంకటేశ్వర్లు ఏమనుకున్నాడో ఏమో మనసులో దారుణమైన నిర్ణయానికి ప్రణాళిక రచించు కున్నాడు. ఈ భూమీమీద తాను ఉండదుకుడదు తనతో పాటు తనకు పుట్టిన పిల్లలు కూడ ఉండకూడదు అనే దారుణ నిర్ణయం తీసుకున్నాడు, నిర్ణయానికి అనుగునంగా తన పిల్లలను బైకు పై ఎక్కించుకొని గత నెల 31 వ తేదీన సాయంత్రం 4 గంటలకు తనతో తీసుకెళ్లాడు.. పిల్లల్ని బైక్ ఎక్కించుకొనిపోవడం చూసిన భార్య దీపికా ఎక్కడికి అని అడగడంతో చాక్లెట్‌లు ఇప్పించాలి పిల్లలకి అంటూ వాహనంతో కదలిపోయాడు. అలా పిల్లల్ని తీసు కుని వెళ్ళిన భర్త చీకటి పడుతున్న ఇంటికి రాకపోవడంతో భార్యదీపికకు ఆందోళన మొదలైంది..గంటలు గడుస్తున్నాయి.కుటుంబ సభ్యుల్లో టెన్షన్ మొదలైంది. తన భర్త ఫోన్ స్విచ్ఆఫ్ చేయడంతో ఆమెకు ఆందోళన ఎక్కువైంది. గంటలు రోజుగా మారి చీకటి పడి తెల్లారింది. ఇరు కుటుంబాల్లో ఆందోళన మొదలైంది. విషయం కాస్తా గ్రామంలో అందరికి తెలియడంతో అందరూతలో దారి వెతకడం మొదలెట్టారు..ఫోన్ స్విచ్ ఆఫ్ అవ్వడంతో పాటు ఆచూకీ ఎంతకీ లభ్యం కాకపోవడంతో భార్య యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసింది.. పిర్యాదు తీసుకున్న పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొన్నారు , కేసుతీవ్రతను గమనించిన పోలీసులు రంగంలోకి దిగిపోయారు.ముమ్మరంగా దర్యాప్తు ప్రారంభించారు. దోర్నాల నుండి శ్రీశైలం వైపు పోయినట్లు తెలుసు కున్న పోలీసులు అటువైపుగా దృష్టి సారించారు. దాంతో పోలీసుల కు ఫారెస్టు చెక్ పోస్టు వద్ద సీసీ కెమెరాలలో నమోదన ద్రుశ్యాలను పరిశీలించారు. బైక్‌పై ముగ్గురు పిల్లలతో పోతున్నట్టు ఆధారాలు దొరకడంతో ఆవైపుగా పోలీసులు కదిలారు. అక్కడి నుంచి తెలంగాణా రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా అచ్చం పేట వద్ద ముగ్గురు పిల్లలతో తండ్రి గుత్తా వెంకటేశ్వర్లు బైక్ పై వస్తున్నట్టు దృశ్యాలు నమోదయ్యాయి. ఆ తరువాత నాగర్ కర్నూలు జిల్లా దిండి గ్రామం వద్దకు రాగానే ఒక పాప హని మాత్రమే తండ్రి వెంకటేశ్వర్లు బైక్ పై ఉన్నట్టు సీసీ కెమెరాలో దృశ్యాలు నమోద య్యాయి.. ఇద్దరు పిల్లలు వర్షిణి,శివధర్మ అక్కడ మిస్సింగ్ అవ్వడంతో పోలీసులకు టెన్షన్ వాతావరణం ఏర్పడింది..ఇది తెలిసిన బంధువులకు భయాందోళనలు మొదలయ్యాయి.. అక్కడి నుంచి నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండి మండలం పెద్దపూర్ గ్రామ సమీపంలో బూరకుంట చెట్లల్లో పురుగుల మందు తాగి గుత్తా వెంకటేశ్వర్లు మరణించి విగతజీవిగా పడిఉన్నాడు.బైక్ తనతో వచ్చినఒక కూతురు దీపిక జాడ కూడా లేకపోవడంతోపాటు మొత్తం ముగ్గరు కన్న బిడ్డలు దీపికా( 8), వర్షిణి (6),శివధర్మ (4), ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులు కూడా ఈ విషయం పై తీవ్ర స్థాయిలో అలెర్ట్ అయ్యారు.ముగ్గరు పిల్లల జాడ లేకపోవడంతో చేయరాని ఘోరం ఏమైనా చేశాడా అని బంధువులు తీవ్ర భయాం దోళనలోపడ్డారు.. అయితే దుర్మార్గుడైన తండ్రి పాము తనపిల్ల లను తానే చంపేవిధంగా ముగ్గురు పిల్లలో ఇద్దరిని వర్షిణి (6),శివధర్మ (4) ను పెట్రోలు పోసి నాగర్ కర్నూలు జిల్లా వెల్లండ మండలం సూర్య తాండ సమీపంలోని రాళ్ళ గుట్టల మధ్యలో పిల్లల రెండు మృతదేహాలు పూర్తిగా తగలబడి గుర్తు పట్టలేని స్థితి లో ముద్దగా పడిఉన్నాయి. అదేవిధంగా పెద్దామ్మాయి మోక్షిత మృతదేహాన్ని, వెంకటేశ్వర్లు మృతి చెందిన ఏరియా లోనే తాండ్ర వద్ద పోలీస్‌లు గుర్తించారు. ఇప్పటికే భర్త గుత్తా వెంకటేశ్వర్లు మర ణంతో బోయలపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ముగ్గురు కన్న బిడ్డలను తండ్రే చంపేసిన విషయం తెలియడంతో మృతుని నివాసంలో భార్య, బందువుల రోధనల దృశ్యాలు అం దరిని కలిచివేశాయి. ఏది ఏమైనా భార్య భర్తల మధ్య గొడవలు, పిల్లల చావుకు కారణం కావాడం క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోని కన్న బిడ్డలనుచంపేసే పరిస్థితులు కల్పించు కోవడం మంచిది కాదని సమాజం ఎటుపోతుందో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందని, మను షులకుజంతువులకు తేడా ఏముందని బంధువులు అంటున్నారు.

# సమాజానికి దిశానిర్దేశం చేసేది గురువులే :జేసి గోపాలకృష్ణ








**ఒంగోలు, ప్రభాతవార్త**

సమాజానికి దిశానిర్ధేశం చేసేది గురువులేనని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. విద్యార్ధులను ఉన్నత వ్యక్తిత్వం కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత వారిపై ఉందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా విద్యాధికారి ఏ.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి గురుపూజోత్సవంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఇతర అతిదులుగా పాల్గొన్న సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, డీఆర్ఓ బి.చిన్న ఓబులేసులతో కలిసి తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత విలువల కలిగిన భావిపౌరులను తయారు చేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. ఉపాధ్యాయునిగా, ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా పని చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ సమాజ గతిని మార్చేందుకు విద్యే సరైన ఆయుధమన్నారు. గొప్ప మేధావిగా అంబేద్కర్ ఎదగడంలోనూ, గొప్ప పోరాట యోధునిగా అలెగ్జాండర్ నిలవడంలోనూ వారి గురువుల పాత్ర ఎంతో ఉందన్నారు. తన తండ్రి బీఎన్ దానం కూడా లెక్చరర్‌గా పని చేశారని ఆయన చెప్పారు. మేయర్ మాట్లాడుతూ విద్యార్ధులకు గురువు మాటే వేదవాక్కు అని అన్నారు. ప్రస్తుతం రాజకీయాలలో ఉన్నప్పటికి ఉపాధ్యాయ వృత్తి నుంచే తాను వచ్చానని, తనలో స్ఫూర్తి నింపేలా ఉన్నప్పటికి తన ఛాంబర్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫొటో ఉందన్నారు. విద్యార్ధులకు మంచి భోజనం, పుస్తకాలు, యూనిఫారంలను ప్రభుత్వం అందిస్తుందని, మంచి బోధనపై ఉపాధ్యాయులు కూడా మరింత దృష్టి సారించాలని ఆమె సూచించారు. దామచర్ల సత్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తి వికాసం వెనుక గురువు ఉంటారని అన్నారు. విద్యా రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేయడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 16వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. బడ్జెట్లో రూ.30వేల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని చెప్పారు. డీఆర్వో మాట్లాడుతూ నవోదయ పాఠశాలలో తాను కూడా ఉపాధ్యాయునిగా పని చేశానని చెప్పారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్ధుల ఉన్నతి ఉపాధ్యాయుల చేతుల్లో ఉంటుందన్నారు. ఇలాంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న గురువులను గౌరవించుకోవడం ఎంతో సంతోషకరం అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన 53 మంది ఉపాధ్యాయులను అతిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్ధులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# బీజేపీ సెల్స్ కో కన్వీనర్ సూర్య కల్యాణ్ చక్రవర్తికి ఘన సన్మానం

**ఒంగోలు, ప్రభాతవార్త**



బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ గా నియమితులైన డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తిని జిల్లా బీజేపీ శాఖ ఘనంగా సత్కరించింది. ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శి నిలా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలోఆయనకు భారీ గజమాల వేసి, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రంలో ప్రకాశం జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సూర్య కల్యాణ్ చక్రవర్తికి శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు.

**కార్యకర్తలకు అండగా ఉంటా:**

నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి బీజేపీ నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సెల్స్ కో కన్వీనర్‌గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌కి, సంఘటన్ మంత్రి మధుకర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సెల్స్ కో కన్వీనర్ పదవి పెద్ద బాధ్యత అని, దాన్ని సక్రమంగా నిర్వర్తించేందుక అందరినీ కలుపుకుని పోతూ పని చేస్తానని అన్నారు. ఈ పదవితో బాధ్యత మరింత పెరిగిందని ఆయన అభిప్రయాపడ్డారు. బీజేపీ కార్యకర్తలు తనకు కుటుంబసభ్యుల లాంటి వారని, వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నేషన్ ఫస్ట్, పార్టీ సెకెండ్, సెల్ఫ్ లాస్ట్ అనే ధోరణిలో ముందుకు వెళ్తానని, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా దాన్ని తీర్చే విధంగా ఒక వ్యవస్థను తీసుకురావాలనే ఆలోచన చేస్తున్నానని చెప్పారు. కో ఆపరేటివ్ సొసైటీ లాంటిది ఏర్పాటు చేసి, కార్యకర్తలకు అన్ని విధాలా సాయపడేలా పార్టీ అధిష్టానంతో చర్చలు జరుపుతానని అన్నారు. పార్టీలో 48 క్షేత్రాలున్నాయని వాటికి నేను సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు సూర్య కల్యాణ్ చక్రవర్తి. అందరినీ కలుపుకుంటూ పోతూ.. అందరి సహకారంతో బీజేపీని అగ్రగామిగా నిలిపే విధంగా చేస్తానని అన్నారు. అనంతరం మాట్లాడిన బీజేపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాస్ రావు జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తిగారికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు దక్కడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. జిల్లాలో బీజేపీ బలోపేతానికి, సభ్యత్వాల నమోదు తదితర అంశాల్లో కల్యాణ్ చక్రవర్తి ఎంతగానో కృషి చేశారని స్టేట్ ఎగ్జిక్యూటివ్ కొమ్మి నర్సింగరావు కొనియాడారు. బీజేపీ సీనియర్ నాయకులు బొద్దులూరి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర పదాధికారుల లిస్ట్ లో గత కొన్నేళ్లుగా జిల్లా పేరే కనిపించలేదని, అలాంటిది కల్యాణ్ చక్రవర్తి చేసిన సేవలను గుర్తించి ఈ సారి ప్రకాశం జిల్లాకి చోటు దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, జిల్లా ఇంఛార్జ్ రవిశంకర్, కార్యదర్శులు డాక్టర్ జే.వి. నారాయణ, అశోక్ రెడ్డి, కాలేజి ప్రిన్సిపాల్ సి.వి. రామకృష్ణ, అమర సింహం, నాయకులు తోగంటి శ్రీనివాసరావు, యోగయ్య యాదవ్, బోడపాటి బ్రహ్మయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సూర్య కల్యాణ్ చక్రవర్తికి శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మానించారు.



6_6.qxd 9/6/2025 12:44 AM Page 1



## ఎపి వ్యవసాయ మిషన్ డైరెక్టర్‌గా నాగినేని



**అద్దంకి , సెప్టెంబరు 5, ప్రభాతవార్త**
బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు నాగినేని రామకృష్ణను కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ డైరెక్టర్‌గా నియమించింది. ఈయన అద్దంకి మండలంలోని ధేనువకొండ గ్రామ వాసి, వీరి తండ్రి నాగినేని వెంకయ్య అద్దంకి నియోజకవర్గ మొట్టమొదటి శాసనసభ్యులుగా పనిచేశారు. నాగినేని రామకృష్ణ రాజకీయ నేపద్యం వున్న కుటుంబం నుండి వచ్చారు. ఈయన మొదటి నుండి ధేనువకొండ గ్రామంలో టిడిపి చురుకైన కార్యకర్త స్థాయినుండి ఆ గ్రామసర్పంచ్‌గా, పనిచేసి గ్రామాభివృద్ధికి కృషిచేశారు. అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కూడ ఈయన పనిచేశారు. ఆయన హయంలో అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డులో అన్నగారి పేరుతో కూరగాయ సంతను నిర్వహించారు. ఆ సంత నిర్వాహణలో రాష్ట్రంలోనే మొట్టమొదటిది కావడం, అది విజయవంతంగా నిర్వహించబడటం ఆయన పనితీరుకు ఒక నిదర్శనం. ఇక నియోజకవర్గ స్థాయిలో పార్టీ సమన్వయ కమిటీలో పనిచేశారు. ప్రస్తుతం ధేనువకొండ గ్రామం ఉపసర్పంచ్‌గా పనిచేస్తున్నారు. ప్రధానంగా పార్టీకి విధేయతగా, ముందుకు సాగుతున్న నాగినేని రామకృష్ణ రైతు పక్షపాతిగా, గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో రైతుల పక్షాన నిలబడి పోరాటం చేసిన చరిత్ర కూడ ఆయనకు వుంది. ఈ నేపద్యంలో కూటమి ప్రభుత్వంలో ఆయనకు రాష్ట్ర వ్యవసాయ మిషన్ డైరెక్టర్ పదవి లభించింది.

### పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నెల రోజులుపాటు ప్రత్యేక కార్యక్రమాలు



**అద్దంకి , సెప్టెంబరు 5, ప్రభాతవార్త**
అద్దంకి ఏరియా పశువైద్యశాలలో అద్దంకి, కొరిశపాడు మండలాల సమీక్ష సమావేశం అద్దంకి పశువైద్యాలనందు డాక్టర్ బ్రమ్మయ్య సహాయ సంచాలకులు వారి అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ నెల 15 తేదీ నుండి అక్టోబర్ నెల 15 వ తేదివరకు గాలికుంటూ నివారణా టీకాల కార్యక్రమం, నిర్వహించడం, బ్లాకెట్ సర్వే, ఎ1 జమచేయుటం, శాంపిల్ సర్వేపై, జొన్నలు, దాణా, పని నిర్వాహణలో పురోగతిపై చర్చించి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రెండు మండలాల డాక్టర్స్, పారస్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు



**అద్దంకి , సెప్టెంబరు 5 ప్రభాతవార్త**
మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఇంగ్లీషు భోధన ఉపాధ్యాయుడు బొడ్డుఅంకారావు ఉత్తమ అవార్డుకు ఎంపిక అయ్యారు. ఈ నేపద్యంలో శుక్రవారం జిల్లా కేంద్రమైన బాపట్లలో గురుపూజోత్సవం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక అయిన వారికి అవార్డులను జిల్లా కలెక్టర్‌తోపాటు బాపట్ల ఎంపి, బాపట్ల ఎమ్మెల్యేలు పాల్గొని అందజేశారు. అందులో భాగంగా బొడ్డు అంకారావుకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా చల్లా వెంకటనారాయణ తదితరులు అంకారావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## చిన్నికి సోదరులు, కుటుంబ సభ్యుల సత్కారం



**అద్దంకి , సెప్టెంబరు 5, ప్రభాతవార్త**
అద్దంకి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ మాజీ వైఎస్ చైర్మన్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావులు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పోరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. ఈ నేపద్యంలో శ్రీనివాసరావును వారి కుటుంబ సభ్యులు, సోదరులు దుశ్శావాతో సత్కరించి, పూలమాలలతో అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాసరావును సత్కరించిన వారిలో చిన్ని రామలింగేశ్వరరావు, చిన్ని శివన్నారాయణ, చిన్ని కామేశ్వరరావు, గార్లపాటి రామకృష్ణరావు, కొత్తూరి కోటేశ్వరరావు, తదితరులు వున్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం



**జె. పంగులూరు , సెప్టెంబరు 5 ,ప్రభాతవార్త**
గురుపూజోత్సవం సందర్భంగా రోటరీక్లబ్ ఆఫ్ పంగులూరు వారి ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఉన్నత పాఠశాల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సోమవల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుగురువైన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు బత్తుల వీరనారాయణ, కార్యదర్శి రాయిని రామారావు, ట్రెజరర్ కాలే షావలి రోటరీ క్లబ్ సభ్యులతో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు బత్తుల వీరనారాయణ మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాన్ని వెలికి తీసి, క్రమశిక్షణ, సంస్కారం తో మంచి పౌరులుగా తీర్చిదిద్దేటం ఒక గురువు వల్లే సాధ్యమవుతుందని అన్నారు. సమాజంలో స్వచ్ఛంద సంస్థలు అన్ని విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులు సామర్థ్యాన్ని, మనోబలాన్ని, దృఢ సంకల్పాన్ని, ఏకాగ్రతని పెంపొందించడానికి దోహదపడుతుందని అన్నారు. రోటరీ క్లబ్ పంగులూరు వారు అందించే బహుమతులను ప్రపంచంలో ఎక్కడైనా తగిన స్థాయిలో గుర్తింపు వస్తుందని అన్నారు. అజిత్ కుమార్ చార్ట్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చందలూరు ఉన్నత పాఠశాలలో 20 లక్షల వ్యయంతో లైబ్రరీని ఏర్పాటు చేశారని అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తానని అజిత్ కుమార్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణన్ కి సముచిత స్థానం కల్పించి విద్యార్థులకు అందించే ఎస్ ఆర్ టి కిట్లుగా విద్యార్థులకు అందించిందని గరిమిడి జగన్మోహనరావు అన్నారు. రోటరీ క్లబ్ కార్యదర్శి రాయిని రామారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇంట్లో పనితో పాటు విద్యలోనూ రాణించేలా ప్రోత్సహించాలని వారికి కావలసిన అవసరాలను గుర్తించి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటపాడు హెచ్.ఎం. వేణు, సి.హెచ్. లక్ష్మీనారాయణ, పోతన ప్రసాదు, తాటి సుబ్బారావు, గరిమిడి జగన్మోహన్, గుర్ర ఆంజనేయులు పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**అద్దంకిరూరల్ సెప్టెంబరు 5 ,ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం గ్రామ పంచాయితీ పరిధిలోని మన ఆలభారతి ఇంగ్లీషుమీడియం ఉన్నత పాఠవాలలో ఉపాధ్యాయ దినోత్సవం శుర్వారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం, బోధనా సిబ్బంది, విద్యార్థులు ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధా కృష్ణన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యా రంగానికి రాధాకృష్ణన్ చేసిన సేవలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి, కరస్పాండెంట్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లు,(మిన్నెకల్లు ఎస్సై) పాఠశాల నిర్వహణ బాధ్యులు దుగ్గెంపూడి పవన్‌కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా వీరాంజనేయులు



**బల్లికురవ, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
గురుపూజోత్సవ పర్వదిన శుభ వేళ మండలంలోని కొప్పెరపాలెం పాఠశాలలో ఎస్‌జీటీగా విదులు నిర్వహిస్తున్న గాలం వీరాంజనేయులు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన బాపట్లలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలలో జిల్లా కలెక్టర్ వెంకట మురళీ చేతుల మీదుగా ప్రశంసా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ జ్ఞానం, విజ్ఞాన శాస్త్రం ఆధారంగా మాత్రమే సంతోషంతో కూడిన జీవితం సాధ్యమవుతుంది అన్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మాటలు ఆదర్శంగా తీసుకుంటూ, విద్యాబోధన ద్వారా కొత్తదనం తీసుకువస్తూ మరిన్ని ఉన్నత ఫలితాలు సాధించేందుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుడుతూ విద్యాబోధన కొనసాగిస్తానని ఆనందం వ్యక్తం చేశారు. తన గురుతర బాధ్యతను మరింతగా పెంపొందించుకునేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

# నాగినేనికి ఆర్యవైశ్యులు ఘన సత్కారం





**అద్దంకి , సెప్టెంబరు 5, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ కార్పోరేషన్ డైరెక్టర్‌గా నాగినేని రామకృష్ణ నియమితులు అయ్యారు. ఈ నేపద్యంలో శుక్రవారం అద్దంకి పట్టణంలో జరిగిన ఒక కార్యక్రమంలో అద్దంకి పట్టణ ఆర్యవైశ్యులు నాగినేని రామకృష్ణను ఘనంగా సత్కరించి, అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. నాగినేనిని సత్కరించిన వారిలో అద్దంకి పట్టణ పార్టీ అధ్యక్షులు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పోరేషన్ డైరెక్టర్ లక్ష్మీశ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు చుండూరి మురళీ సుధాకరరావు, గట్టుపల్లి రామరావు, గార్లపాటి శ్రీనివాసరావు, కురిచేటి చిన్ని, మున్సిపల్ వైఎస్ చైర్మన్ దేషు పద్మేష్, రాంబాబు, హనుమా, అయితా సత్యం, చిన్ని ప్రసాద్, చామర్తి శ్రీను, జి. శ్రీనివాసరావు, వాసు తదితరులు వున్నారు.

## చిన్న, మధ్యతరహా పత్రికలే ప్రభుత్వానికి, ప్రజలకు వారధి

- చిన్న పత్రికలపై జిఎస్‌టి ఎత్తివేయాలి- పోస్టల్ సేవలను పునరుద్దరించాలి
- చిన్న,మధ్య తరహా వార్త పత్రికల - జాతీయ కార్యవర్గ సమావేశం సింగరకొండలో ప్రారంభం



**అద్దంకి , సెప్టెంబరు 5, ప్రభాతవార్త**
అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గ సమావేశాలు శుక్రవారం అద్దంకి మండలం సింగరకొండలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసమావేశాలకు అస్సాం, గుజరాత్, మహారాష్ట్ర ,రాజస్థాన్ ,ఒరిస్సా, ఉత్తరాఖండ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, పాండిచ్చేరి, మణిపూర్, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుండి సుమారు 150 మందికి పైగా చిన్న ,మధ్య తరహా పత్రికా సంపాదకులు హజరు అయ్యారు. ఈ సమావేశాలను ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సంధిరెడ్డి కొండలరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు కేశవ దత్త చందోల మాట్లాడుతూ చిన్న మధ్య తరహా పత్రికలకు సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కొరకై ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని కోరారు. పత్రికా రంగాన్ని వ్యాపార దృష్టితో చూడకుండా కేవలం సేవా దృక్పథంతో చూసి పత్రికలపై ఉన్న జీఎస్టీని రద్దు చేయాలని కోరారు. చిన్న మధ్య తరహా పత్రికల కు ఎంతో ఆదరణగా ఉన్న పోస్టల్ సేవలను ఎత్తివేయటాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. దీనివల్ల పత్రికల యాజమాన్యులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తిరిగి పత్రికలకు పోస్టల్ సేవలు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. చిన్న మధ్య తరహా పత్రికలే ప్రభుత్వానికి , ప్రజల మధ్యగా వారధిగా ఉంటున్నాయని, ప్రాంతీయ సంస్కృతికి దర్పణం పడుతున్నాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఆరవ తేదీ రెండవ రోజున శనివారం ఉదయం బహిరంగ సమావేశం జరుగుతుందని అన్నారు. మూడు రోజులపాటు జాతీయ సమావేశాలు జరుగుతాయని మొదటి రోజు జరిగిన కార్యక్రమంలో చిన్న పత్రికల సంపాదకులు పాల్గొని మాట్లాడారు. శనివారం, ఆదివారం సమావేశాలు కొనసాగనున్నాయి.

**నేటి సమావేశానికి హాజరైన అతిధులు :**
శనివారం జరిగే సమావేశానికి ముఖ్య అతిథులుగా గౌరవ రాష్ట్ర విద్యుత్‌శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్, మాజీ మంత్రివర్యులు డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ కమిషన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆర్ ఎం భాషా , బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి, రైతు నేస్తం పత్రిక సంపాదకులు పద్మశ్రీ వై. వెంకటేశ్వరరావు , సమాచార పౌర సంబంధాల శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్రీమతి కస్తూరి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్ కతేర, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు సాంసంగ్ పన్వర్, ఉత్తరప్రదేశ్ నుంచి అతుల్ దీక్షిత్ ,రాజస్థాన్ నుండి గోపాల్ గుప్తా, మహారాష్ట్ర నుండి ప్రదీప్ కులకర్ణి, తదితరులు పాల్గొననున్నారు.

## ప్రముఖ రంగస్థల కళాకారుడు యాదాల కాశీరాజు కన్నుమూత

- కళా రంగంలో 60 ఏళ్లు జిల్లా ,రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకున్న కాశీరాజు
- ఎన్ఎస్పి లస్కర్ గాను రైతుల సేవలో తనదైన గుర్తింపు
- సత్యహరిచ్చంద్ర నాటకంలో బండారురామారావు తరువాత తరం కాశీరాజుదే



**అద్దంకిరూరల్ సెప్టెంబరు 5 ,ప్రభాతవార్త**
ఉమ్మడి ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల కళాభిమానులకు సుపరిచితుడైన యాదాల కాశీరాజు (79) శుక్రవారం కన్నుమూశారు. కాశి రాజుకు భార్య ఒక కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు. మోకాళ్ళ శస్త్రచికిత్స నిమిత్తం ఒంటరిగా హైదరాబాదు వెళ్లిన కాశీరాజు ఆరోగ్యం సహకరించకపోవడం తిరిగి ఇంటికి వచ్చి నరసరావుపేటలోకన్నుమూశారు. కాశయ్య మృతితో కళారంగం ఒక ధ్రువతారను కోల్పోయినట్లు అయింది. సత్య హరిచంద్ర నాటకంలో హరిచ్చంద్రుడిగా, శ్రీరామాంజనేయ యుద్ధంలో ఆంజనేయునిగా ,శ్రీమద్విరాట్ వీరబ్రహ్మంగారి నాటకంలో వీరబ్రహ్మంగా, బభ్రువాహనలో బృహన్నలగా, యూదుల రాజులో పరిచయుడుగా,శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ చరిత్రలో గోపయ్యగా ప్రముఖ నాటకాలలో ముఖ్య పాత్రలను పోషించి ప్రజల మెప్పు పొందారు యాదాల కాశీరాజు, సత్య హరిచంద్రలో కాటి శీను హరిశ్చంద్రుడిగా యాదాల కాశీరాజు ప్రసిద్ధి. ప్రముఖ రంగస్థలం కళాకారులు బండారు రామారవు తరువాత తరం కళాకారులు ఏవి సుబ్బారావు,డివి సుబ్బారావు, మిద్దె ఆంజనేయులు, చీమకుర్తి నాగేశ్వరరావుకు కాశీరాజు సమకాలీకులు. ప్రస్తుత వినుకొండ పట్టణంలోని యాదాల సుబ్బయ్య నాగమ్మల ఆరుగురి సంతానంలో యాదాల కాశీరాజు రెండవ సంతానం. అప్పట్లో ప్రాథమిక విద్యతో సరిపెట్టుకున్నప్పటికీ ఆయన సోదరుడు నాగార్జునసాగర్ కాలవల కార్యాలయాలకు వాచ్మేన్ కావడంతో కాశయ్యను అప్పట్లో కాలువలపై లస్కర్ గా ఉద్యోగం ఇప్పించారు. దాదాపు 40 సంవత్సరాలపాటు లస్కర్‌గా రైతులకు కూడా సేవలందించి తనదైన గుర్తింపు పొందారు కాశీరాజు. ఎన్ఎస్పి లస్కర్ గా ఉద్యోగ బాధ్యతలు ఒకవైపు కళారంగాన్ని ఒకవైపు కొనసాగిస్తూ సంతమాగులూరు గ్రామంలో దాదాపు 30 సంవత్సరాల పైబడి నివాసం ఉన్నారు. 30 సంవత్సరాల లస్కర్ ఉద్యోగ బాధ్యతలనుండి 2006లో పదవీ విరమణ చేశారు. కాశయ్య పెద్ద కుమారుడు యాదాల శ్రీనివాసరావు ప్రస్తుతం పల్నాడు జిల్లా ల్యాండ్ రికార్డ్ సర్వేయర్ గా పనిచేస్తున్నారు. రెండవ కుమారుడు ఆంజనేయులు మతిస్థిమితం కోల్పోయిన వారికి ప్రకృతి వైద్యం చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. కాశయ్య ఏకైక అల్లుడు గోపాలకృష్ణ కూడా లస్కర్ గా పనిచేసి ఇటీవలే పదవి విరమణ పొందారు.ప్రస్తుతం నర్సరావుపేటలో స్థిర నివాసం ఏర్పరచుకున్న కాశయ్య కుటుంబం కుటుంబం పెద్దను కోల్పోగా, కళా రంగంలో ఒక ధ్రువ తార నేల కొరిగింది.



**నుడు నరసరావుపేటలో యాదాల కాశీరాజు అంత్యక్రియలు**
ప్రముఖ కళాకారుడు విశ్రాంత ఉద్యోగి అయిన యాదాల కాశీరాజు శుక్రవారం నరసరావుపేట ప్రకాశ్ నగర్‌లోని తన స్వగృహంలో కన్నుమూయగా ఆయన పార్థివ దేహన్ని కళాభామానుల సందర్శనార్థం నివాసంలో ఉంచారు. కాశీరాజు మృతదేహనికి నరసరావుపేట లో హిందూ స్మశాన వాటికలో శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంభ సభ్యులు తెలిపారు.

## పొగాకు నిల్వల కొనుగోలు వేగవంతం చేయండి

- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నను కలిసిన ఎమ్మెల్యే ఏలూరి



**మార్టూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
బర్లీ పొగాకు నిల్వల కొనుగోలు పక్రియను వేగవంతం చేసి రైతులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడును కోరారు. శుక్రవారం వ్యవసాయశాఖమాత్యులు అచ్చెన్నను ఎమ్మెల్యే ఏలూరి కలిశారు. ఈ సందర్భంగా పొగాకు కొనుగోలు, నిధులు జమ, యూరియా నిల్వలు, తదితర అంశాలపై మంత్రితో ఎమ్మెల్యే ఏలూరి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలిచిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో రైతు కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. ఐతు సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషి అమోఘం అన్నారు. రైతులకు నల్లబర్లీ పొగాకు కొనుగోలు పక్రియ కొనసాగుతుందని, వేగవంతం చేసి ప్రతి రైతు పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు చేసిన పొగాకును నిల్వ చేసేందుకు గోదాములను వేగంగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఇప్పటి వరకు సుమారు రూ.110 కోట్ల విలువైన బర్లీ పొగాకు కొనగోలు చేయడం జరిగిందని ప్రభుత్వం రూ.54 కోట్లు రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. పీఎసీఎస్‌ల ద్వారా యూరియాను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బర్లీ సాగను నిషేధిస్తున్నామని దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా మొక్క జొన్న, శనగ, కంది, మినుము, పెసర సాగు చేసేలా సబ్సిడీపై విత్తనాలు అందించేలా చొరువ చూపాలని మంత్రిని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. ఈ సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నల్లబర్లీతో పాటు తెల్లబర్లీ పొగాకును సైతం కొనుగోలు చేయాలని మంత్రి అచ్చెన్నను కోరారు.

## ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో పెరిగిన బాధ్యత



**సింగరాయకొండ, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
విద్యారంగంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం గర్వకారణంగా ఉందని బింగినపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి బ్రహ్మయ్య తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ దినోత్సవం సందర్భంగా ఉత్తమఉపాధ్యాయ పురస్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతు ఈ అవార్డు నా వ్యక్తిగత విజయమే కాకుండా, నా విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం అందరి సహకారం ఫలితమని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్యే బి.ఎన్. విజయకుమార్, డి.ఈ.ఓ. కిరణ్ కుమార్ చేతులు మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ మర్రిబోయిన శ్రీనివాసులు, ఎంఈఓ కత్తి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు బడితల హరే రామ్, అర్రిబోయిన రాంబాబు, జాలరత్నం, మసనం మాలిరావు, అంబటి ప్రసాద్, పంతగాని వెంకటేశ్వర్లు, సుధాకర్, ముజాఫర్, సుధాకర్ రెడ్డి ఆయనను అభినందించారు.

## ఏపీజీ బీసీ డైరెక్టర్ వేల్పుల సింగయ్యకు సన్మానం



**సింగరాయకొండ, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌వేల్పుల సింగయ్య దంపతులకు సింగరాయకొండ మండలంలోని పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు ఘనంగా సన్మానం చేశారు. శుక్రవారం కందుకూరు రోడ్డు సమీపంలోని ఆయన నివాసంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగయ్య దంపతులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. సింగరాయకొండ మండలం లోపార్టీ కోసం నిరంతరం కృషి చేసి, దాదాపు 15 సంవత్సరాలకు పైగా మండల అధ్యక్షుడిగా పనిచేసి రాష్ట్ర స్థాయి పదవిని పొందడం అభినందనీయమని పలువురు నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.

## ఎంతో ఓర్పుతో పాఠాలు చెబుతూ..

- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ,టిడిపి ఇంచార్జ్, దర్శి నియోజకవర్గం



**దొనకొండ, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త**
విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలిపే ప్రతి గురువు దైవంతో సమానం. మన సమాజంలో గురువుకు విశిష్ట స్థానం ఉంది. తల్లిదండ్రులు తర్వాత గురువును పూజిస్తాం. ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన మహనీయుడు మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతి సందర్భంగా దేశానికి వారు చేసిన సేవలను స్మరించుకుంటూ గురువులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను....

## గిరిజన కుటుంబాలకు ఉచిత సిలిండర్

**దొనకొండ, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త**
మంత్రి నాదెం గిరిజనులకు మంత్రి నాదెండ్ల మనోహర్ శుభవార్త చెప్పారు. దీపం2 పథకం కింద 14.2 కిలోల గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. దీని వల్ల 16 జిల్లాల్లోని 23,912 గిరిజన కుటుంబాలు లబ్ధి పొందుతాయని పేర్కొన్నారు. దీనికోసం ప్రభుత్వంపై రూ.5.54 కోట్ల భారం పడుతుందని తెలిపారు. కాగా, గిరిజన ప్రాంతాల్లోని కుటుంబాలు 5 కేజీల ఎల్పీజీ సిలిండర్లు వినియోగిస్తుండటంతో వారు ఉచిత సిలిండర్ ప్రయోజనాలు అందుకోలేకపోతున్నారు.

## ఘనంగా ఓనం పండుగ

- సాంప్రదాయ దుస్తులలో పాల్గొన్న డాక్టర్లు







**ఒంగోలు కల్చరల్,సెప్టెంబర్ 5,ప్రభాతవార్త**
కేరళ ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే అతి ముఖ్యమైన పండగ ఓనం పండగ ఒంగోలు నగరంలో సంతపేట రాఘవాచారి హాస్పిటల్ దగ్గర కేరళ ఆయుర్వేద వైద్యశాల ఆవరణలో డాక్టర్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేరళ సాంస్కృతి, సాంప్రదాయాలతొ పండగ జరుపుకున్నారు. అందులో భాగంగా ఓనం పండుగ వెనుక ఉన్న వామన పురాణం పౌరాణిక కథ సాంప్రదాయ దుస్తులు ధరించి పూలరంగ వల్లులతో ప్రత్యేకమైన విందు భోజనంతో పండగ జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిబ్ డాక్టర్ అకిర, బేబీ, మెలాన్, ప్రీతి, ఆదిత్య, సందర, స్నేహ, నిర్మల్, విజయ, తదితరులు పాల్గొన్నారు.


## గద్దలగుంటలో ఉపాధ్యాయుల దినోత్సవం



**ఒంగోలు కల్చరల్,సెప్టెంబర్ 5,ప్రభాతవార్త**
ఒంగోలు గద్దలగుంట మూడు బొమ్మల వద్ద గల ఏ.సి.కమ్యూనిటీ హాల్ నందు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కనకారావు ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సత్కరించి, స్వీట్ ప్యాకెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయుల యొక్క ఆశీస్సులు అందుకున్నారు. ఇందులో భాగంగా చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు ఉచితంగా ఇవ్వడం జరిగింది..భారత రాష్ట్రపతి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతిని మనం ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామని, ఆయనని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు జీవితంలో ముందుకు సాగాలని, భావి భారతాన్ని తీర్చిదిద్దాలంటే అది ఒక్క గురువులకే సాధ్యమని, అటువంటి గురు పూజా దినోత్సవం రోజు ఉపాధ్యాయులను సన్మానించడం తమ బాధ్యతగా భావించి గురువులను సన్మానించటం జరిగిందని కనకారావు తెలియచేశారు.

## గణపయ్యకు ఘనమైన వీడ్కోలు

- గుంటుపల్లిలో కోలాహాలంగా నిమజ్జనోత్సవం



**బల్లికురవ, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
గణేష్ నిమజ్జనోత్సవ కార్యక్రమాలలో భాగంగా మండలంలోని గుంటుపల్లి గ్రామంలో ఘనంగా గణపయ్యకు వీడ్కోలు పలికారు. స్థానిక శివాలయం వద్ద ఏర్పాటు చేసిన భూపతి గణపయ్య నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలం పాటలో రూ.41 వేలకు మలినేని మహేష్‌బాబు లడ్డూను సొంతం చేసుకున్నారు. గ్రామంలోని మహిళలు, అధిక సంఖ్యలో యువకులు, ఈ ఉత్సవాల్లో పాల్గొని గ్రామంలో పండుగ వాతావరణం సృష్టించారు. టీడీపీ సీనియర్ నాయకులు క్లస్టర్ ఇన్‌ఛార్జీ మలినేని గోవిందరావు నిమజ్జనోత్సవ కార్యక్రమం ఆధ్యంతం యువకులతో కలిసి నడుస్తూ వారిని మరింత ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ పార్వతి దేవి నలుగు పిండితో బాలుడి రూపొందించగా ఆవిర్భవించిన దివ్య రూపం గణపతి. ప్రకృతి ప్రసాదించిన పత్రాలు, పుష్పాలతో పూజించి, నీళ్లలో నిమజ్జనం చేసి, ఆ నీటిని కూడా సుప్రపరచాలని సంకల్పించడం మంచి పరిణామం అన్నారు. అమ్మవారు జల రూపంలో ఉన్న గంగా దేవి, ఆ తల్లి ఒడిలో ఒదిగి పోవడం అంటే వినాయకుడికి మహాఇష్టం. పూజాది కార్యక్రమాలు ముగిసిన పిదప, మట్టి గణపతిని గంగమ్మ ఒడిలోకి చేర్చడం, మన మహర్షులు మనకు అందించిన పూజా సంస్కృతిగా పేర్కొన్నారు. ఎస్సై నాగరాజు ఎప్పటికప్పుడు నిమజ్జనోత్సవ కార్యక్రమాల్లో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

7_7.qxd 9/6/2025 12:44 AM Page 1



# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



**గిద్దలూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త**
గిద్దలూరు నగర పంచాయితీలోని గ్రంధాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విశ్వభారతి హైస్కూల్‌లో రామిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలోగిద్దలూరుపట్టణానికిచెందినరాష్ట్రఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత డాక్టర్ మొర్రి పిచ్చయ్యను మెమొంటో ,దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మొర్రి పిచ్చయ్య హిందీ ఉపాధ్యాయులుగా కొమరోలు మండలంలోని అల్లీనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. వీరు తన వార్షిక వేతనంలో 20శాతం నగదును పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు.అంతేకాకుండా అత్యాధునిక బోధనా పద్దతులను ఉపయోగిస్తూ విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారు. హిందీ విషయపరంగా ప్రభుత్వ పాఠ్య పుస్తక రచయితగా,రాష్ట్ర రీసోర్స్ పర్సన్‌గా పనిచేయుచున్నారు. వీరు చేసిన విశిష్ట సేవలను గుర్తించి గ్రంధాలయ అభివృద్ధి కమిటీ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీంద్రారెడ్డి, గంజి వీరయ్య,స్వరూపారెడ్డి, నారాయణరెడ్డి,వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి,రంగస్వామిరెడ్డి, జయరావు, ఓబులేసు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

## - 11వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

### - యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ



**గిద్దలూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త**
ఈనెల 20, 21వ తేదీలలో ఒంగోలులో జరిగే అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ కోరారు. ఈ మహాసభలకు సంబంధించి గిద్దలూరులో శుక్రవారం సమావేశం నిర్వహించి అంగన్ వాడీ కార్యకర్తలతో కలిసి మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ ఈ మహాసభలకు రాష్ట్రంలోని 2056 ప్రాజెక్టుల నుంచి నాయకత్వం, సెక్టార్ నాయకత్వం, రాష్ట్ర నాయకత్వం మరియు ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ ఏఆర్ సింధు, ఆల్ ఇండియా ఉషారాణిలు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలలో అంగన్ వాడీల గత పోరాటాలను సమీక్షించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందిచడానికి ఈ 11వ రాష్ట్ర మహాసభ వేదిక కానుందని తెలిపారు. అంగన్ వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 5సంవత్సరాలలోపు పిల్లలందరూ అంగన్ వాడీ కేంద్రాలలోనే ఉండేలా ప్రభుత్వం చేట్టం చేయాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి అంగన్ వాడీ నాయకులతో రెడ్ రషల్ కమిటీ జరిపించాలని, ప్రీస్కూల్ సక్రమంగా జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అంగన్ వాడీ మహాసభలలో యూనియన్ వీటి మీద తీర్మాణాలు చేయబోతుందని తెలిపారు. ఈ సమావేశంలో గిద్దలూరు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు మున్నా స్వర్ణ కుమారి, విజయ, సరస్వతి, రమణమ్మ, బాలమ్మ, సుజాత, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్బన్ కాలనీ ఫీడర్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గిద్దలూరు, సెప్టెంబరు 5 ,ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలోని పిఆర్ కాలనీ కరెంట్ ఆఫీస్‌లో సాంకేతిక అత్యవసర మరమ్మత్తుల నిమిత్తం మరియు ట్రీ కటింగ్ చేయిస్తున్నందున అర్బన్ కాలనీ ఫీడర్ పరిధిలో నేడు (శనివారం) ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ గిద్దలూరు ఏఈ బివై శేషగిరి రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు పట్టణంలోని పిఆర్ కాలనీ, అర్బన్ కాలనీ, ప్రభుత్వ వైద్యశాల, కోర్టు ఏరియా, కొంగలవీడు రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, విశ్వభారతి స్కూల్ రోడ్డు, కొప్పు వారి వీధి, పాండురంగారెడ్డి నగర్, ఏబిఎం, ఎస్‌విజే పాలెం, వినాయక్ నగర్, గ్రంధాలయం, శ్రీరామ్ నగర్, తాళ్ళపల్లి స్టోర్, అగ్గిపెట్ట బజార్, వాసవి అపార్ట్‌మెంట్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## సంజీవరాయునిపేట సొసైటీ ఛైర్మన్‌గా మచ్చుకుంట్ల రామసుబ్బయ్య ప్రమాణ స్వీకారం

### - వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన టిడిపి నాయకులు



**గిద్దలూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త**
మండలంలోని సంజీవరాయునిపేట సొసైటీఛైర్మన్‌గా మచ్చుకుంట్ల రామసుబ్బయ్య శుక్రవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు విశేషంగా హాజరై వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముండ్లపాడు వైస్ సర్పంచ్ కడియం శేషగిరిరావు, ముండ్లపాడు గ్రామ పంచాయితీ టిడిపి అధ్యక్షులు అరిగెల వీరనారాయణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వినుకొండ చిన్న, గిద్దలూరు ఏఎంసి ఛైర్మన్ బైలడుగు బాలయ్య, నంది శ్రీను, పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొని రామసుబ్బయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రమాణస్వీకార సభలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఉత్సవ వాతావరణాన్ని సృష్టించారు.

# వాసవిలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం



**మార్కాపురం రూరల్, సెప్టెంబరు 5 ,ప్రభాతవార్త**
స్థానిక వాసవి విద్యానికేతన్ పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె రంగయ్య, పరిపాలన అధికారి (ఏఓ) రంజిత్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన కె రంగయ్య సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన సేవలు దేశానికి ఎంతో విలువైనవని, ఆయన జ్ఞాపకార్థం ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితానికి దిక్సూచిలాంటి వారని వారి భవిష్యత్తు తీర్చిదిద్దే పవిత్ర బాధ్యత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు. గురువు గౌరవం మన సంస్కృతిలో ఎంతో విశిష్టమని పేర్కొంటూ భౌతిక వస్తువులు ఇచ్చి పుచ్చుకోవచ్చు కానీ గురువు ఇచ్చే జ్ఞానం, విలువలు అపురూపమైనవని వివరించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు విద్యార్థులకు కె రంగయ్య అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## చంద్రశేఖర్ గుప్తా జయంతి సందర్భంగా పేపర్ బాయ్‌కు ఘన సన్మానం



**మార్కాపురం రూరల్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త**
వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ కలుకుంట్ల చంద్రశేఖర గుప్తా జయంతి వారోత్సవాల సందర్భంగా మార్కాపురం వాసవి విజన్ క్లబ్ వారు నిర్వహిస్తున్న సప్తాహ కార్యక్రమాల్లో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పుల్లయ్య నత్తలంలో పనిచేస్తున్న పేపర్ బాయ్ పువ్వాడ రవికుమార్‌ను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆయనను దుశ్శాలువా కప్పి మిఠాయిలు అందజేశారు. అనంతరం క్లబ్ సభ్యులు మాట్లాడుతూ చిన్నతనం నుండి కష్టపడి జీవనం సాగిస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించడం వాసవి మార్గదర్శనం అని తెలిపారు. ఈ తరహా సేవా కార్యక్రమాలు ఇంకా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ గంగిశెట్టి కిరణ్ కుమార్, క్లబ్ సెక్రటరీ మొటుపోతుల కిషోర్ కుమార్, నారాయణ వెంకటేశ్వర్లు, మానవతా సెక్రటరీ అన్న రాము, తదితరులు పాల్గొన్నారు.

# ఏపి ఏఈసిఈఏ ముఖ్య నాయకులతో సమావేశం



**గిద్దలూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త**
ఏపి ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఈసిఈఏ-జి 3045) ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌కు సంబంధించిన పలు సమస్యల గురించి చర్చించారు. ఈ సమావేశంలో సహాధ్యక్షుడిగా కొత్తపల్లి విజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు రత్నాకర్, జిల్లా అడిషనల్ సెక్రటరీ అన్నెం వెంకటేశ్వర్లు, రాష్ట్ర పబ్లిసిటీ సెక్రటరీ ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు రామాపురం సొసైటీ బ్యాంక్ ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

**రాచర్ల, సెప్టెంబరు 5 ప్రభాతవార్త**
మండలంలోని రామాపురం సొసైటీ బ్యాంక్ ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం నేడు (శనివారం) జరుగుతుందని మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు కటిక యోగానంద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## విశ్వభారతిలో అంగరంగ వైభవంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**గిద్దలూరు, సెప్టెంబరు 5 ,ప్రభాతవార్త**
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా స్థానిక విశ్వభారతి పాఠశాలలో గ్రంధాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కోలాటం, శాస్త్రీయ నృత్యం, కరాటే వంటి పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో ఎంఈఓ -1 అశ్వినీ కుమార్, గ్రంధాలయ కమిటీ అధ్యక్షులు బీరం రామిరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయుల అసోసియేషన్ అద్యక్షులు రవీంద్రనాధ్‌రెడ్డి, యోగా గురువు బిఎస్ నారాయణ రెడ్డి, జంగం శివ, జయరావు, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలి



**రాచర్ల, సెప్టెంబరు 5 ,ప్రభాతవార్త**
వాహనదారులు ప్రభుత్వ నిబందనల ప్రకారం వాహనాలను నడపాలని రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని రాచర్ల గురుకుల పాఠశాల వద్ద శుక్రవారం ఆయన తమ సిబ్బందితో వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు లేకుండా తిరిగే పలు వాహనదారులకు జరిమానా విధించారు. మైనర్‌లకు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని అన్నారు. అనంతరం వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

## గురువులు సమాజానికి దిశా నిర్దేశకులు : వెన్నా హనుమారెడ్డి

### - విహెచ్ఆర్ విద్యా సంస్థలలో ఘనంగా గురుపూజోత్సవం





**మార్కాపురం రూరల్, సెప్టెంబరు 5 ,ప్రభాతవార్త**
గురువులు సమాజానికి మార్గదర్శకులని భావి పౌరులను ఉన్నతంగా తయారు చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని విహెచ్ఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ వెన్నా హనుమారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరా ఇంజనీరింగ్, చైతన్య ఫార్మసీ నర్సింగ్ కళాశాలల్లో ఘనంగా గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన హనుమారెడ్డి అధ్యాపకులతో కలిసి జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా హనుమారెడ్డి మాట్లాడుతూ విద్యనే సమాజాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధమని, ఉపాధ్యాయులే ఉన్నత విలువలతో కూడిన పౌరులను తయారు చేయగలరని అన్నారు. ఆయన 17ఏళ్ళపాటు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలందించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం వ్యాపారాల్లో నిమగ్నమవ్వడం వలన ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. మంచి బోధనకే ప్రాముఖ్యత ఇవ్వాలని ఉపాధ్యాయులు తమ బాధ్యతను మరింత నిబద్ధతతో నిర్వర్తించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. శంకర్ బాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## చిన్నకంభం ఉపాధ్యాయునికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రధానం



**కంభం, సెప్టెంబరు 5, ప్రభాతవార్త**
మండలంలోని చిన్నకంభం మండల పరిషత్ ప్రాధమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న బూదాల నాజీర్ సురేష్ బాబు జిల్లా స్థాయి ఉత్తమఉపాధ్యాయ అవార్డు అందుకన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపు హాలులో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణ, ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్, డిఈఓ కిరణ్ కుమార్ చేతుల మీదుగా ఆయన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బూదాల నాజీర్ సురేష్‌ను గ్రామస్తులు, ఎంఈఓలు, మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# గురువు జ్ఞానదాతే కాదు.. జీవితానికి మార్గదర్శి



**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
గురువు అనగా మనకు ముందుగా గుర్తొచ్చేది పాఠాలు చెప్పే వ్యక్తి. కానీ నిజానికి గురువు పాత్ర దానికంటే మరింత విశాలం, మరింత లోతైనది. ఆయన కేవలం పుస్తకాల విజ్ఞానం నేర్పవాడు కాదు. జీవన మార్గంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే దైవం. నైతిక విలువలు, సమాజానికి ఉపయోగపడే బాధ్యతా, బుద్ధిని అందించే మార్గదర్శి. గురువు చదువు చెప్పడం ద్వారా మనలో ప్రతిభను వెలికి తీయడం ఒక వైపు అయితే, మంచి తనంతో జీవించేందుకు విలువలు నేర్పించడం మరో వైపు ఉంటుంది. నేటి కాలంలో విద్యార్థులు ఎక్కువగా సాంకేతిక పరిజ్ఞానం వైపు ఆకర్షితులవుతున్న తరుణంలో సన్మార్గం చూపే గురువు అవసరం మరింత పెరిగింది. ఒక చిన్న దీపం చీకటిని ఎలా పారద్రోలుతుందో, అలాగే గురువు ఇచ్చే స్ఫూర్తి విద్యార్థి భవిష్యత్తును వెలిగిస్తుంది. ఆచరణలో చూపే క్రమశిక్షణ, కష్టపడి సాధించే ధోరణి, సమాజానికి సేవ చేసే తపన ఇవన్నీ గురువును చూసి విద్యార్థి ఆచరించగలడు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉంటే, ఆ విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి గురువుల చేతుల్లో ఉంటుంది. ఒక మంచి గురువు సమాజానికి బాధ్యత గల పౌరులను అందిస్తాడు. అందుకు గురువుకు విద్యా వెలుగు జీవన మార్గదర్శి అనే గౌరవం లభించింది. గురువు అనేది పాఠశాలలో చెప్పే వ్యక్తి మాత్రమే కాదు. జీవిత పాఠాలు నేర్పే మహనీయుడు. జ్ఞానాన్ని అందిస్తూ విలువల నేర్పుతూ, సన్మార్గం చూపే గురువు, నిజంగా ప్రతి విద్యార్థి జీవితానికి వెలుగు వంటి వాడు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన గురుపూజోత్సవం(టీచర్స్ డే) ను పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించి విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దోర్నాల భ్రమరాంబ మల్లిఖార్జున డిగ్రీ కళాశాలలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బట్టు విద్యా సంస్థల అధినేత బట్టు రమణారెడ్డిని కళాశాల అధ్యాపకులు, లెక్చరర్లు ఘనంగా సన్మానించారు. లెక్చరర్లను బట్టు రమణారెడ్డి సన్మానించారు.

## అంగన్ వాడీ కార్యకర్త విజయకుమారికి ఘన సన్మానం



**మార్కాపురం రూరల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త**
మార్కాపురం మండలంలోని గజ్జలకొండ ఐసిడిఎస్ సెక్టారు పరిధిలోని రాయవరం గ్రామంలో అంగన్ వాడీ కార్యకర్త విజయ కుమారిని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం కొంతమంది తల్లులు కలిసి ఆమెను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విజయకుమారి చేస్తున్న సేవలకు గుర్తుగా ఈ సన్మానం నిర్వహించామని వారు పేర్కొన్నారు.అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని తల్లులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెలిగండ్ల ఏపి పాఠశాల ఉపాధ్యాయులు సుబ్బారావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

### - అభినందనలు తెలిపిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు



**కొనకనమిట్ల, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
మండలంలోని వెలిగండ్ల(ఏపి) ప్రాధమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్న ముట్లూరి సుబ్బారావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. శుక్రవారం ఒంగోలు ప్రకాశం భవన్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ కుమార్ జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఈఓ కే.కిరణ్ కుమార్‌ల నుండి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత ఎం.సుబ్బారావు మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు తనను ప్రతిపాదించిన ఎంఈఓ డాంగే షరీఫ్‌కు సహకరించిన ప్రధానోపాధ్యాయులు డాక్టర్ షేక్ జి.మస్తాన్, సహోపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయుడు సుబ్బారావును మండల విద్యాశాఖాధికారులు ఎస్‌కె డాంగేషరీఫ్ బరిగే నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## ఘనంగా గణపతినాధులకు గ్రామోత్సవం, నిమజ్జనం





**సంతనూతలపాడు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
సంతనూతలపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయకునికి, స్థానిక పెద్ద బజారులో సీతారాముల వారి ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణపతి నాధులకు శుక్రవారం నాడు ఘనంగా గ్రామోత్సవం, తదుపరి స్థానిక ఎన్నెస్పీ, కాలువలో నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో అదే విధంగా పెద్ద బజారులోని సీతారాముల వారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి నాధులు కార్యక్రమాలను ఆలయ కమిటీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య యువకులు, మహిళలు ఈ వేడుకల్లో పాల్గొని చిందులు తొక్కారు. ఈ సందర్భంగా గణపతి నాధులకు ఇంటింటా మహిళలు హారతులు ఇచ్చారు. అనంతరం అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. సంతనూతలపాడు సమీపంలోని చంద్రపాలెం ఎన్నెస్పీ కాలువలో గణపతి నాధులకు ఘనంగా నిమజ్జనం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నెస్పీ కాలువల్లో యువకులు, మహిళలు, ఆనందోత్సవాలతో స్థానమాచరించారు. తొమ్మిది రోజులు పాటు వినాయకులకు పూజలు నిర్వహించి తదుపరి గ్రామోత్సవం, నిమజ్జన వేడుకలను ఆయా నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు.

### వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనంతయ్యకు ఘన సత్కారం



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
వాసవిక్లబ్ వ్యవస్థాపకులు కేసీ గుప్తా జయంతి వారోత్సవాలలో భాగంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురష్కరించుకుని సంతనూతలపాడు వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు సంతనూతలపాడులోని ఏపీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ కోడెల అనంతయ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు పర్యవేక్షించారు. వాసవిక్లబ్ వ్యవస్థాపకులు గుప్తా జయంతి వారోత్సవాలలో భాగంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వీఎన్ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. వాసవి క్లబ్‌లు అభ్యున్నతకు గుప్తా విశిష్ట సేవలు అందించారని ప్రసాద్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, వాసవి క్లబ్ కార్యదర్శి వేమూరి ఆంజనేయులు, మాజీ అధ్యక్షులు జి.బద్రి నారాయణ, వాసవి మహిళా క్లబ్ సెక్రటరీ శిఘాకొల్లి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసిన గూడూరి ఎరిక్షన్‌బాబు



**యర్రగొండపాలెం,మార్చి 5,ప్రభాతవార్త**
యర్రగొండపాలెం పట్టణంలోని కొలుకులరోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు,యం.మంత్రు నాయక్,చిట్యాలవెంగళ్‌రెడ్డి,కంచర్ల సత్యనారాయణగౌడ్,కూటమి నాయకులు పాల్గొన్నారు.అనంతరం కమిటి సభ్యులు శాలువతో సత్కరించారు.

# 7న గుంటి గంగా భవాని ఆలయం మూసివేత

**తాళ్లూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
చంద్ర గ్రహణం సందర్భంగా ఈనెల 7వ తేదీన సోమవరప్పాడులో ఉన్న గుంటి గంగా భవాని అమ్మవారి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఈవో జి.వాసుబాబు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటల నుంచి దర్శనాలను నిలిపివేస్తామని, సోమవారం ఉదయం 8గంటలకు ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని శుక్రవారం ఓ ప్రకటనలో వివరించారు.

# తూర్పు గంగవరంలో భక్తులకు అన్నదానం



**తాళ్లూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పుగంగవరంలో దర్శి రోడ్డులో పెట్రోల్‌బంక్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక నిర్వాహకులు ఏర్పాటు చేయగా ఎస్సై ఎస్.మల్లిఖార్జునరావు అన్నదానాన్ని ప్రారంభించారు. తొలుత విగ్రహంవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శనివారం సాయంత్రం నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని భక్తులందరూ పాల్గొని నిమజ్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## ముగ్గురు ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



**సీఎస్‌పురం, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
మండలంలోని 3 పాఠశాలలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం ఒంగోలు స్పందన హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జేసీ రోణంకి గోపాలకృష్ణ, జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్ కుమార్, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్లసత్యలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని నల్లమడుగుల జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్(ఫిజిక్స్) వైవి సుబ్బారావు, డీజీ పేట జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్(గణితం)జి.వెంకటేశ్వర్లు, ఎంపీపీఎస్ అనికాలపల్లి ఎస్‌జీటీ జే.భారతిలకు ప్రశంసా పత్రం, మెమొంటో అందజేసి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంఈఓలు జే.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, ఉపాధ్యాయ సంఘ నేతలు, సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# శ్రీశైలం ఘాట్ రోడ్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం



**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
వినాయక చవితి పర్వదినం సందర్భంగా తొమ్మిదవ రోజైన శుక్రవారం పాతాళగంగలో గణనాధులను నిమజ్జనం చేసేందుకు శ్రీశైలం వెళ్లే రహదారిలో అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తుండగా రద్దీ పెరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దోర్నాల నుండి శ్రీశైలం వెళ్లే రహదారి ఘాట్ రోడ్లో రద్దీ ట్రాఫిక్ అంతరాయం కలిగింది. మూడు గంటల పాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. ఆ తర్వాత ట్రాఫిక్ క్రమబద్దీకరణ అయింది. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న చెరుకూరి జ్యోతిర్మయి



**కురిచేడు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**
కురిచేడు మండలం వెంగాయపాలెం గ్రామంలోని మండలపరిషత్ ప్రాధమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న చెరుకూరి జ్యోతిర్మయి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.ఈ సందర్భంగా శుక్రవారం ఒంగోలులో జరిగిన ఉపాధ్యాయదినోత్సవం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, జిల్లా అధికారులు ఆమెకు ప్రశంసా పత్రం అందించి ఘనంగా సత్కరించారు.

## ఘనగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపాధాయ దినోత్సవ వేడుకలు



**యర్రగొండపాలెం,మార్చి 5,ప్రభాతవార్త**
య ర్రగొండపాలెం మండంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా ఉపాధ్యా దినోత్సవ వేడుకలు జరిగాయి.అంగన్‌వాడీ కార్యకర్తలు డాక్టర్ సర్వేపల్లి రాధాకృషన్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. పడమటి బజారులో ఉన్న బిసి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎ.పద్మజ హాజరైనారు.ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కూడా తల్లి మొదటి గురువు ఆదేవిదంగా ఉపాధ్యాయినీ యొక్క పాత్ర ఈ సమాజంలో ఎంతో ఉన్నతమైనదని అమె అన్నారు.అంగన్‌వాడీ కేంద్రంలో వచ్చె చిన్నారులు మొదటి విద్యాభ్యాసం ఇక్కడే నేర్చుకుంటారని అమె అన్నారు.అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులు అంగన్‌వాడీ కార్యకర్తకు పూష్పలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

8_8.qxd 9/6/2025 12:46 AM Page 1



# ఉపాధ్యాయ వృత్తి విలువైనది

**చీరాల, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారతరత్న, భారతీయ తత్వవేత్త, విద్యావేత్త, రాజనీతిజ్ఞుడు, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా విలువైనదని అన్నారు. తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు ఉంటుందని, చీకటి అనే అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానాన్ని నింపేవాడు, బావిభారత పౌరులుగా తీర్చిదిద్దేవాడు ఉపాధ్యాయుడు అని అన్నారు. తల్లిదండ్రుల తరువాత అంత ప్రేమగా విద్యార్థులను చూసుకొనే ఉపాధ్యాయులను సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. పోలుదాసు రామకృష్ణ ఆధ్వర్యంలో 12 మంది గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చారగుళ్ళ గురుప్రసాద్, నారాయణమూర్తి, వలివేటి మురళీకృష్ణ, డీవీ సురేష్, గుద్దంటి రమేష్, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

## వేటపాలెం మండల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

**వేటపాలెం, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్లలోని అన్నం సతీష్ కళ్యాణ మండపంలో జిల్లా అవార్డు గ్రహీతలకు ఘనంగా సన్మానం జరిగింది. వేటపాలెం మండలానికి చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన బూసం లలితాంబ, జరుబుల శ్రావణి, తెలగతోటి ఇందిర, పోపూరి రంగారావులను లోకసభ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యేలు నాగేంద్ర వర్మ, సునీత, ఆర్జెడి, జిల్లా కలెక్టర్ వెంకట మురళి, జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తంలు శాలువా, మెమోంటో, సర్టిఫికేట్‌తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ బోధన అభ్యసన కార్యక్రమంలో ఎప్పుడు మొదటి బెంచి విద్యార్థులే స్పందిస్తూ ఉంటారు. ఉపాధ్యాయులు కూడా వారిపైనే ఎక్కువ దృష్టి పెడుతూ ఉంటారు, అలా కాకుండా చివరి బెంచి విద్యార్థిని కూడా దృష్టిలో ఉంచుకుని అభ్యసన కార్యక్రమాన్ని రూపొందించుకుని, విద్యకు సంబంధించిన అన్ని సామర్థ్యాలు వారు కూడా సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు.సన్మాన గ్రహీతలకు వేటపాలెం మండల ఎంఈఓలు, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యవర్గం సభ్యులు, బంధువులు, మిత్రులు, అభినందనలు తెలియజేశారు.

## డీఎస్సీ-2025లో కనిగిరి టీచర్స్ అకాడమీ అద్భుత విజయం

### - రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన వారికి ఎమ్మెల్యే ఉగ్ర సన్మానం

**కనిగిరి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ-2025 ఫలితాలలో కనిగిరి ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయిలో అద్భుత విజయాలు సాధించారు. కనిగిరి టీచర్స్ అకాడమీ శిక్షణ పొందిన పలువురు అభ్యర్థులు 1వ ర్యాంకు నుండి టాప్ 10 ర్యాంక్స్ వరకు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి స్థానిక టీచర్స్ అకాడమీలో విజయవంతమైన అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. ఈ విజయాలు కనిగిరి విద్యా రంగానికి గర్వకారణమని, భవిష్యత్తులో మరింత మంది అభ్యర్థులు ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**జిల్లా 1వ ర్యాంకు సాధించిన వారు :**

గాలి రాజశేఖర్(ఎస్జీటీ)- ప్రకాశం జిల్లా, బి.సరోజిని(ఎస్ఏ-సోషియల్)-ప్రకాశం జిల్లా, ఎంవీ కృష్ణమూర్తి(ఎస్ఏ- బయాలజీ సైన్స్) - ప్రకాశం జిల్లా, జె.వెంకయ్య(ఎస్ఏ-బయాలజీ సైన్స్)- ప్రకాశం జిల్లా, కనిగిరి సరోజిని(ఎస్ఏ-ఇంగ్లీష్) - ప్రకాశం జిల్లా, బండ్ల హరి ప్రసాద్(ఎస్ఏ-బయాలజీ సైన్స్)- చిత్తూరు జిల్లా.

**టాప్ 10లో ర్యాంకులు సాధించిన వారు :**

ఏ.భువనేశ్వరిదేవి, షేక్ షహజహాన్ బేగం, ములా శ్రీనివాసరావు, ఎం.సాయి, డి.ప్రభావతి, కే.వేమూరి రమణమూర్తి, ఎం.సత్యనారాయణ, ఎం.మధుసూదన్, పి.వెంకటేశ్వర్లు, ఎం.సుభద్రమ్మ, రాయిపల్లి చంద్రమౌళి, డాక్టర్ వి.నాగేశ్వరరావు, కే.రమణకుమార్, ఎం.సత్యనారాయణరెడ్డి తదితరులు. విజయం సాధించిన అభ్యర్థులు ఆయన మాట్లాడుతూ తమ విజయానికి కుటుంబ సభ్యుల తోడ్పాటు ఆకాడమీ మార్గదర్శనం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ప్రధాన కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరక్టర్లు, అధ్యాపకులు, విజయవంతమైన అభ్యర్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన కాస్మోపాలిటన్ క్లబ్ సభ్యులు

**కనిగిరి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కనిగిరి కాస్మోపాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్అండ్ క్లబ్ అధ్యక్షులు అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ జీవితానికి దిశానిర్దేశం చేసే, అజ్ఞానం నుండి విజ్ఞానానికి నడిపించే వారు ఉపాధ్యాయులు, వారు బోధించే పాఠాలు, ఇచ్చే విలువలు జీవితాంతం మనకు తోడ్పడతాయి. అందుకే ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నాం అన్నారు. విద్యా రంగంలో అంకితభావంతో సేవలందించి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు బొయ్యల తిరుపతిరెడ్డి, కే.వెంకటేశ్వర్లురెడ్డి, ప్రకాశ్‌రావు, గోవింద ప్రసాద్, దేవరపు మూర్తియ్య, బొట్టు వెంకటేశ్వర్లురెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, దేవకి సుబ్రహ్మణ్యం, అన్నా రంగనాయకులు, కొలికి రమణయ్య, నల్లబోతుల రెడ్డిలకు కాస్మోపాలిటన్ క్లబ్ సభ్యులు ఘన సన్మానం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగించడం తమకు జీవితాంతం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి అల్లూరి సత్యనారాయణ, ఏపీ వాసవి సత్ర సముదాయ అధ్యక్షులు దేవతి వెంకటేశ్వర్లు, చిలకల శ్రీనివాసరెడ్డి, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, వాగిచర్ల వెంకటేశ్వర్లు, నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రామాలయం వినాయక లడ్డూ వేలం పాటలో పుల్‌జోష్





**కనిగిరి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**





కనిగిరి రామాలయం ఉదయ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన లక్ష్మీ వినాయకుడి లడ్డూ వేలంపాట భక్తిశ్రద్ధలతో పాటు ఉత్సాహ భరితంగా సాగింది. భక్తులు గణేశుడి కటాక్షం కోసం పోటీగా బిడ్డు వేయడంతో వాతావరణం ఆధ్యాత్మిక ఉత్సాహంతో మార్మోగింది. మొదటి లడ్డు గోపాల్ సిండికేట్ అధినేత గోనుగుంట పవన్ కుమార్ రూ.46,116కు కైవసం చేసుకున్నారు. రెండవ లడ్డూ నార్లపాటి మల్లికార్జునరావు రూ.66,116కు గెలుచుకున్నారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన పది రూపాయల కరెన్సీ దండను వాగిచర్ల రాము (రాజ్యలక్ష్మి మెడికల్స్)రూ.51,116కు కైవసం చేసుకోగా, చిన్న లడ్డును కొత్త హనుమంతరావు రూ.40,516కు గెలుచుకున్నారు. వేలం పాటలో విజేతలకు వినాయకుడి శాలువాలు కప్పి సన్మానించి వినాయకుడి కటాక్షం మీ కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలి అంటూ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఏపీ వాసవిసత్ర సముదాయ అధ్యక్షులు దేవతి వెంకటేశ్వర్లు, గోనుగుంట గోపాలకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు,రాచపూడి వెంకటేశ్వర్లు, వేమనత్యం,టంగుటూరిగోవిందరావు, దుర్గ శ్రీనివాసరావు (జర్నలిస్టు) తదితరులు పాల్గొన్నారు. రామాలయం గణేష్ యూత్ ఫోర్స్ సభ్యులు అంకితభావంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**టంగుటూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా మాల జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ టీచర్ దాసరి ప్రసాద్ రావుని ఘనంగా సన్మానించారు. అదే విధంగా ప్రకాశం జిల్లా మాల జేఏసీ చైర్మన్ కొప్పోలు ఏడుకొండలుకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పగడాల కృష్ణయ్య, మెట్లప్ప శాంతారావు, మేడిద రవి, మేడికొండ లక్ష్మీనారాయణ, బంటుపల్లి రాజు, ఎరిజర్ల, రమేష్, పిల్లి మాల్యాద్రి, పిల్లి ప్రభాకర్, తుల్లిబిల్లి శ్రీకాంత్, జాన్ మాల, గోపి, జనార్దన్, మేడం రాంబాబు పాల్గొన్నారు.

## ఎరువులు దుకాణాలు తనిఖీ చేసిన

# విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

**నాగులుప్పలపాడు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు ఎరువుల దుకాణాలను పరిశీలించడం జరిగింది. మన గ్రోమోర్ సెంటర్‌లో ఎరువుల స్టాక్ రిజిస్టర్‌కు, భౌతికంగా గూడెంలో నిల్వ ఉన్న ఎరువులకు తేడాలను పరిశీలించడం జరిగింది. కొంత స్టాక్ సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడం వలన రూ.1,81,000 స్టాక్‌ను అమ్మకపు నిలుపుదల చేయడం జరిగింది. ఎరువులను ఎమ్మార్పీ ధరలకు మాత్రమే అమ్మాలని సూచించడం జరిగింది. ప్రతి రోజు స్టాక్ బోర్డులో నిల్వ ఉన్న ఎరువుల వివరాలను ఉంచాలని తెలియజేశారు. ఎవరైనా ఎరువుల అమ్మకపు దారులు ఎరువులు కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఎస్సై నాగేశ్వరరావు, విజిలెన్స్ ఏవో శివ నాగ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి పోతినేని వెంకటరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నిమజ్జనానికి తరలుతున్న గణనాధుడు

**నాగులుప్పలపాడు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**





ఉప్పుగుండూరు గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దిసాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు నవరాత్రులు పూజలు ముగించుకుని నిమజ్జనానికి తరలి వెళ్తుండగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన సంతనూతలపాడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ మేరుగ నాగార్జున, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొమ్మూరి కనకారావు, ఎంపీపీ దంపతులు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, మేధావుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల సుధాకర్, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ అధ్యక్షులు మాదాసు రాంబాబు, ఎంపీటీసీ అనురాధ, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కొంజేటి సురేష్, తగిరిశ సుబ్బారావు, మండల బీసీ సెల్ అధ్యక్షులు పాదర్తి శివ, వజ్రం బాబు, తోకల శ్రీను, గండు వెంకటరావు, యాదాల నాగాజు, విజయ్ సింహారెడ్డి, గోపిరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గణనాధునికి ఘనంగా నిమజ్జనం

**నాగులుప్పలపాడు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



మండలంలోని ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ పార్కులో వేంచేసి ఉన్న వినాయకస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణనాధుని శుక్రవారం ఘనంగా గ్రామ పురవీధుల్లో ఊరేగించి ఊర చెరువు లోని నిమజ్జనం చేశారు. ప్రతి రోజు నిత్య పూజలు అందుకున్న గణనాథునిని భక్తుల మేళ తాళాలు నడుమ ఊరేగింపుగా నిమజ్జనం గావించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మున్నంగి వెంకటరావు విజయలక్ష్మి సతీసమేతంగా పాల్గొన్నారు. వీరితో పాటుగా కొంజేటి వెంకట సురేష్‌బాబు, బెల్లం మురళి, మోటుమర్రి నాగేశ్వరరావు, చేబ్రోలు మోహన్‌రావు, అమర వేణు, అమరా రామ్మోహన్‌రావు, కొంజేటి జలంధర్, రిటైర్డ్ లైన్ ఇన్‌స్పెక్టర్ గోగినేని హరిబాబు, మాజీ వార్డు సభ్యులు కొంజేటి శ్రీనివాసరావు, తదితరులు పెద్ద ఎత్తున నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**టంగుటూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**





వ్యవసాయ కార్మిక సంఘం టంగుటూరు ఏరియా (టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ) మహాసభ టంగుటూరులో జరిగింది. ఈ సభలో దళిత పేటల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మెరుగ్గ అమలు చేయాలని, కూలీ పెంచాలని, భూమి పెంచాలని తీర్మానం చేయటం జరిగింది. ఈ సందర్భంగా టంగుటూరు ఏరియా వ్యవసాయకార్మిక సంఘం నూతన కమిటీని 15 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా గుడిపూడి అంకయ్య, కార్యదర్శిగా వేసుపోగు మోజెస్, ఉపాధ్యక్షులుగా గడ్డం సాల్మన్ ఎం.యానాది, సహాయ కార్యదర్శిగా టి.సుబ్బారావు, మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

## వ్యాయామ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**టంగుటూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



మనం ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ టంగుటూరు తరుపున జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కే.ఉప్పులపాడు నందు ఏ.రవికిరణ్ కుమార్‌రెడ్డి వ్యాయామ ఉపాధ్యాయునిగా ఉత్తమ సేవలు అందిస్తూ ఎంతో మంది బాల బాలికలను ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేసి గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయి క్రీడా పోటీలలో కబడ్డీ ఆటను ఎంచుకుని ఎంతో మంది క్రీడాకారులను తయారు చేసిన ఏ.రవి కిరణ్ కుమార్‌రెడ్డిని జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసిన అవార్డును దక్కించుకున్న నా బాల్య స్నేహితుడు టంగుటూరులో ఠాగూర్ చైతన్య మైనూర్క్ నందు చదువుకున్న మా స్నేహితుడు పీడీ రవి కిరణ్‌కు మా స్నేహితులు సంఘం మనం ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ తరుపున అభినందనలు తెలియజేశారు. సంఘ సభ్యులు కందుకూరి రాంబాబు, ఎస్‌కే మాబు, సుభాని, పులిచెర్ల సురేష్‌రెడ్డి, మాల్యాద్రి, వినాయక ప్రసాద్, దేవరపల్లి చంద్ర, మద్దిరాల కిరణ్ కుమార్, కోటా ప్రసన్న కుమార్, ఎస్‌కే బాలిషావలి, తదితరులు అభినందనలు తెలిపారు.

## పాఠశాలకు ఆటవస్తువులు అందజేసిన ప్రధానోపాధ్యాయులు సుధారాణి

**టంగుటూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



మండలంలోని తూర్పునాయుడుపాలెం జడ్పీ హెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎన్‌వీ సుధారాణి తన సొంత ఖర్చుతో పాఠశాలకు ఆట వస్తువులను సమకూర్చారు. రూ.10 వేలు విలువ చేసే ఆట వస్తువులను శుక్రవారం పాఠశాలలో చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రధానోపాధ్యాయులు సుధారాణి అభినందించారు.

## పామూరులో వైభవంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

**పామూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



పామూరు స్థానిక మదర్సలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల్లో షేక్ హాజీ గౌస్ పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్ధన చేశారు. ప్రవక్త హజరత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదిన సందర్భంగా వారు బోధించిన నిజాయితీ దయ సమానత్వం విలువ సమాజానికి మార్గదర్శకాలని మనమంతా విలువలు పాటిస్తూ శాంతి సామరస్యం వెల్లి విరిసే సమాజాన్ని నిర్మించుకుందాం అని అన్నారు. అనంతరం మదరసా పిల్లలకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ పవిత్రమైన రోజు ముస్లిం సోదర సోదరీ మణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ హాజీ గౌస్, కోడిగుంపల నాయబ్ రసూల్, షేక్ రఫీ, షేక్ సలాం ఖాజా మొహిద్దిన్, దిల్దర్, కావేరి రసూల్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**దర్శి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**




ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దర్శి మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీనివాస పద్మావతి కళ్యాణమండపం నందు అధ్యక్షులు సీహెచ్ బసవయ్య అధ్యక్షతన వృత్తి పట్ల నిబద్ధతతో పనిచేసిరిటైర్డ్అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. సన్మాన గ్రహీతలు ఎస్.అంజిరెడ్డి,పి.నాసరయ్య, ఎస్.రామారావు, జే.బాలయ్య, కే.వెంకటేశ్వరరెడ్డి, జి.గురు ప్రసాద్ వీరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దేవతి,వరప్రసాద్,వైస్‌చైర్మన్ వాక జనార్ధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి,కన్వీనర్‌దానిరెడ్డి,వెంకటరెడ్డి, కోశాధికారితిరుపతిరెడ్డి,రోశారావు, గణేష్, ఎస్.ఏడుకొండలు, నరసింహారావు, నాగరాజు, నారాయణ, సుశీలమ్మ, పాల్గొన్నారు.

## శ్రీవల్లూరమ్మ ఆలయ లైటింగ్ డెకరేషన్‌కు కొటేషన్లు స్వీకరణ

**టంగుటూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**

శ్రీవల్లూరమ్మ వారి దేవస్థానం నందు దసరా నవరాత్రులు ఈనెల 22వ తేదీ నుండి 2వ తేదీ వరకు అనగా 11 రోజులు లైటింగ్ డెకరేషన్ కు కొటేషన్లు కోరారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు స్వీకరించబడును. కావున ఆసక్తి కలిగిన వారు కొటేషన్లు ఇవ్వాల్సిందిగా ఆలయ కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

# ఘనంగా గణనాధులకు వీడ్కోలు

**సింగరాయకొండ, సెప్టెంబర్ 5,ప్రభాతవార్త**



వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాధులను శుక్రవారం నిమజ్జనాలకు ఘనంగా వీడ్కోలు పలికారు. కందుకూరు,కొండేపి, టంగుటూరు, పొన్నలూరు ప్రాంతాలనుండి పెద్దసంఖ్యలో గణనాథ విగ్రహాల ను డిజె సౌండ్స్,బాణసంచాలు పేలుస్తూ సందడి వాతావరణంలో పాకల సముద్ర తీరానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. నిమజ్జన ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐబి మహేంద్ర మేరైన్ పోలీస్తో కలిసి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.చిన్నారులు, యువత, పెద్దలు అధిక సంఖ్యలో గణనాధుల నిమజ్జన మహోత్సవం లో పాల్గొని సముద్ర స్నానాలు ఆచరించారు.

## ఉద్యోగ, కార్మికులలోకి మహాసభల విస్తృత ప్రచారం

### - సీఐటీయు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు పిలుపు

**దర్శి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**




దర్శిలో జరుగుతున్న సీఐటీయు 13వ ప్రకాశం జిల్లా మహాసభల ప్రచారాన్ని విస్తృతంగా ఉద్యోగ, కార్మికులలోకి తీసుకుపోవాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు పిలుపునిచ్చారు. ఈ రోజు దర్శిలో సీఐటీయు మండల కన్వీనర్ ఉప్పు నారాయణ అధ్యక్షతన జిల్లా మహాసభల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దర్శి పట్టణంలో మొదటి సారిగా సీఐటీయు జిల్లా మహాసభలు జరుగుతున్నాయని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల లోని ప్రజల వద్దకు ప్రచారం చేయాలని కోరారు. కార్మిక వర్గ ఐక్యత, పోరాటం లక్ష్యంతో 1970లో సీఐటీయు ఆవిర్భవించి దేశంలోనే గుర్తింపు పొందిన పెద్ద కార్మిక సంఘంగా అభివృద్ధి అయిందని, కార్మిక, ఉద్యోగుల హక్కుల కోసం దేశంలో 1991లో నుంచి 24 సార్లు దేశ వ్యాప్త సమ్మెలు జరిపిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు చిరుపల్లి అంజయ్య, విజయరాణి, హనుమంతరావు, పంటా ఏడుకొండలు, వెంకట రమణ లు ప్రసంగించారు. అంగన్‌వాడీ, ఆశా,ఎల్ఐసీ ఏజెంట్స్,మధ్యాహ్నభోజనం, సివిల్ సప్లై ముఠా, వీఆర్ఏ, పంచాతీ, గ్రీన్ అంబాసీడర్స్, బిల్డింగ్, ఆటో రంగాల కార్మికులు, మహిళా సంఘ నాయకులు ఆలూరి ఇస్రాయిల్, ఇత్తడి కోటయ్య, యోహోషువా, ఆర్.రామకోటిరెడ్డి, పార్వతి, నరసమ్మ, ఆదిలక్ష్మి, గుడిమెట్ల ఆదాం, రంగమ్మ, గంగయ్య, తదితర కార్మికులు పాల్గొని మహాసభలు జయప్రదంగా నిర్వహించాలని తీర్మాణం చేశారు.

## శ్రీకార్యసిద్ధి మహాశక్తి గణపతిని

### దర్శించుకున్న మాజీ మంత్రి శిద్దా



**దర్శి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**

దూండి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రులలో భాగంగా విజయవాడలోని సితార సెంటర్ నందు 72 అడుగుల శ్రీ కార్యసిద్ధి మహాశక్తి గణపతి విగ్రహం దర్శించుకుని గణపతి, శ్రీ నగరేశ్వరస్వామి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు అందుకున్న రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు. ఈ సందర్భంగా దూండి గణేష్ సేవా సమితి అధ్యక్షులు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ దంపతులు శిద్దా రాఘవరావుని స్వామి వారి తీర్ధ ప్రసాదాలతో పాటుగా శేష వస్త్రాలు బహుకరించారు.

### ఉత్తమ ఉపాధ్యాయురాలు అనసూయని అభినందించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



దర్శి మండలం రాజంపల్లి గ్రామంలో మం.ప.ప్రా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సె.గ్రే ఉపాధ్యాయులు గా ఎంపికైన బోడపాటి అనసూయ కి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా దర్శి టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. విద్యార్థులు, ప్రజల దృష్టిలో ఆదర్శ ఉపాధ్యాయురాలుగా బోడపాటి అనసూయ నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఎల్.రాగ స్రవంతి, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి-సుబ్బారావు, దర్శి మండల పార్టీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్న, కూటమి శ్రేణులు ఉన్నారు.

## కృషి విజ్ఞాన కేంద్రం వారికి ద్వితీయ పురస్కారం

**దర్శి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



దర్శి పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం వారికి ద్వితీయ పురస్కారంగా ఎంపికైనట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ భారతీయ పరిశోధన మండలి, వ్యవసాయ సాంకేతిక అను ప్రయోగ సంస్థ అటారి జోన్-10, హైదరాబాద్ తరుపున 2024-25 సంవత్సరానికి గాను, అటారి జోన్-10 జోన్లో గల ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి తెలంగాణ రాష్ట్రాల్లో గల 72 కృషి విజ్ఞాన కేంద్రాలలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం వారికి ద్వితీయ పురస్కారం లభించడం జరిగింది. ఈ ద్వితీయ పురస్కారం గత సంవత్సరం కృషి విజ్ఞాన కేంద్రం దర్శి వారు చేపట్టిన క్షేత్ర స్థాయిపరిశీలనలు, ప్రథమ శ్రేణి పరిశీలనలు, క్షేత్ర స్థాయి పరిశోధనల పరిశీలనలు, రైతు శిక్షణా కార్యక్రమాలు, భూసార పరీక్షలు, సామూహిక ప్రథమ శ్రేణి పరిశీలనలు, విత్తనం తయారు చేసి రైతులకు ఇవ్వడం, నారు మొక్కలు పెంచి రైతులకు ఇవ్వడంలోనూ, భూసారం పెంచే పద్ధతులు మొదలగు అంశాలపైన దర్శి కేవీకే విజ్ఞాన కేంద్రం వారికి ద్వితీయ పురస్కారం లభించింది. వైస్ ఛాన్సర్ డాక్టర్ భారతి, అటారి డైరక్టర్ డాక్టర్ షేక్ మీరా, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివ నారాయణ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం జరిగింది. ఈ పురస్కారం రావడానికి కృషి చేసిన డాక్టర్ జి.శివ నారాయణ విస్తరణ సంచాలకులు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు, వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ దుర్గా ప్రసాద్‌కి అలాగే కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బందికి అందరికి ధన్యవాదాలు తెలిపారు.

## పోతవరంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ

**దర్శి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**



మండలంలోని పోతవరం గ్రామంలో ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు శుక్రవారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శి మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కేవీ రెడ్డి, రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, దర్శి మండల వైస్ ఎంపీపీ సోము దర్గారెడ్డి, దర్శి నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు మిల్లర్ బుజ్జి, దర్శి నియోజకవర్గ మున్సిపల్ వింగ్ అధ్యక్షులు 5వ వార్డు కౌన్సిల్ బాబురావు, దర్శి మండల బీసీ సెల్ అధ్యక్షులు అంకాల శ్రీను, దర్శి పట్టణ పోలింగ్ బూత్ అధ్యక్షులు రవీంద్రారెడ్డి, కుందురు నరసింహారెడ్డి, రవి పాల్గొన్నారు.

## గణపతి పూజ కార్యక్రమంలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ





**దర్శి , సెప్టెంబర్ 5, ప్రభాతవార్త**

దర్శి పట్టణంలోని సందువారిపాలెంలో కొలువై ఉన్న మహాగణపతి వద్ద శుక్రవారం సాయంత్రం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మహాగణపతి కి టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్డీయె కూటమిలో తేలని 'సర్దుబాట్లు'

## ఎక్కువ సీట్లు పట్టుబడుతున్న మిత్రపక్షాలు



**పాట్నా, సెప్టెంబరు 5:** ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో బీహార్ ఎన్డీఏ కూటమిలో సీట్ల లొల్లి ప్రారంభమైంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధిక సీట్లు (80) గెల్చుకున్నప్పటికీ, జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిలో ఇంతవరకు చిన్న భాగస్వామిగా ఉన్న చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), జితన్ రామ్ మాంఝీ హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్) పార్టీలు ఇకపై కేవలం సహకారం అందించే పాత్రకే పరిమితం కారాదని భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పార్టీలు ఎక్కువ సీట్లను కోరుతున్నాయి. దీంతో ఎన్డీఏలో ముసలం మొదలైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఐదు సీట్లను గెల్చుకున్న చిరాగ్ పాశ్వాన్ అసెంబ్లీ ఎన్నికల్లో 40 సీట్లు కావాలని డిమాండ్ చేసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఒక వేళ అన్ని సీట్లు తమకు ఇవ్వకపోతే మొత్తం 243 అసెంబ్లీ సీట్లలో తమ పార్టీ సొంతంగా పోటీ చేస్తుందని చిరాగ్ పాశ్వాన్ హెచ్చరిస్తున్నారు. పలు అంశాల్లో పార్టీ సొంత వైఖరిని వెల్లడించారు. నరేంద్ర మోదీ ప్రధానిగా కొనసాగినంత కాలం తమ మద్దతు తప్పనిసరి అని ఆయన స్పష్టం చేస్తున్నారు. కాగా, స్థానికంగా తమకు ఎక్కువ మద్దతు ఉన్న గయా, ఔరంగాబాద్‌ల్లోని అన్ని సీట్లను తమకే కేటాయించాలని మరో సంకీర్ణ పార్టీ హెచ్ఏఎం చీఫ్ జితన్ రామ్ మాంఝీ డిమాండ్ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన 20 సీట్లు అడుగుతున్నారు. తమ పార్టీ మద్దతు లేకుండా ఎన్డీఏ విజయం సాధించలేదని అయన ప్రకటించారు. ప్రస్తుతం తమ కూటమిలోని పార్టీలు విడిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్డీఏకు నేతృత్వం వహిస్తున్న బీజేపీపై ఉంది. ఆ పార్టీల డిమాండ్లను సమన్వయంతో పరిష్కరించకపోతే అవి విడిగా పోటీచేసే ప్రమాదం ఉంది. దీంతో కూటమికి అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి దెబ్బ తగిలి విజయావకాశాలు గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని చేపట్టాలని మరోవైపు మహాఘట్ బంధన్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ కూటమిలో కాంగ్రెస్, ఆర్జేడీతో పాటు సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. ఈ కూటమి ఎక్కువగా యువత, తమ సంప్రదాయ ముస్లింయాదవ్ ఓట్ల బ్యాంక్‌పై ఆధారపడింది. ఈ ఎన్నికల్లో తమ కూటమి పార్టీలను సమన్వయం చేయడంలో ఎన్డీఏ విఫలమైతే అది మహాఘట్ బంధన్ కూటమికి పూర్తి లాభం చేకూరుస్తుంది. ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహు ల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌లు రాష్ట్రంలో 'వోటర్ రైట్స్ మార్చ్' ద్వారా పాదయాత్ర జరిపి తమ కూటమికి అనుకూల వాతావరణం సృష్టించే ప్రయత్నం చేశారు. వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న తమిళనాడులో కీలక రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం(ఎఎంఎంకే) నేత దినకరన్ ఎన్డీయే కూటమి నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించారు. మాజీ సీఎం పన్నీర్ సెల్వం కూటమిని వీడిన కొద్ది వారాలకే దినకరన్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. కడలూర్‌లో దినకరన్ విలేకరులతో మాట్లాడుతూ ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామిపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. ద్రోహాన్ని తన పార్టీ భరించలేదని తెలిపారు. కూటమిలో పెరుగుతున్న విభేదాలను పరిష్కరించడంలో బీజేపీ కేంద్ర నాయకత్వం విఫలమైందని చెప్పారు.



# ఏడు కాదు మూడు యుద్ధాలను ఆపా!

## యుద్ధ విరమణ వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు యూటర్న్

**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** తనను తాను గొప్ప శాంతి దూతగా అభివర్ణించుకునే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తన పాత వ్యాఖ్యలను తానే సవరించుకున్నారు. తాను ఏడు దేశాల మధ్య యుద్ధాలను ఆపానని గతంలో పదేపదే చెప్పుకున్న ఆయన, తాజాగా ఆ సంఖ్యను మూడుకు తగ్గించారు. వైట్‌హౌస్‌లో టెక్నాలజీ సంస్థల అధినేతలకు ఇచ్చిన విందు సందర్భంగా ట్రంప్ ఈ కొత్త ప్రకటన చేశారు. వైట్‌హౌస్‌లో టెక్ కంపెనీల సీఈవోలతో సమావేశమైన అనంతరం ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ క్రమంలో ఓ జర్నలిస్టు రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎలా ముగిస్తారని ప్రశ్నించారు. దీనికి బదులిస్తూ, మీకు తెలుసా? నేను ఇప్పటివరకు మూడు యుద్ధాలను ఆపానని ట్రంప్ పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా ఘర్షణ పడుతున్న దేశాల మధ్య తాను శాంతిని నెలకొల్పానని, అది అసాధ్యమని చాలామంది చెప్పినా తాను చేసి చూపించానని అన్నారు. అయితే, ఆ మూడు యుద్ధాలు ఏవనే విషయాన్ని మాత్రం ఆయన స్పష్టం చేయలేదు. ప్రస్తుతం రష్యా ఉక్రెయిన్ యుద్ధం క్లిష్టంగా మారినప్పటికీ, దాన్ని కూడా తాను కచ్చితంగా ఆపుతానని ధీమా వ్యక్తం చేశారు. థాయ్‌లాండ్ కంబోడియా, ఇజ్రాయెల్ఇరాన్, ఇజ్రాయెల్ హమాస్, రువాండాడెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెర్బియాకొసావో, ఈజిప్ట్ఇథియోపియా, ఇండియాపాకిస్థాన్ మధ్య ట్రంప్ యుద్ధాలు ఆపినట్టు వైట్ హౌస్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ లాంటి దేశాలు ఆయనను నోబెల్ శాంతి బహుమతికి కూడా నామినేట్ చేశారు. ఇక, భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను కూడా తానే తగ్గించానని గతంలో ట్రంప్ పలుమార్లు వ్యాఖ్యానించారు. అయితే, భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ వచ్చింది. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో మూడో దేశం ప్రమేయం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా స్పష్టం చేశారు. ఇప్పుడు ట్రంప్ తన పాత లెక్కను మార్చి, ఏడు నుంచి మూడుకు తగ్గించడం చర్చనీయాంశంగా మారింది.

# ఆ ఫోటోచూస్తే ప్రతి అమెరికన్‌కు వణుకే...

## పుతిన్, జిన్‌పింగ్, మోడీ ఒకే ఫొటోపై ఎనలిస్టు వ్యాఖ్యలు



**న్యూయార్క్, సెప్టెంబరు 5:** చైనాలో ఇటీవల జరిగిన షాంఘై కో ఆపరేషన్ సదస్సుకు సంబంధించిన ఓ ఫొటో ప్రతీ అమెరికన్ వెన్నులో వణుకుపుట్టించేలా ఉందని అమెరికా రాజకీయ విశ్లేషకుడు వాన్ జోన్స్ పేర్కొన్నారు. ప్రపంచంపై ఆసియా ఆధిపత్యం చెలాయించ నుందని చెప్పేందుకు ఇది సంకేతంలా కనిపిస్తోందన్నారు. షాంఘై సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా ప్రెసిడెంట్ జిన్ పింగ్ నవ్వుతూ మాట్లాడుకోవడం మీడియా కెమెరాలు బంధించాయి. ఈ ముగ్గురు నేతలూ నవ్వుతూ చేతిలో చేయి వేసుకుని మాట్లాడుకోవడం అమెరికన్లను వణికించేలా ఉందని వాన్ జోన్స్ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల బాధిత దేశాధినేతలు ఒకే వేదికపై నవ్వులు పంచుకుని, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్న ఫోటోలు పాశ్చాత్య మీడియా దృష్టిని ఆకర్షించాయి. దీనిపై వాన్ జోన్స్ మాట్లాడుతూ "ఈ రోజును చరిత్రాత్మ కంగా, అతిపెద్ద మలుపుగా గుర్తుంచుకుంటాం" ఎందుకంటే, అమెరికా సుంకాల బాధిత దేశాల్లో మూడు కీలక దేశాల అధినేతలు నవ్వుతూ మాట్లాడుకోవడం వారి మధ్య మైత్రి బలపడుతోందనేందుకు సంకేతం. ఇది అమెరికాకు మంచిది కాదు. ఈ సమావేశం 'నూతన ప్రపంచవ్యవస్థ' కు సంకేతం. ఒకప్పుడు ఇలా అమెరికా, చైనా, రష్యా మాత్రమే ఉండేవి. ఇప్పుడు మనం అందులో లేము అందరూ మనకు వ్యతిరేకంగా ఉన్నారు" అని ఆయన అన్నారు. పాశ్చాత్య మీడియాలో ఈ ఫొటో సంచలనంగా మారింది. అమెరికా వ్యతిరేక వర్గంగా ముద్రపడిన నాలుగు దేశాలు ఇరాన్, ఉత్తర కొరియా, చైనా, రష్యాల మొదటి సమావేశంగా విశ్లేషకులు అభిప్రాయపడినట్టు వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. 'ఈ ఫొటో జిన్‌పింగ్, పుతిన్ మధ్య ఉన్న స్నేహం అమెరికాను సవాలు చేసేలా ఉంది. సుంకాలతో ట్రంప్ భారత్‌ను దూరం చేసుకోగా భారత దేశం చైనాకు దగ్గరవుతోందని అమెరికా పత్రికలు విశ్లేషించాయి.



# భర్తకంటే భార్యకు ఆదాయం ఎక్కువ ఉంటే భరణం అవసరంలేదు

## చెన్నై హైకోర్టు సంచలన తీర్పు

**చెన్నై, సెప్టెంబరు 5:** భార్యాభర్తల మధ్య భరణం చెల్లింపు కేసులకు సంబంధించి మద్రాస్ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. భార్యకు భర్త కన్నా ఎక్కువ ఆదాయం, ఆస్తులు ఉన్నప్పుడు ఆమెకు భరణం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. చెన్నైకి చెందిన వైద్య దంపతుల కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. చెన్నైలో వైద్యులుగా పనిచేస్తున్న భార్యాభర్తలు విభేదాల కారణంగా విడిపోయారు. విడాకుల కోసం చెన్నై ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన ఫ్యామిలీ కోర్టు భార్యకు నెలకు రూ.30,000 చొప్పున భరణంగా చెల్లించాలని భర్తను ఆదేశించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సదరు వైద్యుడు మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బాలాజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణలో భాగంగా తన భార్యకు ఇప్పటికే గణనీయమైన ఆస్తులు ఉన్నాయని, ఆమె సొంతంగా ఒక స్కానింగ్ సెంటర్ నడుపుతూ అధిక ఆదాయం సంపాదిస్తోందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సంబంధించిన ఆధారాలను, పత్రాలను కూడా సమర్పించారు. వాదనలు విన్న న్యాయస్థానం, భార్య ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు భర్త నుంచి భరణం ఆశించడం సరికాదని అభిప్రాయపడింది. అదే సమయంలో, వారి కుమారుడు నీట్ పరీక్షకు సిద్ధమవుతున్నాడని, అతని చదువుకు అయ్యే ఖర్చు రూ.2.77 లక్షలను తాను భరించేందుకు సిద్ధంగా ఉన్నానని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, కుమారుడి చదువు ఖర్చుల విషయంలో జోక్యం చేసుకోబోమని పేర్కొంది. భార్యకు భరణం చెల్లించాలంటూ ఫ్యామిలీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను పూర్తిగా రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది.

# మౌంట్ రష్మోర్‌పై ట్రంప్ శిలా ముఖచిత్రం

## అమెరికా అధ్యక్షుడి మదిలో మెదిలిన మరో కోరిక



**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన చిరకాల కోరికను మరోసారి బలంగా బయటపెట్టారు. అమెరికా చరిత్రలో నిలిచిపోయిన నలుగురు గొప్ప అధ్యక్షుల ముఖచిత్రాలతో ఉన్న మౌంట్ రష్మోర్‌పై తన ముఖాన్ని కూడా చూడాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. ఈ మేరకు, ఆ అధ్యక్షుల ముఖాల పక్కనే తన ముఖం ఉన్నట్లుగా రూపొందించిన ఒక ఏఐ వీడియోను ఆయన తాజాగాట్రూత్ ఖాతాలో పంచుకున్నారు. ఇది ప్రస్తుతం అమెరికాలో కొత్త చర్చకు దారితీసింది. దక్షిణ డకోటాలోని బ్లాక్ హిల్స్‌లో ఉన్న మౌంట్ రష్మోర్ ఒక జాతీయ స్మారక చిహ్నం. ఇక్కడి భారీ గ్రానైట్ పర్వతంపై అమెరికా జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మాజీ అధ్యక్షులు జార్జ్ వాషింగ్టన్, థామస్ జెఫర్సన్, థియోడర్ రూజ్‌వెల్ట్, అబ్రహం లింకన్‌ల 60 అడుగుల ముఖ శిల్పాలు చెక్కారు. ఏటా లక్షలాది మంది పర్యాటకులు దీనిని సందర్శిస్తుంటారు. ఈ దిగ్గజాల సరసన తన శిల్పం కూడా ఉండాలనేది ట్రంప్ కోరిక. ఈ ఏడాది ఫిబ్రవరిలో కాంగ్రెస్ సభ్యురాలు అన్నా పౌలినా లూనా ట్రంప్ ముఖాన్ని అక్కడ చేర్చాలంటూ ప్రతిపాదన కూడా తీసుకువచ్చారు. అయితే, ట్రంప్ ఆశలకు అధికారులు, నిపుణులు బ్రేకులు వేస్తున్నారు. ఆ పర్వతంపై ఐదో ముఖాన్ని చెక్కడం ఆచరణ సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. మౌంట్ రష్మోర్ నిర్వహణ చూసే నేషనల్ పార్క్ సర్వీస్ కూడా ఇదే విషయాన్ని తేల్చి చెప్పింది. ఆ పర్వతంపై కొత్తగా శిల్పాన్ని చెక్కేందుకు సురక్షితమైన, స్థిరమైన ప్రదేశం లేదని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న శిల్పాల కారణంగా పర్వతంపై మరిన్ని చెక్కడాలు ప్రమాదకరమని వారు విశ్లేషిస్తున్నారు. గతంలో జాన్ ఎఫ్. కెన్నడీ, రోనాల్డ్ రీగన్, బరాక్ ఒబామా వంటి అధ్యక్షుల ముఖాలు కూడా మౌంట్ రష్మోర్‌పై చేర్చేందుకు ప్రస్తావనకు వచ్చినా, అవేవీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు ట్రంప్ విషయంలో కూడా సాంకేతిక కారణాల వల్ల ఆయన కోరిక నెరవేరడం కష్టమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఇసుకతవ్వకాలపై డిప్యూటీ సిఎం, ఐపిఎస్ మధ్య వాగ్వాదం

## వైరల్ అయిన విడియోతో పవార్‌పై నెటిజన్ల విమర్శలు



**ముంబయి, సెప్టెంబరు 5:** ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి వెళ్లిన ఓ ఐపీఎస్ అధికారిణికి ఏకంగా ఉపముఖ్యమంత్రి ఫోన్ చేయడం మహారాష్ట్రలో సంచలనంగా మారింది. అక్రమార్కులపై చర్యలు వద్దని ఫోన్‌లో ఉప ముఖ్యమంత్రి ఆదేశించడంతో ఇదే విషయాన్ని వీడియో కాల్‌లో చెప్పాలని సదరు ఐపీఎస్ అధికారిణి కోరారు. దీంతో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సోలాపూర్ జిల్లాలోని కర్మలా తాలూకాలోని కుద్దు గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని సబ్‌డివిజనల్ పోలీసు అధికారిణి, ఐపీఎస్ అంజనా కృష్ణకు ఫిర్యాదులు అందాయి. దీంతో సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లిన అంజనా కృష్ణ ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొందరు గ్రామస్థులు, స్థానిక ఎన్సీపీ కార్యకర్తలు అధికారులతో ఘర్షణకు దిగారు. వారిలో ఒకరు తమ పార్టీ అధినేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు ఫోన్ చేసి ఐపీఎస్ అంజనాకృష్ణకు ఇచ్చారు. ఫోన్‌లో ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడం ఆపాలని పవార్ ఆమెను ఆదేశించారు. అయితే, తాను ఫోన్‌లో మాట్లాడుతున్నది ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోనేనని రుజువు చేసుకోవాలని, తనకు వీడియోకాల్ చేయాలని అంజనీకృష్ణ కోరారు. దీంతో ఆగ్రహంచెందిన అజిత్ పవార్ 'నన్నే వీడియో కాల్ చేయమంటావా నీకు ఎంత ధైర్యం?. మీపై చర్యలు తీసుకుంటా. నన్ను చూడాలనుకుంటున్నారుగా నాకు వీడియో కాల్ చేయండి' అంటూ నెంబర్ చెప్పి ఫోన్ పెట్టేశారు. దీంతో పవార్‌కు ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణ వీడియో కాల్ చేశారు. ఈ సందర్భంగా తక్షణమే చర్యలు ఆపేయాలంటూ పవార్ ఆదేశించారు. కాగా, ఈ వీడియో వైరల్‌గా మారడంతో అజిత్ పవార్‌పై నెటిజన్లు మండిపడుతున్నారు. ఐపీఎస్ అధికారిణి విధులకు అడ్డుపడ్డారని, అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా అడ్డుకున్నారని విమర్శిస్తున్నారు. ఈ విమర్శలపై ఎన్సీపీ నేత సునీల్ తట్కరే స్పందిస్తూ పవార్ వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ ఇచ్చారు. కార్యకర్తలను శాంతింపజేసేందుకు ఐపీఎస్ అధికారిణిని అజిత్ మందలించి ఉండవచ్చని అన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అజిత్ పవార్ మద్దతివ్వరని స్పష్టం చేశారు. ఈ వీడియోపై మాట్లాడేందుకు ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణ నిరాకరించారు.

# సంక్షిప్తంగా..

## యుఎస్ మాజీ అధ్యక్షుడు జోబైడెన్‌కు తలపై గాయం!



**వాషింగ్టన్, సెప్టెంబరు5:** అమెరికా మాజీ అధ్య క్షుడు జో బైడెన్ ఆరోగ్య పరిస్థితిపై మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల ఆయన తలపై ఒక గాయంతో, మునుపటి కంటే నీరసంగా, బడలికతో కనిపిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. ఈ వీడియోలు చూసిన నెటిజన్లు, రాజకీయ విశ్లే షకులు ఆయన ఆరోగ్యస్థితి గురించి రకరకాల ఊహాగానాలు చేస్తున్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, బైడెన్‌కు ఇటీవలే చర్మ క్యాన్సర్‌కు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. ఈ ఆపరేషన్ కారణంగానే ఆయన తలపై గాయం ఏర్పడిందని తెలుస్తోంది. తాజాగా బయటకు వచ్చిన వీడియోలలో బైడెన్ చాలా అలసి పోయినట్లు, బలహీనంగా కనిపించడం తో ఆయన ఆరోగ్యం చుట్టూ జరుగు తున్న చర్చ మరింత ఊపందుకుంది. 82 యేళ్ల జో బైడెన్ ఆరోగ్యంపై చర్చ జరగడం ఇది మొదటిసారేమీ కాదు. గతంలో కూడా ఆయనకు చర్మ క్యాన్సర్‌కు సంబంధించి చిన్నపాటి చికిత్సలు జరిగినట్లు వైద్య నివేదికలు వెల్లడించాయి. అయితే, తాజా శస్త్రచికిత్స తీవ్రత, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.

## ట్రంప్ వైట్‌హౌస్ విందుకు హాజరుకాని మస్క్..



**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం టెక్ దిగ్గజాలతో సమావేశమైన విషయం విదితమే. ఈ సమావేశానికి ట్రంప్ మాజీ సహచరుడు, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ హాజరు కాలేదు. అయితే తాను హాజరు కాకపోవడంపై మస్క్ తాజాగా స్పందించారు. ఆ సమావేశానికి ప్రెసిడెంట్ ట్రంప్ యంత్రాంగం నుంచి తనకు ఆహ్వానం అందిందని, అనివార్య కారణాల వల్ల తాను వెళ్ల లేకపోయానని వివరణ ఇచ్చారు. తనకు బదు లుగా తన కంపెనీ నుంచి ఓ ప్రతినిధిని పంపిం చానని మస్క్ తెలిపారు. ట్రంప్ సమావేశంపై ఆంగ్లమీడియా సంస్థ ఓ కథనం ప్రసారం చేస్తూ ఈ మీటింగ్‌కు ట్రంప్ యంత్రాంగం ఎలాన్ మస్క్‌కు ఆహ్వానం పంపలేదని పేర్కొంది. ఆహ్వానితుల జాబితాలో మస్క్ పేరు లేదని తెలిపింది. మస్క్ తాజా వివరణ నేపథ్యంలో టెస్లా, స్పేస్ ఎక్స్ కంపెనీల తరఫున ఎవరైనా హాజరై ఉండొచ్చని పేర్కొంది. అయితే, మస్క్ ప్రతినిధి హాజరుపై అటు ట్రంప్ యంత్రాంగం కానీ, ఇటు మీడియా సంస్థలు కానీ ఎలాంటి నిర్ధారణ ప్రకటన చేయకపోవడం గమనార్హం.

## షిర్డీ సాయినాథునికి కోటిన్నర విలువైన కానుక



**ముంబయి, సెప్టెంబరు 5:** మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా ఆలయానికి దుబాయ్‌కి చెందిన భక్తుడు రూ.1.58 కోట్ల విలువైన కానుకలను సమర్పిం చాడు. 1 కిలో 623 గ్రాముల బంగారంతో రూపొందించిన 'ఓం సాయి రామ్' అనే అక్షరాలను శిర్డీ ఆలయానికి విరాళంగా ఇచ్చాడు. అయితే తన వివరాలు బహిర్గతం చేయవద్దని సాయి బాబా సంస్థాను కోరినట్లు తెలుస్తోంది. దుబాయ్‌కి చెందిన భక్తుడి కుటుంబం ప్రతినెల షిరిడీ సాయినాథుడి దర్శనంచేసుకుని రూ. లక్ష విరాళంగా ఇస్తారని దేవాలయ అధి కారులు పేర్కొన్నారు. గురువారం మరో సారి షిరిడీని సందర్శించిన భక్తుడు కోటి న్నరవిలువైన బంగారు అక్షరాలను బహూకరించి నట్లు తెలిపారు. ఆలయంలోని రెండు ప్రధానద్వారాలకు వీటిని అమర్చినట్లు తెలిపారు.

## థాయ్‌లాండ్ కొత్త ప్రధానిగా అనుతిన్ చార్న్‌విరకూల్




**బ్యాంకాక్, సెప్టెంబరు 5:** థాయ్‌లాండ్ తదుపరి ప్రధానిగా అనుతిన్ చార్న్ విరాకుల్‌ను అక్కడి పార్లమెంట్ ఎన్నుకుంది. మాజీ ప్రధాని పేటోం గ్టార్న్ షినవత్రను అక్కడి రాజ్యాంగ న్యాయ స్థానం పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో కొత్త ప్రధాని ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. భూమ్‌జైతై పార్టీకి చెందిన అనుతిన్.. షినవత్ర నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో పనిచేశారు. గత రెండేళ్లలోనే థాయ్‌లాండ్‌కు మూడో ప్రధాని రావడం గమనార్హం. కంబోడియా సెనేట్ అధ్యక్షుడు హన్‌సేన్‌తో థాయ్‌లాండ్ ప్రధాని షినవత్ర ఫోనులో మాట్లాడడం సం చలనం రేపింది. ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదాలు తీవ్రంగా ఉన్న సమయంలో పొరుగుదేశం నేతతో కీలక విషయాలు పంచుకున్న తీరు వివాదాస్పదమైంది.

# ముంబయి మహానగరానికి మానవబాంబుల ముప్పు

## 14మంది ఉగ్రవాదులున్నారంటూ ఇమెయిల్ హెచ్చరికలు




**ముంబై, సెప్టెంబరు 5:** ముంబైకి బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్రాఫిక్ పోలీస్ వాట్సాప్ నెంబర్‌కు ఈ బెదిరింపులు వచ్చాయి. 34 వాహనాల్లో 400 కిలోల ఆర్డీఎక్స్‌తో మానవబాంబులు నగరంలోకి ప్రవేశించాయని, నగరం మొత్తాన్ని పేలుళ్లతో కుదిపేయనున్నామని పేర్కొంటూ బెదిరింపు సందేశాలు వచ్చినట్టు పోలీసులు తెలిపారు. లష్కర్ ఏ జిహాదీ అనే ఖాతా నుంచి ఈ బెదిరింపు వచ్చిందని, 14 మంది పాక్ ఉగ్రవాదులు ఇప్పటికే భారత్‌లోకి చొరబడినట్టు కూడా అందులో పేర్కొన్నారని వివరించారు. కాగా, బెదిరింపు సమాచారంతో ముంబై పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు బలగాలను అప్రమత్తం చేశారు. అన్ని కోణాల నుంచి విచారణ జరుపుతున్నారు. నగరంలోని కీలక ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను మోహరించారు. అనుమానాస్పద వాహనాలను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. మరో ఘటనలో, మహారాష్ట్రలోని థానే జిల్లాలో బాంబు బెదిరింపు చేసిన 43 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసారు. నిందితుడిని రూపేల్ మధుకర్‌గా గుర్తించినట్టు గవర్న్‌మెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. కల్వ రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టినట్టు ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు ఇతని నుంచి పోలీస్ హెల్ప్‌లైన్‌కు సమాచారం వచ్చింది. అయితే ఈ బెదిరింపు ఉత్తదే అని తేలింది. గత నెలలో గిర్‌గావ్‌లోని ఇస్కాన్ ఆలయానికి కూడా ఇలాంటి బాంబు బెదిరింపే వచ్చింది. ఆలయం ఆవరణలో బాంబులు పెట్టినట్టు టెంపుల్ ఆఫీస్ ఈమెయిల్ ఐడీకి మెసేజ్ వచ్చింది. ఆలయ నిర్వాహకులు పోలీసులను అప్రమత్తం చేయడంతో బాంబు డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్ అర్ధరాత్రి సోదాలు జరిపింది. అయితే పేలుడు పదార్థాలు ఏవీ ఆవరణలో కనబడకపోవడంతో ఉత్తుత్తి బెదిరింపుగా తేలింది. గత మేలో కూడా మహారాష్ట్ర సెక్రటేరియట్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. 48 గంటల్లో పేలుతుందంటూ హెచ్చరికలు రావడంతో గాలింపు చర్యలు చేపట్టగా ఎలాంటి అనుమానాస్పద వస్తువు కనిపించలేదు. ఇటీవల కాలంలో నకిలీ బెదిరింపు కాల్స్ ఎక్కువవుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. స్కూళ్లు, విమానాశ్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో బాంబులు పెట్టినట్టు మెయిల్స్ వస్తున్నాయి. అయితే ఈ బెదిరింపులు ఉత్తవే అని తేలుతున్నాయి. గత మేలో ముంబై ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం, తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్‌కు సైతం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.



# సైనిక దళాలకు హైపర్ సోనిక్ క్షిపణులు, అణుశక్తి యుద్ధ నౌకలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత సైనిక దళాలకు అత్యాధునిక ఆయుధాలను అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికను మోడీ సర్కార్ ఆవిష్కరించింది. దాదాపు 15 ఏళ్ల వ్యవధిలో ఈ లక్ష్యాలను పూర్తి చేసేలా రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. ఇందుకోసం భారీ మొత్తంలో వెచ్చించేందుకు సిద్ధమైంది. కనీసం 500కు తగ్గకుండా హైపర్‌సోనిక్ క్షిపణులను దళాలకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విజన్ డాక్యుమెంట్ ప్రకారం పాత టి-72 యుద్ధట్యాంక్‌లను 1800 అత్యాధునిక ఫ్యూచర్ ట్యాంక్‌లతో భర్తీ చేయనున్నారు. మరో 400 తేలికపాటి ట్యాంక్‌లను దళాలకు అందించనున్నారు. ట్యాంక్‌పై నుంచి ప్రయోగించే 50,000 యాంటీ గైడెడ్ మిస్సైల్స్, 6,00,000 శతఘ్ని గుండ్లు, మానవ రహిత విమానాలను సమకూర్చుకోనుంది. వీటితో పాటు 700 రోబోటిక్ కౌంటర్ ఐఇడి సిస్టమ్‌లను రంగంలోకి దించాలని నిర్ణయించింది. ఇక నౌకాదళంకోసం సరికొత్త ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, 10అత్యాధునిక ఫ్రిగెట్‌లు, 7 అడ్వాన్స్‌డ్ కార్వెట్టీలు, 4 ల్యాండ్ డాక్ ప్లాట్‌ఫారమ్స్, హెలికాప్టర్‌లకు ప్లాన్ చేస్తోంది. వీటితోపాటు అణుశక్తితో నడిచే యుద్ధనౌకలు, ఎలక్ట్రోమాగ్నెట్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# ఉక్రెయిన్‌కు సహకరించే వారే లక్ష్యం: పుతిన్



**మాస్కో, సెప్టెంబరు 5:** ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశంలో తమ దళాలను మోహరించే ఏ దేశాలనైనా తమ సైన్యం లక్ష్యంగా చేసుకుంటుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న సమయంలో తమకు వ్యతిరేకంగా నిలిచే దేశాలను చట్టబద్ధమైన లక్ష్యాలుగా చేసుకునే అధికారం తమకు ఉంటుందన్నారు. ఇటువంటి బలగాల మోహరింపు దీర్ఘకాలిక శాంతికి అనుకూలంగా ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశారు. పశ్చిమ దేశాలతో ఉక్రెయిన్‌కు ఉన్న సన్నిహిత సైనిక సంబంధాలు ఇరుదేశాల మధ్య సంఘర్షణకు మూలకారణమని వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధయయ శాంతి చర్చలు ఫలించి యుద్ధం ఆగిపోతే, ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశంలో ఇతర దళాలను మోహరించాల్సిన అవసరం ఏముంటుందని పుతిన్ ప్రశ్నించారు. దీర్ఘకాలిక శాంతికి దారితీసే నిర్ణయాలు తీసుకుంటే.. అసలు ఉక్రెయిన్‌లో ఇతర దళాలు మోహరించాల్సిన అవసరమే ఉండదన్నారు. తాము చేసుకున్న ఒప్పందానికి రష్యా కట్టుబడి ఉంటుందని తెలిపారు. 26 ఐరోపా దేశాల నేతలు గురు వారం పారిస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో సమావేశమైన నేపథ్యంలో పుతిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

06-09pg6exHMNWJQEP 10_06-09pg6exHMNWJQEP.qxd 9/6/2025 12:37 AM Page 1



# రెడ్ బుక్ రాజ్యాంగంతో కక్షపూరిత రాజకీయాలు

## అరెస్టు చేసి రోజులు గడుస్తున్నా కేసు ట్రయిల్ ఎక్కడ? : మాజీ స్పీకర్ తమ్మినేని, మార్గాని



**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో సెప్టెంబర్ 5** (ప్రభాతవార్త): చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరిట కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఎంపీ, వైస్సార్ సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ లు విమర్శించారు. సెంట్రల్ జైలులో రిమాండ్ లో ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిని కలవడానికి వచ్చిన ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్, కర్ణాటకకు చెందిన శాసనసభ్యులు ఎన్.ఆర్ విశ్వనాథన్, సి. విష్ణు రెడ్డి లతో కల్సి సెంట్రల్ జైలు బయట మీడియాతో మాట్లాడారు. విపక్షంలో ఉన్నపుడు ప్రస్తుత లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ రాష్ట్రంలో తిరిగారని, అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ఏవిధంగా నడుపుతున్నారో అందరూ చూస్తున్నారని అన్నారు. మిథున్ రెడ్డిని అరెస్టు చేసి సుమారు 45రోజులు, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలను అరెస్టు చేసి వందరోజులు, చెవిరెడ్డి భాస్కర రెడ్డిని అరెస్టు చేసి 80రోజులు అయిందని ప్రస్తావించారు. అసలు ఈ కేసులు ఎప్పుడు ట్రయిల్ చేసారని వారు ప్రశ్నించారు. మనీ ట్రయిల్ ఎలా జరిగింది, ఎక్కడ జరిగింది అనేది ఏది తేల్చకుండా కేవలం జైలులో పెట్టాలనే ఉద్దేశ్యంతోనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని భరత్ విమర్శించారు. చంద్రబాబు కంటే ఎక్కువ రోజులు మిదున్ రెడ్డిని జైలులో పెడితే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీద కక్ష తీర్చుకున్నట్లు అవుతుందన్న భావన కన్పిస్తోందని ఆయన వాపోయారు. రేపొద్దున మా ప్రభుత్వం వచ్చాక, దీనిపై పూర్తిస్థాయి విచారణ ఉంటుందని, చేసిన వ్యవహారాలకు శిక్షార్హులు అవుతారఅన్నారు. రైతులకు యూరియా అందించే విధానంపై సోషల్ మీడియాలో పోస్టులు పెడితే, నాన్ బెయిల్ బుల్ సెక్షన్లతో అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎల్లకాలం చంద్రబాబు ప్రభుత్వం ఉండదని గుర్తుపెట్టుకోవాలన్నారు.

తప్పులకు మూల్యం చెల్లించక తప్పదని స్పష్టంచేసారు.

# దుర్గమ్మ ఆలయంలో మంచినీటి ప్లాంట్ ఏర్పాటు



ఇన్‌కంటాక్స్ కమీషనర్‌కు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త** దుర్గమ్మ ఆలయంలో రు.30లక్షల విలువైన రెండు మంచినీటి ప్లాంట్లను ఇఓ వికె శీనా నాయక్ దంపతులు శుక్రవారం ప్రారంభించారు. దివిస్ ల్యాబొరెటరీస్ సహకారంతో ఈ ప్లాంట్లను ఒకటి అద్దాల మండపం సమీపాన, మరోటి కొత్త పూజా మండపాల వద్ద ఏర్పాటు చేశామన్నారు. దివిస్ ల్యాబ్ వారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం రు.80లక్షలతో ఐదు ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి దివిస్ లాబొరేటరీస్ వారు ముందుకొచ్చి, గతంలో రెండు ప్లాంట్లను పూర్తిచేసి భక్తులకు అందుబాటులో వుంచారన్నారు. మరో ప్లాంట్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వైదిక కమిటీ, దివిస్ లేబ్స్ ప్రతినిథులు బి కిషోర్ కుమార్, సిహెచ్ శ్రీనివాసులు, ఎస్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఇఓ వికె శీనా నాయక్ శుక్రవారం పరిశీలించారు. హైవే రోడ్డు వద్ద కొత్తగా ఖాళీ చేసిన స్థలంలో నిర్మాణంలో వున్న భవనంలో సమాచార కేంద్రం, వృద్దులకు విశ్రాంతి మందిరం ఏర్పాటు చేయాలన్నారు. అక్కడినుండి వృద్దులను దుర్గమ్మ ఆలయానికి బ్యాటరీ వాహనాల ద్వారా తీసుకురావాలన్నారు. అన్నదాన భవనం, లడ్డూపోటు లను ఇఓ పరిశీలించి, ప్రసాదం నాణ్యత, పంపిణీ లో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని ఎఇఓ వాసుకు ఆదేశాలిచ్చారు. కొత్త భవనాల్లో అన్నదానం, ప్రసాదం పోటు లలో మురుగునీటి వ్యవస్తను పరిశీలించారు. పరిశుభ్రతలో లోపం వుండరాదన్నారు. కనకదుర్గానగర్లో ప్రసాద విక్రయ కేంద్రాలను పరిశీలించి భక్తులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త బిల్డింగ్‌లో అన్నదానం ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అన్నదాన విభాగ ఏఇఓ బివి రెడ్డికి ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇఓతో పాటు ఇంజనీర్2 పి రాంబాబు, ఇతర డిఇ, ఏఇ, అదికారులు పాల్గొన్నారు. దుర్గమ్మవారిని ఏపి, తెలంగాణ ఇన్‌కంటాక్స్ కమీషనర్ ఎం అనిల్ కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఇఓ వికె శీనా నాయక్ శ్రీ అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



## జీవితమంతా నా గురువు సిఎం చంద్రబాబు :మంత్రి నారా లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** జీవితమంతా తనకు గురువు అని సీఎం చంద్రబాబు అని మంత్రి నారా లోకేష్ తెలిపారు. సీఎం చంద్రబాబు చేసిన తొలి సంతకం మెగా డీఎస్సీ అని ఆయన గుర్తు చేశారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిగా ఆయన పాల్గొన్నారు. టీచర్ల అందరిని చూసినప్పుడు స్కూల్ డేస్ గుర్తుకు వస్తున్నాయని పేర్కొన్నారు. తనది బ్యాక్ బెంచ్.. గోడ బ్యాచ్ అయినా తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి వెళ్లానని.. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను లోకేశ్ గుర్తుకు తెచ్చుకున్నారు. ఇంటర్ మీడియట్‌కు వచ్చినప్పుడు మంత్రి నారాయణ తనకు బ్రిడ్జి కోర్సు నేర్పించారని మంత్రి లోకేశ్ తెలిపారు. రాజ్‌రెడ్డి తనను గైడ్ చేశారని చెప్పారు. ఫీల్డ్‌లో మంచిగా పనిచేస్తున్న ఉపాధ్యాయులతో వారానికి ఒకరితో కుర్చోని మాట్లాడినట్లు పేర్కొన్నారు. ప్రైవేటు స్కూల్ లలో బ్యాగులు, పుస్తకాలకు డబ్బులు ఖర్చు చేయాలని అన్నారు. అదే ప్రభుత్వ పాఠశాలలో అన్ని ప్రభుత్వమే అందిస్తుందని స్పష్టం చేశారు. కొన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు అయిపోయాయి.. అనే బోర్డులు కనిపించాయని హర్షం వ్యక్తం చేశారు. పిల్లలు ఎక్కడ వెనుకబడి ఉన్నరో తెలుసుకునేలా రిపోర్టు కార్డు రూపొందించి ఇచ్చామని వివరించారు. మంత్రిత్వ శాఖల విషయంలో విద్యాశాఖ వద్దు.. అని ఐటీ, ఇండస్ట్రీస్, ఎనర్జీ వంటివి తీసుకోవాలని సూచించారని పేర్కొన్నారు. కానీ తను విద్యా శాఖ కావాలని తీసుకున్నట్లు చెప్పుకొచ్చారు. ఉపాధ్యాయ సంఘాలతో అనేకమార్లు కూర్చుని సంస్కరణలు తెచ్చామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఇక రాబోయే నాలుగు సంవత్సరాలు సంస్కరణలు ఉండవని స్పష్టం చేశారు. లీప్ మోడల్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రైమరీ స్కూళ్లలో 33 శాతం వన్ క్లాస్ వన్ టీచర్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# వైభవోపేతంగా మొహమ్మద్ ప్రవక్త 1500ల వసంతోత్సవం

## - ఆనందోత్సాహాలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 5,ప్రభాతవార్త** మహమ్మద్ ప్రవక్త 1500ల జయంతి ఉత్సవం, మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఆనందోత్సాహాలతో, అంరగంగ వైభవంగా ఘనంగా జరిగాయి. గుంతకల్లు రైల్వే ప్రాంతాల్లోని మిస్కినాబాద్, రైల్వే స్టేషన్ రోడ్డులోని జామియా మసీదులతో పాటు రైల్వే కుటుంబాలు అధికంగా ఉండే ప్రాంతాలలో గురువారం సంధ్యా సమయం నుండి శుక్రవారం సాయంత్రం సంధ్యా సమయం వరకు ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో అత్యంత ప్రధానమైన, కీలకమైన మహమ్మద్ ప్రవక్త పవిత్ర కేశాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఆనందోత్సహాలతో తిలకించారు. ఈ సందర్భంగా ఆయా మసీదులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. స్థానిక మిస్కినాబాద్‌లోని హజరత్ సయ్యద్ గులాం షా ఖాద్రి బాబా దర్గా షరీఫ్ నుంచి ప్రధాన మార్గాల మీదుగా హజరత్ సయ్యద్ అలీ అక్బర్ ఉరఫ్ మస్తాన్‌వలీ బాబా దర్గా షరీఫ్ వరకు వేలాది మందితో భారీగా ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పవిత్రమైన మక్కా, కాబతుల్లా, మదీనా, అజ్మీర్ దర్గా షరీఫ్ తదితర నమూనాలతో రూపొందించిన ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పట్టణ ఖాజీలు రజాక్ ఖాద్రీ అబ్దుల్ సత్తార్ లతీఫీ, అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ అధ్యక్షులు సయ్యద్ జాఫర్, కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదులను, ప్రధాన రోడ్లను విద్యుత్ దీపాలతో వివిధ రకాల నమూనాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. కులమతాలకు అతీతంగా సోదరభావంతో ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా డిఎస్‌పి శ్రీనివాసులు ఆద్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఎపి, తెలంగాణలో మారుతి సుజుకి కొత్త ఎస్‌వియు విక్టోరియస్ ఆవిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త** :మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) తన కొత్త ఎస్‌యువి విక్టోరియస్‌ను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల కోసం హైదరాబాద్‌లోని ఒకహోటల్‌లో గ్రాండ్ రీజినల్ అన్‌వీలింగ్ చేసింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ కార్పొరేట్ సంస్థల నేతలు, ఫైనాన్షియర్లు, లీజింగ్ భాగస్వాములు, అలాగే డీలర్ ప్రతినిధులు హాజరయ్యారు. అందరి సమక్షంలో ఈ కార్యక్రమం గాట్ ఇట్ ఆల్ ఎస్‌యువిగా నిలిచే కొత్త విక్టోరియస్ ఆవిష్కరణ జరిగింది. కార్పొరేట్స్, ఫైనాన్షియర్లు, డీలర్ భాగస్వాములకు ప్రత్యేక ప్రదర్శన చేశారు. విక్టోరియస్ కోసం ఏపి, తెలంగాణ మార్కెట్లలో ఉన్న భారీ ఆసక్తి ఉత్సాహం ప్రతిబింబించిన సందర్భంగా నిలువనుంది. భారతదేశంలో ఎస్‌యువి అనుభవాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లడానికి విక్టోరియస్ ప్రత్యేకంగా రూపుదిద్దుకుంది. 8స్పీకర్ ప్రీమియం ఇన్ఫినిటీ బై హర్మాన్ సరౌండ్ సౌండ్ సిస్టమ్ తో డాల్బీ ఆట్మోస్‌తో 5.1 థియేటర్ ఆన్ వీల్స్ అనుభవం, 10.1 స్మార్ట్ ప్లే ప్రొ ఎక్స్ టచ్ స్క్రీన్, ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టం, జెశ్చర్ కంట్రోల్ పవర్డ్ టెయిల్‌గేట్, 64కలర్ అంబియెంట్ లైటింగ్ – అదనపు సౌకర్యంగా ఉంది.




అధునాతన సేఫ్టీ ఫీచర్లు – లెవెల్ 2 ఏడిఏఎస్, 6 ఎయిర్‌బ్యాగ్‌లు, హెచ్‌డీ 360 వ్యూ కెమెరా బహుళ పవర్‌ట్రైన్ ఆప్షన్లు – స్ట్రాంగ్ హైబ్రిడ్ ఈవి నిజు మోడ్‌తో, పెట్రోల, ఎస్ సిఎన్‌జి టెక్నాలజీతో అందుబాటులో ఉండనుంది.

# వరుస సెలవులతో భారీగా పెరిగిన భక్తులు

## - వెంకన్న దర్శనానికి 26గంటలు

**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** దసరా సెలవులకు ముందే వరుసగా మూడురోజులు సెలవులు రావడం...వారాంతం కావడంతో శుక్రవారం ఉదయానికే తిరుమల భక్తజనసంద్రంగా మారింది. గోవిందుని దర్శనానికి భక్తులు భారీగా చేరుకుంటున్నారు. ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్ లలోని అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల రెండు కిలోమీటర్లు క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 26గంటలు సమయం పైగానే పడుతోంది. టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులకు 10గంటలు దర్శనం సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఎనిమిదిగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు 43వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి.

# ఆరోగ్యశ్రీ పథకంతో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన వైఎస్ఆర్

## - బిపిపి విధానంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ దుర్మార్గం : వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త బ్యూరో** ఆరోగ్యశ్రీ పథకాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చి దేశానికే రోల్ మోడల్‌గా పథకాన్ని అందించారని వైఎస్ఆర్‌సిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. పేదలకు కార్పోరేట్ వైద్యాన్ని చేరువ చేయడానికి డా.వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొస్తే ఆయన తనయుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఆ పథకానికి మెరుగులు దిద్దడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వైద్య విద్యకు పెద్ద పీట వేస్తూ 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. వైసిపి హయాంలోనే ఐదు కళాశాలలను ప్రారంభించి 750 ఎంబిబిఎస్ సీట్లను అందుబాటులోకి తెచ్చారన్నారు. అయితే ప్రైవేట్ మెడికల్ కళాశాలలను తమ అనునాయిలకు కట్టబెట్టేందుకు క్యాబినెట్‌లో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడానకిఇ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ప్రైవేట్ పరానికే ప్రాధాన్యత ఇస్తుంటారని విమర్శించారు. మెడికల్ క ళాశాలను ప్రైవేట్ పరం చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని లేని పక్షంలో ప్రజా సంఘాలు, ఇతర పార్టీలతోకలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. అదే విధంగా రైతుల విషయంలో సైతం చంద్రబాబు ప్రభుత్వం దుర్మార్గ కరంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత ఏడాది ఖరీఫ్, రబి సీజన్‌లలో అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతిన్నా ఇన్సు రెన్స్, ఇన్‌పుట్ సబ్సిడి అందించలేదని విమర్శించారు. కూటమి పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం గురించి ఆలోచించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వంలో విత్తనం నుంచి ఎరువుల వరకు రైతులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శించారు. రైతాంగ సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నించినా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, పత్రికల్లో కథనాలు వచ్చినా ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి బెదిరిస్తారా అని ఆయన ప్రశ్నించారు. యూరియాను డిస్ట్రి బ్యూటర్లే అధికారులు, ప్రజా ప్రతినిధుల అండతో బ్లాక్ మార్కెట్‌కు తరలించారని విమర్శించారు. నేడు చిన్న వ్యాపారులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నారని బ్లాక్ మార్కెట్‌కు తరలించిన డిస్ట్రిబ్యూటర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. అన్నదాత పట్ల



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

ప్రకృతి చిన్న చూపు చూస్తే ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. హెచ్ఎల్‌సికి నీరు వస్తున్నా నార్త్, సౌత్ కెనాల్‌కు నీరు విడుదల చేయడం లేదని ఆయన విమర్శించారు. తక్షణమే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాతల పట్ల కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యతిరేక విధానాలపై వైఎస్ఆర్‌సి ఆధ్వర్యంలో అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో 9వ తేది ర్యాలీలు చేపట్టి ఆర్డిఓలకు వినతిపత్రాలు అందించడం జరుగుతుందన్నారు.

అనంతరం నగరంలో జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నుంచి ఆర్డిఓ కార్యాలయం వరకు ర్యాలీని కొనసాగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డిఉన్నారు.


# కాఫీ రైతుల సహకారంతో కాఫీ బెర్రీ బోరర్‌నిర్మూలించవచ్చు

**కాఫీ బెర్రీ బోరర్ గుర్తించిన వెంటనే అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలిడ్వామా ప్రాజెక్ట్ అధికారి డా. విద్యాసాగర్**

పాడేరు / అరుకువేలి, సెప్టెంబర్ 05: కాఫీ రైతుల సహకారంతో కాఫీ బెర్రీ బోరర్ నిర్మూలించవచ్చు, కాఫీ బెర్రీ బోరర్ గుర్తించిన వెంటనే అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలని డ్వామా ప్రాజెక్ట్ అధికారి డా. విద్యాసాగర్ అన్నారు. డ్వామా ప్రాజెక్టు అధికారి శుక్రవారం అరకువ్యాలీ మండలం పాకనకుడ్డి గ్రామంలో కాఫీ బెర్రీ బోరర్ సోకి నష్టపోయిన కాఫీ రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ చినలబుడు గ్రామపంచాయతీ పకనకుడి 29 ఎకరాలు, మలివలస 29 ఎకరాలు, మలసింగారం 07 ఎకరాలు, చినలబుడు 05 ఎకరాలు, తురాయికీయిడ 02 ఎకరాలకు సోకినట్లు గుర్తించడం జరిగిందన్నారు. కాఫీ బెర్రీ బోరర్ గుర్తించిన వెంటనే అరికట్టే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, కాఫీ బెర్రీ బోరర్ సోకిన ప్రాంతం నుండి ఎంత వరకు ఇన్ఫెక్షన్ ఏరియా గుర్తించి జోన్ ల వారిగా రెడ్, ఎల్లో, బ్లూ ఫ్లాగ్స్ ఏర్పాటు చేసి జోన్ ల వారిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాఫీ ఫీల్డ్ ఫంక్షనరీ సూచనల మేరకు కాఫీ బోర్డు కెజి కాఫీ కి రూ.50/ నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని, అలాగే పూడ్చిపెట్టే ఖర్చు మరియు ఇతర ప్రయోజనాల కోసం ఎకరానికి రూ.5,000/ చెల్లించడం జరుగుతుందన్నారు. కాఫీ తోటకి పట్టిన పురుగుని నాశనం చేయాలన్నారు. లేకపోతే కాఫీ ఉత్పత్తి తగ్గుతుందన్నారు. కాఫీ పంటలో వచ్చిన పంటను తీసి వేడినీటిలో ఉడకబెట్టి దానిని మట్టిఖిలో పూడ్చాలన్నారు. లేకపోతే ఆ పురుగు విస్తరించి మరింత నష్టాన్ని కలిగిస్తుందన్నారు. నష్టపోయిన రైతులు ఎవరూ కలత చెందవద్దని నష్టపరివారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కాఫీ బోర్డు సహాయసంచాలకులు బొంజుబాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నందా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# కేంద్ర మంత్రి అమిత్‌షాకు ఆర్డిటి విషయంలో వినతిపత్రం సమర్పించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు

**అనంతపురం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త బ్యూరో** కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌టిఎ ప్రభుత్వానికి తెలుగు దేశం పార్టీ మద్దతు ఉందా లేదా అన్నది అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో భారతీయ జనతా పార్టీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో కీలకంగా ఉన్న తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోంది. బిజెపికి, తెలుగుదేశం పార్టీకి కొండంత అండగా నిలబడుతోంది ఈ నేపథ్యంలో కరువులకు నిలయమై అత్యంత వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపుబడిన అనంతపురం జిల్లాలో దశాబ్దాల కాలం నుంచి ఎన్నో సేవలు అందిస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సంస్థ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డిటి)కి ఎఫ్‌సిఆర్ఏ అనుమతులు ఇచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తున్నా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎందుకు మిన్నకుండి పోయింది..? నెల రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లి ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపిలు కేంద్రాన్ని మొరపెట్టుకున్నా.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను కలిసినా ఇంతవరకు అతీగతి కనిపించడం లేదు. వారం రోజుల్లోపు తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారని ఆగస్టు మొదటి వారంలో ఢిల్లీకి వెళ్లిన ఎమ్మెల్యేలు, ఎంపిలు చెబుతూ వచ్చారు. ఇంత వరకు ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఏ అనుమతులు ఇచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఏ అనుమతులు వస్తాయా లేదా రాబోయే కాలంలో



ఆర్డిటి తన కార్యకలాపాలను శ్రీలంక, తదితర దేశాలకు తరలి పోవాల్సిందేనా అని జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తి అయిన సందర్భంగా అనంతపురం నగరంలో రాష్ట్ర స్థాయి బహిరంగ సభను లక్షలాది మందితో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టిడిపి, జనసేన, బిజెపి నేతలు గత వారం రోజులుగా అనంతపురంలోనే తిష్ట వేసి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారాలోకేష్ లాంటి అతిరథ మహారథులు ఈ బహిరంగ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. అన్ని రాజకీయ పార్టీల నుంచి ముఖ్య ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ సభలో సూపర్‌సిక్స్ హామీలకు సంబంధించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశామని ప్రజలకు చాటి చెప్పేందుకు కూటమి ప్రభుత్వం అనంతపురం బహిరంగ సభ వేదిక ద్వారా ప్రజలకు వివరించబోతోంది. ఈ నేపథ్యంలో నాలుగైదు దశాబ్దాల కాలం నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డిటి) ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేసిందని, ప్రస్తుతం ఎఫ్‌సిఆర్ఏ అనుమతులను నిలుపుదల చేయడం వల్ల విదేశాల నుంచి ప్రతియేటా వచ్చే 350 నుంచి 500 కోట్ల రూపాయలు నిధులు ఆగిపోయాయని, కూటమి ప్రభుత్వం చొరవతో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కొత్తగా ఎఫ్‌సిఆర్ఏ అనుమతులను ఇప్పించామని అనంతపురంలో ఈ నెల 10వ తేదిన జరిగే బహిరంగ సభలో కూటమి ప్రభుత్వ ముక్యులు ప్రకటించబోతున్నారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఏ అనుమతులను నిలుపుదల చేసిన నేపథ్యంలో కొత్తగా ఎఫ్‌సిఆర్ఏ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం ఒక ఎత్తు అయితే, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపిలు చొరవ తీసుకుని, కేంద్ర హోం శాఖ మంత్రి.

# కవిత విషయంలో ఆచితూచి అడుగులేస్తున్న బిఆర్ఎస్ అధినాయకత్వం

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కెసిఆర్ గణపతి హోమం కెసిఆర్ మా బాస్ : మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** భారత రాష్ట్రసమితి (బిఆర్ఎస్) నుంచి ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేశాక కూడా బిఆర్ఎస్ నాయకత్వంపై విమర్శల దాడులు కొనసాగిస్తున్నప్పటికీ బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు, మాజీఎంపి సంతోష్‌రావు ఎలాంటి ప్రతి విమ ర్శలు చేయకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావును.. కవిత వివాదాస్పద వ్యాఖ్యలపై స్పందించాలని కోరినా ఆయన నిరాకరించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన ట్విట్టర్ హ్యాండిల్ నుంచి కారు గుర్తును, కెసిఆర్ పక్కన తాను కూర్చొని ఉన్న ఫోటోను తొలగించారు. బయోలో ఇంతకు ముందు ఎమ్మెల్సీ ఉండగా దానిని సైతం తొలగించారు. మాజీ ఎంపి తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలుగా మాత్రమే పెట్టుకొన్నారు. కెసిఆర్ కుటుంబం మౌనంగా ఉన్నప్పటికి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ మంత్రులు మీడియా సమావేశం వేదికగా కవిత వైఖరిని తప్పుపడుతున్నారు. ఇరువైపులా సోషల్ మీడియా బృందాలు ఆసక్తికరమైన పోస్టులు చేస్తూ బిఆర్ఎస్ రాజకీయాలపై ఉత్కంఠత కలిగిస్తున్నారు. కవిత తన కూతురు పుట్టిరోజు సందర్భంగా ఇంట్లోనే పూజలు చేసి కేక్ కట్‌చేశారు. ఆనవాయితీగా జూబ్లిహిల్స్ పెద్దమ్మగుడిలో పూజలు నిర్వహించాల్సి ఉండగా ఈ యేడు గుడికి పోనట్లు తెలిసింది. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎర్రవెల్లిలోని తన వ్యవసాయక్షేత్రంలో గణపతిహోమం చేశారు. గత ఐదురోజులుగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిరామరావు, మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి ఇతర నాయకులు అక్కడే ఉన్నారు. తెలంగాణజాగృతి నాయకులు కూడా కవితను విబేధిస్తూ విమర్శలు చేస్తున్నారు.

కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఏకంగా ప్రెస్‌మీట్‌లో కవితకు మతిభ్రమించిందని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం లండన్‌లో పర్యటిస్తున్న హరీష్‌రావు అక్కడి బిఆర్ఎస్ నేతలతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ బిఆర్ఎస్‌కు ఆటుపోట్లు కొత్తేమి కాదన్నారు. కేసులకు భయపడని చరిత్ర గులాబి శ్రేణులదని, బిఆర్ఎస్‌కు ఎప్పటికైనా సుప్రీం కెసిఆర్ అని తెలిపారు. పార్టీలో సొంత నిర్ణయాలు ఉండవని కలిసికట్టుగానే నిర్ణయాలు తీసుకొని పనిచేయడం ప్రజాసేవచేడం కెసిఆర్ తమకు నేర్పారని ఆయనతెలిపారు. రేవంత్ ప్రభుత్వం ఎంక్వైరీలతో డైవర్షన్ రాజకీయాలతో పాలనను గాలికి వదిలేసిందని అన్నారు. హరీష్‌రావు కాళేశ్వరంలో అవినీతికి పాల్పడ్డారని తమ కుటుంబాన్ని చీల్చడానికి కుట్రలు చేశారని ఆరోపించడంతోపాటు ఫ్లైట్‌లో రేవంత్ కాళ్లు హరీష్ పట్టుకొన్నారని కవిత చేసిన వ్యాఖ్యలకు మీడియా ప్రశ్నించినా ఆయన ఇండియాకు వెళ్లాక మాట్లాడుతానని చెప్పారు. ఆయన వ్యక్తిగత సిబ్బంది కూడా తరువాత మాట్లా డుతారని మీడియాను బుజ్జగించారు. శనివారం హైదరాబాద్‌కు రాగానే నేరుగా ఎర్ర వెల్లి ఫామ్‌హౌజ్‌కు వెళ్లి కెసిఆర్‌తో సమావేశం కాబోతుండటంతో ఉత్కంఠత నెల కొంది. కాళేశ్వరం మూడు పిల్లర్లు కుంగితే రాద్ధాంతం చేస్తున్నారని ప్రభుత్వంపై ఆయన లండన్‌లో విరుచుకుపడ్డారు. ఏడాదిన్నర నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయడం లేదని, హైడ్రా వల్ల నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ కుప్ప కూలిందని అన్నారు. తెలంగాణకు ఎన్నారైలు పెట్టుబడి పెట్టేందుకు వెనుకాడు తున్నారని ఆయన ఆవేదన చెందారు. తెలం గాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని రాసిపెట్టుకోండని కామెంట్ చేశారు. రేవంత్‌రెడ్డి పాలన చూశాక ప్రజలకు కెసిఆర్ విలువ ఏంటో తెలిసిందని అన్నారు. రాష్ట్రంలో అవినీతి విచ్చలవిడిగా రాజ్యమేలుతోందని తెలంగాణలో కాంగ్రెస్ వెనుకబడి పోతున్నదని ఆయన వ్యాఖ్యానించారు.

6-9P□g7exHMNWJQE 11_6-9P□g7exHMNWJQE.qxd 9/6/2025 12:35 AM Page 1



# కన్ఫర్మ్‌డ్ ఐఏఎస్‌లుగా సీనియర్ అధికారులు

### కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** వివిధ శాఖల్లో పనిచేస్తున్న పలువురు సీనియర్ అధికారులను కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా పదోన్నతి కల్పించేందుకు తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది. రాష్ట్రంలోని ఒకే సారి 21 మంది సీనియర్ అధికారులు స్టేట్ సర్వీస్ కేడర్, నాన్ స్టేట్ సర్వీస్ కేడర్‌కు కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా పదోన్నతి కల్పించేందుకు కసరత్తు పూర్తి చేసిన ప్రభుత్వం ఈ జాబితాను కేంద్రం అనుమతికి పంపించింది. రాష్ట్రంలో 2022 సంవత్సరానికి సంబంధించి 14 పోస్టులు, 2023 సంవత్సరానికి మూడు పోస్టులు, 2024 సంవత్సరానికి నాలుగు కన్ఫర్డ్ ఐఏఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి కోసం ఒక్కో పోస్టుకు ముగ్గురి పేర్ల చొప్పున కేంద్రంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ)కి రాష్ట్ర ప్రభుత్వం పంపింది. గతంలో కన్ఫర్డ్ ఐఏఎస్ ఎంపికకు యూపీఎస్సీ అధికారులు డీవోపీటీ పంపించిన జాబితాతో ఇంటర్వ్యూలు చేసి ఎంపిక చేసేవారు. కానీ ఈ సంవత్సరం నుంచి ఇంటర్వ్యూల విధానాన్ని ఎత్తివేశారు. దీంతో డీవోపీటీకి పంపించిన మూడు పేర్లలో ఒక్కో పోస్టుకు ఒకరిని ఎంపిక చేస్తారు. సర్వీసు రిజిస్టర్, వారి ఉద్యోగ జీవితంలో సాధించిన విజయాలు, ఆరోపణలు, ఫిర్యాదుల తదితర వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కన్ఫర్డ్ ఐఏఎస్‌లకు ఎంపిక చేయనుంది.

# యూరియా అదనపు సేల్‌కౌంటర్లు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా యూరియా సరఫరా, వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రైతు వేదికల వద్ద అదనపు యూరియా సేల్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో మండలానికి ఒకటి లేదా రెండు సహకార సంఘాలు మాత్రమే ఉన్న ప్రాంతాల్లో రైతు వేదికలను వాడుకొని గ్రామాల వారీగా, పాస్ పుస్తకాల ఆధారంగా ఒక రోజు ముందుగానే టోకెన్లు జారీచేసి ఎరువులు అందించాలన్నారు. ఈ పంపిణీ ప్రక్రియలో ఎక్కడా అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్, విజిలెన్స్ తో కూడిన పర్యవేక్షణతో ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వానాకాలం సాగు విస్తారంగా సాగుతున్న ప్రస్తుత సమయంలో రైతులు యూరియా ఎరువుల కొరతను ఎదుర్కొంటున్నారని, వచ్చే 20 రోజుల్లో 2 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దీనికి కేంద్రం వెంటనే స్పందించి రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయించేందుకు అంగీకరించిందని పేర్కొన్నారు. దేశీయ తయారీ యూనిట్ల నుండి కూడా అదనంగా 30 వేల టన్నులు యూరియాను రాష్ట్రానికి కేటాయించడానికి కేంద్రం అంగీకరించినట్లు తెలిపారు. వచ్చే 3,4 రోజుల్లో రామగుండం యూనిట్ తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు చేపడతామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. ఈ రోజు రాష్ట్రానికి 11,181 టన్నుల యూరియా చేరిందని, రేపు మరో 9,039 టన్నులు రానుందని చెప్పారు. ఈ నెలలో నాలుగు రోజుల్లోనే రాష్ట్రానికి 28 వేల టన్నుల యూరియా సరఫరా అయిందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 8,20,112 టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని తెలిపారు.




# ఎపి, తెలంగాణలో మారుతి సుజుకి కొత్త ఎస్‌వియు విక్టోరియస్ ఆవిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) తన కొత్త ఎస్‌యువి విక్టోరియస్‌ను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల కోసం హైదరాబాద్‌లోని ఒకహోటల్‌లో గ్రాండ్ రీజినల్ అన్ వీలింగ్ చేసింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ కార్పొరేట్ సంస్థల నేతలు, ఫైనాన్షియర్లు, లీజింగ్ భాగస్వాములు, అలాగే డీలర్ ప్రతినిధులు హాజరయ్యారు. అందరి సమక్షంలో ఈ కార్యక్రమం గాట్ ఇట్ ఆల్ ఎస్‌యువిగా నిలిచే కొత్త విక్టోరియస్ ఆవిష్కరణ జరిగింది. కార్పొరేట్స్, ఫైనాన్షియర్లు, డీలర్ భాగస్వాములకు ప్రత్యేక ప్రదర్శన చేశారు. విక్టోరియస్ కోసం ఏపి, తెలంగాణ మార్కెట్లలో ఉన్న భారీ ఆసక్తి ఉత్సాహం ప్రతిబింబించిన సందర్భంగా నిలువనుంది.

భారతదేశంలో ఎస్‌యువి అనుభవాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లడానికి విక్టోరియస్ ప్రత్యేకంగా రూపుదిద్దుకుంది. 8స్పీకర్ ప్రీమియం ఇన్ఫినిటీ బై హామాన్ సరౌండ్ సౌండ్ సిస్టమ్ తో డాల్బీ అల్టోమోనస్ 5.1 థియేటర్ ఆన్ వీల్స్ అనుభవం, 10.1 స్మార్ట్ ప్లే ప్రొ ఎక్స్ టచ్ స్క్రీన్, ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టం, జెశ్చర్ కంట్రోల్ పవర్డ్ టెయిల్‌గేట్, 64కలర్ అంబియెంట్ లైటింగ్ – అదనపు సౌకర్యంగా ఉంది. అధునాతన సేఫ్టీ ఫీచర్లు – లెవెల్ 2 ఏడిఏఎస్, 6 ఎయిర్‌బ్యాగ్‌లు, హెచ్‌డీ 360 వ్యూ కెమెరా బహుళ పవర్‌ట్రైన్ ఆప్షన్లు – స్ట్రాంగ్ హైబ్రిడ్ ఈవి నిజు మోడ్‌తో, పెట్రోల, ఎస్ సిఎన్‌జి టెక్నాలజీతో అందుబాటులో ఉండనుంది.

# ధన, ధాన్య కృషి యోజనపై ఆశలు

### రాష్ట్రంలోని 5 జిల్లాల్లో అమలుకు యత్నం

### ఇప్పటికే కేంద్రానికి సర్కార్ ప్రతిపాదన

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** కేంద్రం తాజాగా ప్రకటించిన ప్రధాన మంత్రి ధనధాన్య కృషి యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేయడంపై రాష్ట్ర సర్కార్ ఆశలు పెట్టుకుంది. రాష్ట్రంలోని ఐదు జిల్లాలను ఈ పథకంలో చేర్చేలా వ్యవసాయ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే రాష్ట్ర సర్కార్ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. రాష్ట్రంలోని నారాయణపేట, ములుగు, ఆసిఫాబాద్, సంగారెడ్డి, కొత్తగూడెం జిల్లాలను చేర్పించేందుకు తీవ్ర యత్నాలు జరుగుతున్నాయి. కాగా దేశ వ్యాప్తంగా వ్యవసాయపరంగా వెనుకబడిన 100 జిల్లాల్లో రైతులకు చేయూతనిచ్చి దిగుబడులు పెంచడానికి కేంద్రం ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన పథకాన్ని కేంద్రం తాజాగా ప్రకటించింది. కేంద్రంలోని 11 మంత్రిత్వ శాఖల్లో అమల్లో ఉన్న 36 పథకాలను సమ్మిళితం చేసి ఈ పథకాన్ని అమలు చేయనుంది. రూ.24వేల కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. దీనికింద 1.7కోట్ల మంది రైతులకు ప్రయోజనం కల్పించేందుకు లక్ష్యంగా నిర్ణయించింది. పంటల మార్పిడి, సాగునీటి సౌకర్యాల కల్పన, నిల్వ సామర్థ్యం పెంపు, విలువ జోడింపు ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం దీని ప్రధాన లక్ష్యం. ఈ నేపథ్యంలో పూర్తిగా వర్షాలపై ఆధారపడిన తెలంగాణలోని ఐదు జిల్లాలను చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ జిల్లాల్లో పంటల ఉత్పాదకత చాలా తక్కువగా ఉంటోంది. వీటిని ధనధాన్య యోజనలో చేర్చితే ఆ జిల్లాల రైతులకు వ్యవసాయం గిట్టుబాటుగా మారుతుందని సర్కార్ చెబుతోంది.

# రైతుల కోసం వాట్సాప్ ఛానల్

### అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** వ్యవసాయ సమాచారం నిమిత్తం రైతుల కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ కొత్తగా వాట్సప్ ఛానెల్‌ను అందుబాటు లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఎప్పటికప్పుడు తెలంగాణ రైతాంగానికి కీలకమైన సమాచారం, సలహాలు, సూచనలను వ్యవసాయ శాఖ అందిస్తోంది. ప్రధానంగా వాతావరణ హెచ్చరికలు, పంటల వివరాలు, పురుగు మందులు, ఎరువుల వివరాలు సులువుగా రైతాంగానికి సమాచారం తెలియజేస్తున్నారు. ఈ వాట్సప్ఛానెల్ ఎలా వినియోగించుకోవాలి అనే విషయాన్ని తెలియజేడానికి అర్టిఫిషియలి ఇంటెలిజెన్స్ (ఎఐ)తో కూడిన వీడియోను కూడా సృష్టించింది. రైతులకు సాగు చేస్తున్న ఆయా పంటలకు తెగుళ్లు పడితే ఎలాంటి మందులు చల్లాలి, ఏం చేయాలి అనే విషయాలను ఆశాఖ సమాచారం ఇస్తుంది. రాష్ట్రంలో ప్రధాన పంటగా ఉన్న వరిలో పాముపొడ తెగులు, ఆకు ముడత నివారణ కోసం శాస్త్రవేత్తల సూచనల మేరకు చేపట్టాల్సిన చర్యలు వివరంగా ఇందులో పేర్కొంది. ఇక కంది, మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు కోసం వాడాల్సిన పురుగు మందులు, పత్తిలో జింక్ లోపం సవరణ, పచ్చదోమ నివారణ వంటి వాటికి ఎలాంటి చర్యలు చేపట్టాలి, ఉద్యాన వన పంటల విషయంలో సవాళ్లు, సమస్యలు ఎదురైతే రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలను అందిస్తుంది. మధ్య మధ్యలో రైతులకు వ్యవసాయానికి సంబంధించి క్విజ్ పోటీలను సైతం ఈ వాట్సప్ చానల్ లో నిర్వహిస్తున్నారు. రైతుల బీమా కు సంబందించిన సమాచారం, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలు, పంటల సంరక్షణ సీజనల్ సూచనలు, ఆయా పంటలకు కీటక నియంత్రణ మార్గదర్శకాలు. మార్కెట్ ధరలు, శిక్షణా కార్యక్రమాల అప్ డేట్లు ఇలా అన్ని వివరాలు అరచేతిలో వున్న సెల్ ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చని వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి తెలిపారు.

# విద్యాసంస్థలను తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రాధాన్యత

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



గురువారం టీచర్స్‌డే సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న రాంచందర్‌రావు తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** విద్యా సంస్థలను అభివృద్ధి దిశగా తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రాధాన్యత కల్పించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతి (ఉపాధ్యాయ దినోత్సవం) వేడుకల సందర్భంగా, ట్యాంక్‌బండ్ వద్ద ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాం చందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడు, దేశ రెండో రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరిం చుకుని ఉపాధ్యాయ దినోత్స వాన్ని జరుపు కుంటున్నాం అన్నారు. భారతదేశ నిర్మాణంలో, అలాగే విద్యావ్యవస్థలో అనేక మార్పులకు కారణమైన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయులను గౌర వించుకోవాలన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఉపాధ్యా యులకు, విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కనీసం వారి సమస్యలను, ఘోషను ప్రభుత్వం పట్టించు కోవాలని, ఇప్పటికీ ప్రభుత్వ ఉపాధ్యాయులు, టీచర్లకు సకాలంలో జీతాలు రావడం లేదని, రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగులకు పెన్షన్ల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిరక్ష ్యల్లి వహిస్తుందన్నారు. సమాజంలో భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతిఒక్కరి ధర్మం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా విశ్వవిద్యాలయాల ప్రగతికి, విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయాలకు వెయ్యి కోట్లు ఇస్తామని కేవలం ప్రకటనలు గుప్పించడం కాదు, ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సమస్యలకు చెక్

### ఫొటోల కష్టాలకు తెర.. ఒక్క క్లిక్‌తో యాప్‌లో అప్‌లోడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్త సౌకర్యం కల్పించింది. ఇకపై అధికారులు ఫొటోలు తీయకుండానే, లబ్ధిదారులే యాప్ ద్వారా ఇళ్ల చిత్రాలు అప్లోడ్ చేసే అవకాశాన్ని కల్పించారు. ఆ ఫొటోల ఆధారంగా బిల్లులు విడుదల చేస్తారు. ఈ విధానం వల్ల ఆలస్యం తగ్గి, లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందుతుంది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు దశలవారీగా నిధులు అందనున్న విషయం తెలిసిందే. ఈ కొత్త పద్ధతి పారదర్శకతను పెంచడమే కాకుండా, గ్రామీణ కుటుంబాల భాగస్వామ్యాన్ని కూడా పెంచుతుంది. తెలంగాణలో గృహ నిర్మాణ పథకాలలో ప్రధానమైనది ఇందిరమ్మ ఇళ్ల పథకం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు గృహ భద్రత కల్పిం చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. గతంలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించిన తర్వాత బిల్లులు రావడంలో ఆలస్యం ఎదుర్కొనడం సాధారణమైంది. దీనికి కారణం అధికారులు స్వయంగా స్థలానికి వెళ్లి ఇళ్ల ఫొటోలు తీసి నివేదిక పంపడంలో ఆలస్యం కావడంతో ఇప్పుడు ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వీపీ గౌతం ప్రకటన ప్రకారం.. ఇకపై లబ్ధిదారులే తమ ఇందిరమ్మ ఇళ్ల ఫొటోలు నేరుగా ప్రత్యేక యాప్‌లో అప్లోడ్ చేసే సౌకర్యం పొందనున్నారు. ఆ ఫొటోలు ఆధారంగా వెంటనే బిల్లులు విడుదల చేయబడతాయి. దీంతో ఎవరూ అధికారులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. సమయానికి సాయం అందు తుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరిగాయి. ఈ పథకం దశలవారీగా అమలు అవుతోంది. మొదటి దశలో ముగ్గులు పోసి.. బేస్ మట్టం వరకు లేపిన తర్వాత డబ్బులు జమ చేస్తారు. ఆ తర్వాత గోడలు కట్టిన తర్వాత ఫొటోలు పంపితే మొదటి వాయిదా వస్తుంది. మూడో దశలో పైకప్పు పూర్తయిన తర్వాత మరో విడత విడుదల అవుతుంది. చివరగా ఇంటి పనులు ముగిసిన తర్వాత తుది బిల్లు వస్తుంది. ఈ విధానంతో లబ్ధిదారులకు పారదర్శకతతో పాటు వేగవంతమైన ఆర్థిక సహాయం లభిస్తుంది. ఈ నిర్ణయం సొంత ఇంటి కలను నిజం చేసుకోవాలనుకునే వేలాది కుటుంబాలకు ఉపశమనం కలిగిస్తుంది. అయితే అధికారులు ఫొటోలు తీసేందుకు వెళ్లకపోవడం.. దీంతో బిల్లులు ఆలస్యం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి.

ఇక వీటిని చెక్ పడనుంది. గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్ ఉపయోగం పెరుగు తున్నందున, చాలామంది లబ్ధిదారులు ఈ కొత్త సదుపాయాన్ని సులభంగా వినియోగించగలరని అధికారులు అంచనా వేస్తున్నారు. పేద కుటుంబాల గౌరవాన్ని, భవిష్యత్తును కాపాడే ప్రయ త్నంలో భాగంగా దీనిని తీసుకొచ్చారు. తమ ఇంటిని తాము ఫొటో తీసి అప్లోడ్ చేయడం ద్వారా లబ్ధిదారులు ప్రభుత్వ పథకంలో భాగస్వామ్యులవుతారు. తద్వారా ఇందిరమ్మ ఇళ్లు పథకం మరింత పారదర్శకతతో ముందుకు సాగనుంది.

# కెసిఆర్ లేకుంటే బిఆర్ఎస్ ఉండదు: ఎంపి అసదుద్దీన్ ఒవైసి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు లేకుంటే ఆ పార్టీ మనుగడలో ఉండదని మజ్లీస్ పార్టీ అధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్య చేశారు. శుక్రవారం అసద్ తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ కెసిఆర్ అంటే తనకు గౌరవం ఉందన్నారు. కెసిఆర్ అంటేనే బిఆర్ఎస్, బిఆర్ఎస్ అంటేనే కెసిఆర్ అని ఆయన తెలిపారు. కెసిఆర్ లేకపోతే బిఆర్ఎస్ ఉండదని ఆయన చెప్పారు. అంతకుముందు అసద్ మహారాష్ట్ర కార్యవర్గంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముంబయి, పుణే, నాగ్‌పూర్, ఔరంగాబాద్,నాసిక్, ఔరంగాబాద్, పర్భనీ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీని మరింత బలో పేతం చేసుకునే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ దళితులు, మైనారిటీల సమస్యలపై పోరాటం ఉధృతం చేయాలని కార్యవర్గానికి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థుల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, నిజాయితీపరులను ఎంపిక చేయాలని, ఎన్నికైన తర్వాత పార్టీ ఫిరాయించని వారిని గుర్తించాలని ఆయన సూచించారు.

# మంత్రి సీతక్కతో నీట్ క్వాలిఫైడ్ విద్యార్థులు, తల్లిదండ్రుల భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ప్రజాభవన్‌లో శుక్రవారం మంత్రి సీతక్కను నీట్ క్వాలిఫైడ్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు కలిశారు. నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించినా సుప్రీంకోర్టు తీర్పు కారణంగా కౌన్సిలింగ్‌కు హాజరు కాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బిడ్డలమైనప్పటికీ కేవలం ఇంటర్మీడియట్ పొరుగు రాష్ట్రాల్లో చదవడం వల్ల తమ నష్ట పోతు న్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో పొరుగు రాష్ట్రంలో చదవడంతో 45 మంది నీటి విద్యార్థులు నష్టపోతున్నట్లు వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. క్వాలిఫైడ్ అయిన నీట్ విద్యార్థుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సీతక్క వారికి హామీ ఇచ్చారు. మంత్రి తమ సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.

### పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడలో

# ఓడిపోవడం ఖాయం

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణలో రాబోయే ఆరు నెలల్లో ఉప ఎన్నికలు వస్తాయని బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఓడిపోవడం ఖాయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావు జోస్యం చెప్పారు.ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, వందలాది కార్యకర్తలు శుక్రవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని, పోచారం ఎమ్మెల్యే పదవి పోయే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్ చేతిలో పెట్టామని కానీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలోనూ, గతంలో ఉన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలోనూ ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, తమకు పరిపాలన చేతకావడం లేదని, అన్ని కార్యక్రమాలను అమలు చేయలేమని నేరుగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 21 నెలల్లోనే ప్రజల నుంచి సంపూర్ణ వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. హామీల వైఫల్యం, నమ్మకద్రోహం ఒక కారణం అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల తీరు, వ్యవహార శైలి మరో ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిక్షణం కెసిఆర్ పేరు తలుచుకుంటూ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని నడపడం చేతగాక, గత ప్రభుత్వం అప్పులు చేసిందని కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం కేవలం రూ. 2.80 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేసిందని పార్లమెంట్ సాక్షి గా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని తెలిపారు. అయితే, ఈ 21 నెలల కాలంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 2.20 లక్షల కోట్ల పైగా అప్పులు చేసిందని, ఆ అప్పుతో ఏ ఒక్క సంక్షేమ పథకం లేదా అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వం సంవత్సరానికి రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తే, ఈ ప్రభుత్వం నెలకు రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తోందని ఆరోపించారు.

యూరియా సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు దారితీస్తోందని కెటిఆర్ అన్నారు. పంటల కొనుగోళ్లకు, ఆ తర్వాత వాటికి ఇవ్వాల్సిన బోనస్‌ను ఎగగొట్టాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే యూరియా సరఫరా చేయడం లేదని ప్రజలు భావిస్తున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగం, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత దుర్మార్గమైన ఆలోచన ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రవెల్లిలోని కెసిఆర్ నివాసంలో జరిగిన చేరికల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, వందలాది కార్యకర్తలు భారత రాష్ట్ర సమితిలో చేరారు. వీరిలో ఎంపిటిసి ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కోటగిరి వల్లేపల్లి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ బాన్సువాడ నార్ల రత్న కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొట్టె గజేందర్, మాజీ సర్పంచులు పద్మ మొగులయ్య, బంజా గంగారాం, కురలేపు నగేష్, మాజీ కోఆప్షన్ హకీమ్ తదితరులు ఉన్నారు.

# ఖేలో ఇండియా గేమ్స్ తెలంగాణలో నిర్వహించండి

### కేంద్రమంత్రికి రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఖేలో ఇండియా గేమ్స్‌ను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండ వీయను కోరినట్లు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకాటి శ్రీహరి శుక్రవారం ఢిల్లీలో తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి చెప్పారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఉన్న స్పోర్ట్స్ స్కూల్స్‌కి ఆర్థికంగా సహాయం చేయాలని, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలతోపాటు ఆర్థిక సహకారం కూడా అందించాలని కేంద్రమంత్రిని కోరినట్లు తెలిపారు. త్వరలోనే మూడు రోజుల పాటు తెలంగాణలో పర్యటిస్తామని కేంద్ర మంత్రి చెప్పినట్లు మంత్రి వాకాటి శ్రీహరి తెలిపారు.

### అభినందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

# న్యాక్ ట్రైనర్ స్నేహలతకు రాష్ట్రపతి నుంచి అవార్డు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్‌ను అత్యుత్తమ స్కిల్ డెవలప్ మెంట్ వేదికగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చేస్తున్న కృషికి ఫలితం దక్కుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు విద్యార్థుల్లో స్కిల్ డెవల్మపెంట్ పెంపొందించాలనే లక్ష ్యంతో ఇప్పటికే ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌పెంట్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నది. అందులో భాగంగా హైదరాబాద్ వేదికగా, జిల్లాల్లో న్యాక్ ద్వారా శిక్షణ ఇవ్వడమే కాకుండా100 శాతం ఉపాధి కల్పించడమే లక్ష ్యంగా ఎన్ ఎసి వైస్ ఛైర్మన్,మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు మంత్రి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు.ఈ నేపథ్యంలోనే టీచర్స్ డే పురస్కరించుకొని న్యాక్ ట్రైనర్ స్నేహలతకు రాష్ట్ర పతి చేతుల మీదుగా జాతీయ అవార్డు రావడం పట్ల మంత్రి తన హర్షం వ్యక్తం చేశారు.

మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ విభాగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారి చేతుల మీదుగా శుక్రవారం ఢిల్లీలో జాతీయ ఉత్తమ టీచర్స్ అవార్డు అందుకున్న న్యాక్ ట్రైనర్ స్నేహలతకు ఫోన్ చేసి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఆమె న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా, కరీంనగర్, జగిత్యాల పట్టణాల్లో నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్ కోర్సులు, ఉద్యోగ అవకాశాలు కల్పించే వృత్తివిద్యా కోర్సులను అందిస్తూ, ఉత్తమ బోధన అందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని కొనియాడారు.

దేశవ్యాప్తంగా 13 మంది ఈ వార్డుకు ఎంపికైతే తెలంగాణ నుండి న్యాక్ ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హన్మకొండకు చెందిన నక్క స్నేహలతకు అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం అన్నారు.నైపుణ్యాలకు ఉత్తమ వేదికగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్న మంత్రి, ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు దక్కడంతో న్యాక్ ఫ్యాకల్టీ,సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. స్నేహలతను ప్రోత్సహించిన న్యాక్ డైరెక్టర్ శాంతి శ్రీ ని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.రాష్ట్ర పతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న స్నేహలతకు న్యాక్ డైరెక్టర్ జనరల్(డీజీ),ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్

# ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కేంద్రంపై నెపం సరికాదు

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతలను కప్పిపుచ్చుకోడానికి కేంద్రాన్ని, బిజెపిని నిందించడం సరైనది కాదని, కేంద్ర ప్రభుత్వం రైతుల, వ్యవసాయ రంగానికి నిరంతరం మద్దతు ఇస్తుందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వం ఉందా? ఉందంటే, కాంగ్రెస్ ప్రభుత్వానికి సమన్వయం ఉందా అనే సందేహం ప్రజల్లో ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ యూరియా కొరత లేదని, సమస్య కేవలం పంపిణీలోనే ఉందని చెబుతున్నారు.కానీ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ యూరియా కొరత ఉందని, దానికి కేంద్రమే బాధ్యత అని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. మహేశ్ కుమార్ గౌడ్‌కి వాస్తవ పరిస్థితి తెలుసుకోవడానికి ప్రయత్నం చేయడంలేదా? లేక కేవలం కమ్యూనికేషన్‌లో లోపమేనా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో అక్టోబర్ 31 వరకు అవసరాల మేరకు 9.3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందించింది, 2.8 లక్షల మెట్రిక్ టన్నులు బఫర్ స్టాక్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. మరి ఎరువుల కొరత ఇంకెక్కడిది?జులైలోనే 20శాతం మేర ఎక్కువ యూరియాను రాష్ట్రానికి కేంద్రం పంపించింది. టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేంద్రాన్ని బదనాం చేసే ప్రయత్నం చేస్తూ, అసలు లోపాన్ని బయటపెట్టడం లేదన్నారు. ఆదిలాబాద్, మహబూబ్ నగర్, వికారాబాద్‌లో ఎరువుల లారీలు పట్టు బడినట్లు, ఎరువుల దుకాణాలు మూసివేసినట్లు వార్తలు వస్తున్నాయి.ఇక్కడ బ్లాక్ మార్కెటింగ్, పంపిణీ లోపాలు ఎక్కడ జరిగాయి అనే విషయం పరిశీలించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓఆర్ఆర్‌పై సిట్ విచారణ చేపడతామని చెప్పింది. కానీ ఇప్పటివరకు ఏ విచారణ జరగడం లేదు. ఇందులో ఏమైంది, ఎక్కడ ఎంత డబ్బు ముట్టిందనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయి. గత బిఆర్ఎస్ సర్కారు కమీషన్లు తీసుకొని కాంట్రాక్టర్లకు అమ్మేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై విచారణ చేయకుండా నిరక్ష ్యల్లి వహిస్తుందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రివ్యూ జరపకపోతే ప్రజల ఆగ్రహానికి భాద్యత వహించాల్సి వస్తుంది. అవినీతికి నిదర్శనంగా ఓఆర్ఆర్ మారింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం వాహనదారులపై



భారం తగ్గిస్తుంటే.. కాంగ్రెస్ సర్కారు అసమర్థతతో భారం పెరుగుతోంది.కేంద్రం జాతీయ రహదారులపై టోల్ ఛార్జీలను తగ్గించడంలో కీలక నిర్ణయం తీసుకుంది. అదే విధానాన్ని ఓఆర్ఆర్‌పై కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

MN 12 ONG_06-09pg10.qxd 9/5/2025 10:59 PM Page 1



# ఆసియా కప్‌లో.. భారత్‌దే ఆధిపత్యం

## టైటిల్ అందించిన కెప్టెన్లు


సునీల్ గవాస్కర్


దిలీప్ వెంగసర్కర్


అజారుద్దీన్


ఎంఎస్ ధోనీ



రోహిత్ శర్మ

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ ప్రారంభమైనప్పటి నుంచి భారత జట్టుదే ఎక్కువ ఆధిపత్యం. ఇప్పటివరకు జరిగిన 16 ఎడిషన్లలో భారత్ అత్యధికంగా 8 సార్లు టైటిల్ గెలుచుకుంది. ప్రతి టైమ్ లైన్‌లో ప్రతి కెప్టెన్ తనదైన శైలితో జట్టుని గెలిపించడం భారత క్రికెట్ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. అలా ఆసియా కప్‌లో ఇప్పటివరకు భారత్‌కు 5 కెప్టెన్లు టైటిల్ అందించారు. 1984లో జరిగిన తొలి ఆసియా కప్‌లో భారత్‌కు సునీల్ గావస్కర్ నాయకత్వం వహించాడు. అప్పట్లో కేవలం మూడు జట్లే భారత్, పాకిస్థాన్, శ్రీలంక పాల్గొన్నాయి. గావస్కర్ కెప్టెన్సీలో భారత్ పాకిస్థాన్‌పై 54 పరుగుల తేడాతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. మొదటి కెప్టెన్‌గా ఆసియా కప్ ట్రోఫీని లిఫ్ట్ చేసిన గర్వకారణం ఆయనకే దక్కింది. అలాగే 1988 ఆసియా కప్‌లో భారత్ రెండోసారి విజేతగా నిలిచింది.

ఈసారి దిలీప్ వెంగసర్కర్ కెప్టెన్సీ వహించారు. శ్రీలంక, పాకిస్థాన్‌వంటి జట్లతో పోటీపడుతూ జట్టుని సమర్ధవంతంగా నడిపించాడు. ఇక 1990/91, 1995లో భారత్ 2 సార్లు ఆసియా కప్ గెలుచుకుంది. ఈ రెండు విజయాలకు కెప్టెన్‌గా అజారుద్దీన్ ఉన్నారు. ప్రత్యేకంగా 1995లో జరిగిన ఫైనల్లో ఆయన 90 పరుగులు నాటౌట్‌గా చేసి జట్టుని విజేతగా నిలిపారు. భారత క్రికెట్‌లో మోస్ట్ సక్సెస్ ఫుల్ కెప్టెన్లలో ధోనీ ఒకడు. 2010లో శ్రీలంకపై భారత్ విజయం సాధించి ఆసియా కప్ ట్రోఫీని గెలుచుకుంది. ఆ తర్వాత 2016లో జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై గెలిచి మరోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈసారి మ్యాచ్ టి20 ఫార్మాట్‌లో జరిగింది. అందుకే ధోనీ ఒడిఐ, టి20 రెండు ఫార్మాట్లలో ఆసియా కప్ గెలిపించిన ఏకైక భారతకెప్టెన్‌గా చరిత్రలో నిలిచాడు. కాగా 2018లో బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ భరితమైనఫైనల్లో భారత్‌గెలిచి టైటిల్ సాధించింది. ఆ సమయంలో కెప్టెన్‌గా రోహిత్ శర్మ జట్టుని ముందుండినడిపాడు. 2023లో శ్రీలంకపై ఫైనల్లో విజయం సాధించినప్పుడు మాత్రం పూర్తి అధికారిక కెప్టెన్‌గా ట్రోఫీ లిఫ్ట్ చేశారు. ఆ ఫైనల్లో భారత్ అద్భుత ప్రదర్శనతో శ్రీలంకని కేవలం 50 పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ స్వల్పలక్ష్యాన్ని టీమ్ ఇండియా 6.1ఓవర్లలో లక్ష్యాన్ని చేధించింది. ఇది ఆసియా కప్ చరిత్రలోనే ఒక రికార్డు విజయంగా నిలిచింది.



# మహిళల హాకీ ఆసియా కప్.. భారత్ చేతిలో థాయిలాండ్ చిత్తు

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఆసియా కప్-2025, ప్రారంభ మ్యాచ్‌లో భారత మహిళలు థాయిలాండ్‌పై ఆధిపత్యం సంపాదించారు. చైనాలో శుక్రవారం జరిగిన ఈ తొలి మ్యాచ్‌లో భారత్ థాయిలాండ్‌ను 11-0 తేడాతో ఓడించింది. బ్యూటీ డంగ్ డంగ్, ఉదిత చెరో రెండు గోల్స్ చేశారు. పూల్ బి మ్యాచ్‌లో భారత్ తరఫున ముంతాజ్ ఖాన్ (7 నిముషం, 49 నిముషం), ఉదిత (30, 52), బ్యూటీ డంగ్ డంగ్ (45, 54) రెండేసి గోల్స్ చేయగా, సంగీతా కుమారి (10), నవనీత్ కౌర్ (16వ నిముషం), లాల్‌రెమ్సియామి (18), షర్మిలా దేవి (57)తో పాటు డిదాసో (57) స్కోర్ చేశారు. తొలి క్వార్టర్‌లో ముంతాజ్ ఖాన్ (7), సంగీతా కుమారి (10) చేసిన 2 ఫీల్డ్ గోల్స్‌తో భారత్ ఆరంభంలోనే తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. 2వ క్వార్టర్‌లో భారత్ తన దాడి తీవ్రతను మరింత పెంచుకుని మరో 3 గోల్స్‌తో తమ ప్రయోజనాన్ని విస్తరించుకుంది. అనుభవజ్ఞులైన ఫార్వర్డ్ నవనీత్ కౌర్ (16) మరియు మిడ్‌ఫీల్డర్ లాల్రెమ్సియామి (18) వరుసగా 2 ఫీల్డ్ గోల్స్ చేశారు. ఆ తర్వాత ఉదిత (30) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చి మొదటి అర్ధభాగాన్ని బలంగా ముగించారు. రెండవ అర్ధభాగం కూడా ఇదే ధోరణిని అనుసరించింది. భారత్ థాయిలాండ్ సర్కిల్‌లో నిరంతరం దాడులకు పాల్పడి మూడవ క్వార్టర్‌లో 4 పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుంది. దీని ద్వారా బ్యూటీ డంగ్ డంగ్ (45) 45వ నిమిషంలో తన మొదటి గోల్ చేసింది. మ్యాచ్ చివరి క్వార్టర్‌లో భారత్ వరుసగా 5 గోల్స్ చేసి తొలి మ్యాచ్‌లో భారీ విజయాన్ని నమోదుచేసింది. ముంతాజ్ ఖాన్ (49), ఉదిత (52), షర్మిలా దేవి (57) పెనాల్టీ కార్నర్‌ల ద్వారా గోల్స్ చేయగా, బ్యూటీ డంగ్ డంగ్ (54) మరియు రుతుజా దాదాసో పిసల్ (60) తమ జట్టు తరపున ఫీల్డ్ గోల్స్‌చేశారు. భారత్ తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 6, శనివారం జపాన్‌తో తలపడుతుంది.

# పసికూనపై పాక్ ప్రతాపం.. యుఎఇపై 31 పరుగుల తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ ఫైనల్‌కు చేరింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)తో షార్జా వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 31 పరుగుల తేడాతో గెలుపొందింది. దీంతో ఈ ట్రై సిరీస్‌లో పాక్‌కు ఇది మూడో విజయం. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లో 5 వికెట్లు నష్టానికి 171 పరుగులు చేసింది. ఓపెనర్లు షాహిబ్‌జాదా ఫర్హాన్ (16), నయిమ్ ఆయుబ్ (11) విఫలం కాగా, వన్‌డౌన్ బ్యాటర్ జమాన్ అద్భుత అర్ధ శతకంతో ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ 44 బంతులు ఎదుర్కొని 10 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 77 పరుగులతో ఆఖరి వరకూ అజేయంగా నిలిచాడు. ఫఖర్ జమాన్‌కు తోడుగా మహ్మద్ నవాజ్ (27 బంతుల్లో 37 నాటౌట్) వేగంగా ఆడాడు. దీంతో పాక్ మెరుగైన స్కోరు సాధించగలిగింది. యుఏఈ బౌలర్లలో హైదర్ అలీ 2 వికెట్లు తీయగా, జునైద్ సిద్దిఖీ, మహ్మద్ రోషిద్ ఖాన్, ధ్రువ్ పరాశర్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. ఇక పాక్ విధించిన 171 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో యూఏఈకి ఆదిలోనే దెబ్బ తగిలింది. కెప్టెన్, ఓపెనర్ మహ్మద్ వసీం (19)ను అబ్రార్ అహ్మద్ స్వల్ప స్కోరుకే పెవిలియన్‌కు పంపించాడు. అయితే మరో ఓపెనర్ అలిశాన్ షరాఫూ మాత్రం హాఫ్ సెంచరీతో రాణించాడు. 51 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 68 పరుగులు సాధించాడు. కానీ పాక్ బౌలర్ల విజృంభణతో మిగిలిన బ్యాటర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టడంతో షరాఫూ అర్ధ శతకం వృధా అయింది. ఎథాన్ డిసౌజా (9), ఆసిఫ్ ఖాన్ (7), రాహుల్ చోప్రా (0), హర్షిత్ కౌశిక్ (3), జునైద్ సిద్దిఖీ ఇలా వచ్చి అలా వెళ్లగా ధ్రువ్ పరాశర్ (18 నాటౌట్), హైదర్ అలీ (12 రనౌట్) డబుల్ డిజిట్ స్కోరు చేయగలిగారు. ఈ క్రమంలో నిర్ణీత 20 ఓవర్ల ఆట పూర్తయ్యేసరికి యూఏఈ 7 వికెట్లు నష్టానికి 140 పరుగులు చేయగలిగింది.



# యుఎస్ ఓపెన్ సెమీఫైనల్ మహిళల సింగిల్స్.. ఫైనల్‌కు సబలెంకా

## పెగులా సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** ఉత్కంఠభరితమైన మూడు సెట్ల సెమీఫైనల్లో టాప్ సీడ్, డిఫెండింగ్ ఓపెన్ ఛాంపియన్ అరినా సబలెంకా 4-6, 6-3, 6-4 తేడాతో నాల్గవ సీడ్ జెస్సికా పెగులాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఆర్థర్ ఆషే స్టేడియంలో శుక్రవారం జరిగిన టోర్నీలో సబలెంకాకు ఇది వరుసగా ఐదవ యుఎస్ ఓపెన్ సెమీఫైనల్. ఇది సబలెంకాకు ఏడవ గ్రాండ్ స్లామ్ ఫైనల్ అవుతుంది. పెగులా ప్రారంభంలోనే పూర్తి ప్రయోజనాన్ని పొందింది. ప్రారంభ సెట్‌ను ఆడి సబలెంకాను సమతుల్యత నుండి దూరంగా ఉంచింది. ఆమె తనను తాను మూడు అనవసర తప్పిదాలకు మాత్రమే పరిమితం చేసుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మరియు రోలాండ్ గారోస్ ఫైనల్స్, అలాగే వింబుల్డన్ సెమీస్ రెండింటిలోనూ విఫలమైన 27 ఏళ్ల సబలెంకా, రెండవ సెట్‌లో మళ్ళీ మొదటి స్థానంలో నిలిచింది, ఈసారి ప్రారంభంలో 3-0 ఆధిక్యం కోసం పటిష్టం చేసింది, మూడో సెట్‌ను 30-40తో ప్రారంభించడంలో సహాయపడుతూ, పెగులా ఫోర్‌హ్యాండ్‌ను బేస్‌లైన్ దాటి పంపింది. ముఖ్యంగా తొమ్మిది నిమిషాల పాటు కొనసాగిన ఆరో గేమ్‌లో అమెరికన్ సబలెంకా సర్వీస్‌పై ఒత్తిడి తెస్తూనే ఉంటుంది. కానీ 30 ఏళ్ల పెగులా ఏడు బ్రేక్ అవకాశాలలో రెండింటిని మాత్రమే గోల్‌గా మార్చగలిగింది. మ్యాచ్ కోసం 5-4, 40-30తో సర్వ్ చేస్తూ, సబలెంకా నెట్‌లోకి కొట్టి పెగులా మరో మ్యాచ్ పాయింట్‌ను సేవ్ చేయగలిగింది. కానీ మూడవదాన్ని సేవ్ చేయలేకపోయింది, రెండు గంటల ఐదు నిమిషాల్లో పడిపోయింది.

# యుఎస్ ఓపెన్‌లో యుకీ భాంబ్రీ జోడీ ఓటమి



**న్యూఢిల్లీ:** ఓటమితో యుకీ భాంబ్రీ జోడీ యుఎస్ ఓపెన్-2025 టోర్నీ కలల పరుగు ముగిసింది. యుఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో భారత్‌కు చెందిన యుకీ భాంబ్రీ-న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్ జోడీ బ్రిటిష్ ద్వయం జో సాలిస్‌బరీ-నీల్ స్కుప్స్కి చేతిలో ఓడిపోయారు. బ్రిటిష్ ద్వయంతో జరిగిన ఉత్కంఠభరితమైన సెమీఫైనల్లో 7-6(72), 6-7(58), 4-6 తేడాతో భాంబ్రీ-వీనస్ జంట ఓడిపోయారు. లూయిస్ ఆర్మ్‌స్ట్రాంగ్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఈ పోటీ, కనీసం మొదటి సెట్ టైబ్రేక్ ప్రారంభమయ్యే వరకు హోరాహోరీగా సాగింది. ఆ తర్వాత, భాంబ్రి-వీనస్ 7-6(2)తో మొదటి ఫ్రేమ్‌ను కైవసం చేసుకోవడానికి కేవలం 2 పాయింట్లు మాత్రమే వదులుకున్నారు. రెండవ సెట్‌లో, భాంబ్రి-వీనస్ మొదటి గేమ్‌లో తమ ప్రత్యర్థుల సర్వీస్‌ను బ్రేక్ చేయడం ద్వారా నియంత్రణ సాధించారు. భాంబ్రి-వీనస్ కూడా సర్వీస్‌ను వదులుకునే వరకు, ఆటలో ఎదురుదెబ్బ తప్పదని అనిపించింది. ఆ తర్వాత మరికొన్ని గట్టి, ఉత్కంఠభరితమైన ఆటలు జరిగాయి, ఫలితంగా మరో టైబ్రేక్ వచ్చింది. ఈసారి, టైబ్రేక్ మరియు సెట్ 7-6 (5)తో బ్రిటిష్ వారికి దక్కింది. మూడవ సెట్‌లో, సాలిస్‌బరీ-స్కుప్స్కి అకస్మాత్తుగా ఆధిపత్యం చెలాయించారు. ముఖ్యంగా నెట్ వద్ద. 5-3తో ఆధిక్యంలో, బ్రిటిష్ 3 మ్యాచ్ పాయింట్లను సంపాదించారు. వాటిలో మూడింటినీ వారు వృధా చేశారు. కానీ సాలిస్‌బరీ-స్కుప్స్కి 6-4తో నిర్ణయాత్మక సెట్‌ను గెలుచుకున్నారు.

# రూ.855కోట్లకు ఛార్టర్డ్ స్పీడ్ ఐపిఒ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** ఛార్టర్డ్ స్పీడ్ సంస్థ రూ.855 కోట్ల ఐపిఒకోసం సెబీవద్ద డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఈక్విటీద్వారా 655 కోట్లు, ఆఫర్‌ఫర్‌సేల్ ద్వారా 200 కోట్లు సమీకరించేందుకు నిర్ణయించింది. ప్రమోటర్లు పంకజ్ గాంధీ, అల్కా పంకజ్ గాంధీలకు ఉన్న వాటాలను ఆఫర్‌ఫర్‌సేల్‌ద్వారా విక్రయిస్తారు. ఈ నిధుల్లో రూ.97 కోట్లు విద్యుత్ బస్సుల్లో పెట్టుబడులుపెడుతుంది. మరో 396.4 కోట్లు రుణాలచెల్లింపులకు వినియోగిస్తుంది. ఇతర మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తామని తెలిపింది. కంపెనీ ప్రిఐపిఒ ప్లేస్‌మెంట్‌కింద రూ.131కోట్లకు నిధులు సమీకరించాలనినిర్ణయించింది. అహ్మదాబాద్‌కేంద్రంగా ఉన్న ఛార్టర్డ్ స్పీడ్ 2007నుంచి అమలులో ఉంది. 2018లో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా కన్వర్ట్ అయింది.

భారత్‌లోని ప్యాసింజర్ రవాణా సంస్థల్లో ఒక లీడింగ్ సంస్థగా కొనసాగుతోంది. ఈ యేడాది జూన్‌నాటికి కంపెనీ రెండువేల బస్సులను 500 నగరాల్లో నడిపింది. 3.5 లక్షలమంది ప్రయాణీకులను ప్రతినిత్యం తమ బస్సుల్లో చేరవేస్తున్నట్లు తెలిపింది. గుజరాత్, ఒడిశా,మధ్యప్రదేశ్; రాజస్థాన్,అ స్సాం రాష్ట్రాల్లో అంతర్‌రాష్ట్ర సర్వీసులు కూడా నడుపుతోంది. ఆపరేషన్స్‌తో రాబడులు 666.7 కోట్లు ఉండగా 2023లో 332 కోట్లు వచ్చాయి. తొలిత్రైమాసికంలో నికరలాభం 70 కోట్లుగా కంపెనీ ప్రకటించింది. మొత్తం 945 విద్యుత్ బస్సులు అనుబంధ సంస్థలద్వారా నడుపుతోంది. ఇష్యూకు మోతీలాల్ ఓస్వల్ ఇన్వెస్ట్‌మెంట్ సలహాదారులుగాను, ఎస్‌బిఐ కేపిటల్ మార్కెట్లు బుక్‌రన్నింగ్ లీడ్‌మేనేజర్లుగా ఉన్నారు.




# సెన్సెక్స్,నిఫ్టీలకు ఎఫ్ఎంసిజి, ఐటి రంగాల షాక్!



**ముంబయి, సెప్టెంబరు 6:** ఎఫ్ఎంసిజి, ఐటి రంగాల్లో ట్రేడర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపించడంతో మార్కెట్లు లాభనష్టాల్లో ఊగిసలాడాయి. జిఎస్‌టి 2.0 వచ్చినా లాభాలు ఒక్కరోజుకే పరిమితం అయ్యాయి. నిఫ్టీ 24,621.60 పాయింట్లవద్దనే నిలిచిపోయింది. ఇక బిఎస్‌సి సెన్సెక్స్ 7.25 పాయింట్లు క్షీణించి 80,710.76 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివస్తే నిఫ్టీ 50 సూచీ కేవలం 6.70 పాయింట్లు మాత్రమే లాభపడింది. ఐటిసి 2.01శాతం, టిసిఎస్ 1.53శాతం, ఇన్ఫోసిస్ 1.29శాతం చొప్పున అమ్మకాలు సాగడంతో క్షీణించాయి. ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.10శాతం క్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ 0.09శాతం పెరిగాయి. మార్కెట్లపరంగా 2134 కంపెనీల షేర్లు పెరిగితే 1957 కంపెనీలషేర్లు క్షీణించాయి. 181 షేర్లు స్థిరంగా కొనసాగాయి. భారత్‌పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్లు 0.46శాతం క్షీణించి 6.461శాతానికి చేరింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌పరంగా రూపాయి మారకం విలువలు క్షీణించాయి. 88.25 వద్ద కొనసాగి చివరకు 88.12 వద్ద ముగిసింది.ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు అక్టోబరు 3వ తేదీనాటికి 0.33శాతం పెరిగి 106,770వద్ద ముగిసాయి. అమెరికా బాండ్లుకూడా 0.48శాతం క్షీణించి 4.156 కూపన్‌రేట్‌తో నడిచాయి. ఇక ప్రపంచ మార్కెట్లపరంగా యూరోపియన్ మార్కెట్లు శుక్రవారం భారీగానే ముగిసాయి. అమెరికా జాబ్ రిపోర్టుపై ఇన్వెస్టర్లు ఎదురుచూసారు. అలాగే రానునన ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లకోతలపైనా ఆసక్తిచూపించారు. జపాన్ నిక్కీ సేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా ట్యారిఫ్‌లే ఇందుకు కారణం. ఇక స్టాక్స్‌పరంగా ఓలా ఎలక్ట్రిక్ 7.25శాతం, ప్రోస్టార్మ్ ఇన్ఫోసిస్టమ్స్ 9.79శాతం, ట్రాన్స్‌వరల్డ్ షిప్పింగ్‌లైన్స్ 8.15శాతం చొప్పున పెరిగాయి. అలాగే పిఎన్‌సి ఇన్‌ఫ్రాటెక్ 2.35శాతం, ఇండోటెక్ ట్రాన్స్‌షార్మర్స్ 2.35శాతం, పెరిగితే జైడస్ లైఫ్‌సైన్సెస్ 0.21శాతం క్షీణించాయి.

# స్పైస్‌జెట్‌కు రూ.238 కోట్ల నష్టం




**ముంబయి, సెప్టెంబరు 5:** ప్రైవేటురంగంలోని స్పైస్‌జెట్ జూన్‌త్రైమాసికంలో రూ.238 కోట్ల నష్టం చవిచూసింది. ఇదే కాలంలో గత ఏడాది 150 కోట్ల లాభాలను చవిచూసిన సంస్థ ఈ సారిమాత్రం నష్టాలు నమోదుచేసింది. ట్రావెల్ డిమాండ్ మందగించడం, కొన్ని రూట్లలో మరింతగా సర్వీసులు నిలిపివేయడంకూడా ఇందుకు కారణం అయింది. దీనికితోడు ఆపరేషన్ సింధూర్‌తో రూట్లు అన్ని నిలిచిపోయాయి. దీనితో ఆపరేషన్‌కూడా సంస్థ నష్టాలకు కొంత కారణం అయింది. అలాగే పాక్‌గగనతలం మూసివేయడం కూడా ఒక కారణంగా చెపుతున్నారు. కొన్ని విమాన సర్వీసులు సర్వీసుకు గ్రౌండ్ అవడం, కొన్నింటికి లీజు వివాదాలు, ఆర్థిక ఒత్తిళ్లు కూడా పనితీరుపై ప్రభావంచూపించాయి. ఆపరేషన్స్ ద్వారా రాబడులు 35శాతంతగ్గాయి. 1695 కోట్ల నుంచి 1106 కోట్లకు పడిపోయాయి. ఇబిఐడిటిఎ కూడా 402 కోట్లనుంచి 18 కోట్లకు పడిపోయింది. సంస్థ ఛైర్మన్ అజయ్‌సింగ్ మాట్లాడుతూ అనుకోని తీవ్రస్థాయి సవాళ్లు రావడంతో సంస్థకు కొంతమేర రికవరీ కష్టం అయిందని, రానున్న కాలంలో అన్నింటినీ అధిగమిస్తామని వెల్లడించారు. జూన్‌త్రైమాసికంలో సంస్థ సంపద మొత్తం 446 కోట్లుపెరిగింది. గత ఏడాది 2398 కోట్ల లోటునుంచి ఈసారి కొంతమేర సంపదను పెంచుకోగలిగింది.

## జీఎస్టీ హేతుబద్ధీకరణతో వాణిజ్యం

# ప్రభుత్వ రాబడుల లోటు తక్కువే!

## ఎస్‌బిఐ రీసెర్చి నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** దేశంలో వస్తు, సేవల పన్ను (జిఎస్టీ) విధానంలో చేపట్టిన సంస్కరణల వల్ల ప్రభుత్వ ఖజానాపై పడే భారం చాలా స్వల్పమేనని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తన తాజా పరిశోధన నివేదికలో వెల్లడించింది. జిఎస్టీ మండలి తీసుకున్న రేట్ల హేతుబద్ధీకరణ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి ఏటా కేవలం రూ. 3,700 కోట్ల మేరకు ఆదాయం తగ్గుతుందని అంచనా వేసింది. ఈ మొత్తం చాలా తక్కువ కావడంతో ద్రవ్య లోటుపై ఎలాంటి ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది. 56వ జిఎస్టీ మండలి సమావేశంలో జిఎస్టీ శ్లాబులు ఇకపై రెండే ఉంటాయని చెప్పిన సంగతి తెలిసిందే. వాటిని ఈనెల 22వ తేదీనుంచే అమలుకు తెస్తామని కూడా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇప్పటివరకు ఉన్న 5%, 12%,18%, 28%అనే నాలుగు అంచెల పన్ను విధానాన్ని రద్దు చేశారు. దీని స్థానంలో 5%, 18% అనే రెండు శ్లాబులతో పాటు కొన్ని ఎంపిక చేసిన వస్తు, సేవలపై 40%డీమెరిట్ రేటును ప్రవేశపెట్టారు. ఈ మార్పుల వల్ల ప్రభుత్వానికి ఏటా రూ. 48,000 కోట్ల నష్టం వస్తుందని ప్రభుత్వం అంచనా వేయగా, ఎస్బీఐ అంచనా దీనికి పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం. ఈ సంస్కరణల వల్ల వినియోగం పెరిగి ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా, సామాన్యులకు ఇది ఎంతో ఊరటనిచ్చే అంశమని తెలిపింది. దాదాపు 295 నిత్యావసర వస్తువులపై పన్ను రేటును 12%నుంచి 5% లేదా సున్నా శాతానికి తగ్గించడంతో రిటైల్ ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గుతుందని అంచనా వేసింది. దీనివల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ద్రవ్యోల్బణం 25 నుంచి 30 బేసిస్ పాయింట్ల వరకు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. 2026-27 నాటికి ద్రవ్యోల్బణం మొత్తం మీద 65 నుంచి 75 బేసిస్ పాయింట్ల మేర తగ్గుముఖం పడుతుందని వివరించింది. ఈ సంస్కరణల ఫలితంగా జీఎస్టీ సగటు భారిత రేటు కూడా గణనీయంగా తగ్గనుంది. 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టినప్పుడు 14.4%గా ఉన్న ఈ రేటు, తాజా మార్పులతో 9.5 శాతానికి దిగి వస్తుందని ఎస్బీఐ నివేదిక పేర్కొంది. అంతేకాకుండా, వ్యయాలు తగ్గడం వల్ల బ్యాంకింగ్ రంగానికి కూడా ఈ సంస్కరణలు సానుకూల ఫలితాలనిస్తాయని అభిప్రాయపడింది.




# భారత్‌లో తొలి టెస్లాకారు కొనుగోలుచేసిన మహారాష్ట్ర మంత్రి

**ముంబయి, సెప్టెంబరు 5:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జులై 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఆ తర్వాత ఢిల్లీలో రెండో షోరూంను కూడా లాంఛ్ చేసింది. భారత విపణిలోకి అడుగుపెట్టిన తర్వాత టెస్లా తాజాగా తన తొలి కారును కస్టమర్‌కు డెలివరీ చేసింది. తెలుపు రంగు టెస్లా 'వై మోడల్' కారును మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ కొనుగోలు చేశారు. ముంబై బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నుంచి తొలి కారును ఇవాళ మంత్రికి సంస్థ ప్రతినిధులు డెలివరీ చేశారు. కారు తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా దేశంలోనే తొలి టెస్లా కారును కొనుగోలు చేయడం పట్ల మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ సంతోషం వ్యక్తం చేశారు. విద్యుత్ వాహనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే తాను ఈ కారును కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది టెస్లా. రియర్‌వీల్ డ్రైవ్, లాంగ్‌రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్‌వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్‌రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే ఆర్‌డబ్ల్యుడి వెర్షన్ ఆన్‌రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్‌రేంజ్ వెర్షన్ ఆన్‌రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జిఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. అయితే, భారత్‌లో సగటు ఎలక్ట్రిక్ కారు ధర రూ.22 లక్షలు ఉంది. టెస్లా మోడల్ వై ధర దాదాపు రూ.60 లక్షల వరకు ఉంది. మరోవైపు ఎన్నో అంచనాలతో భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టిన ఈ సంస్థకు నిరాశే ఎదురైంది. ఆశించిన స్థాయిలో బుకింగ్స్ జరగలేదని సమాచారం. జులై నుంచి ఇప్పటి వరకూ మొత్తం 600 బుకింగ్స్ మాత్రమే వచ్చాయి. కంపెనీ అంచనాల కంటే ఇవి చాలా తక్కువ. ఎందుకంటే టెస్లా ప్రపంచ వ్యాప్తంగా కేవలం నాలుగు గంటల్లోనే ఈ సంఖ్య కార్లను విక్రయిస్తుంది. దీంతో భారత్‌లో టెస్లాకు అనుకున్నంత స్పందన రాలేదని కంపెనీకి చెందిన కీలక వ్యక్తులను ఊటంకిస్తూ ఆంగ్లమీడియా వెల్లడించింది. టెస్లాకు బ్రాండ్ పేరు ఉన్నప్పటికీ ఎక్కువ ధర కారణంగా భారత్ ఈవీ మార్కెట్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోతోందన్నది మార్కెట్ టాక్.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps